PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 140 | విజయవాడ, శనివారం 23 డిసెంబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 23 December 2023 | Rs

జిందాల్‌తో ఎంఒయు బయటపెట్టండి

- ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాలు ధర్నా

• లోపలి పేజీలో.•

పట్టు బిగిస్తున్న భారత్

- స్మృతి, రీచా, రోడ్రిగ్స్, దీప్తి అర్ధసెంచరీలు
- ఆస్ట్రేలియాతో ఏకైక టెస్ట్‌లో 157పరుగుల ఆధిక్యత

8

మోడీని గద్దె దింపాలి

అప్పుడే దేశానికి, ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి రక్ష

జంతర్ మంతర్ వద్ద ప్రతిపక్షాల నిరసనలో వక్తలు

జంతర్‌మంతర్ వద్ద సభలో అభివాదం చేస్తున్న ఇండియా ఫోరం నేతలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడాలంటే కేంద్రంలో మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిందే నని జంతర్ మంతర్ వద్ద జరిగిన ర్యాలీలో వక్తలు పిలుపునిచ్చారు. పార్లమెంటు చరిత్రలో కని విని ఎరుగని విధంగా 146 మంది ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేసిన మోడీ ప్రభుత్వ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా 'ఇండియా' ఫోరమ్ దేశ వ్యాపిత నిరసనలకు ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీనుద్దేశించి సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ, ప్రతిపక్ష ఎంపీలను మూకుమ్మడిగా బహిష్కరించడం ద్వారా పార్లమెంటులో ప్రజాస్వామ్యాన్ని మోడీ ప్రభుత్వం ఖూనీ చేసిందన్నారు. 146 మంది ఎంపీలను సెస్పెండ్ చేయడం పార్లమెంటు చరిత్రలో ఎన్నడైనా విన్నామా అని ఆయన అన్నారు. బిజెపి మళ్లీ గెలిస్తే పార్లమెంటు ఉంటుందా అన్న సందేహం కలుగుతుందన్నారు. ప్రజలు ఎన్నుకున్న పార్లమెంటుకు ప్రభుత్వం జవాబుదారీగా ఉండాలని రాజ్యాంగం స్పష్టంగా పేర్కొంది. దీనికి భిన్నంగా బిజెపి ప్రభుత్వం ఎంపీలను బహిష్కరిస్తున్నది. పార్లమెంటును మూసివేస్తున్నది. రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తోందని ఏచూరి తీవ్రంగా ధ్వజమెత్తారు. . బిజెపి ప్రభుత్వ నిరంకుశ చర్యకు వ్యతిరేకంగా దేశ వ్యాపితంగా నిరసనలు వెల్లువెత్తాయి. సిపిఐ(ఎం), ఇతర వామపక్షాలు అన్ని చోట్లా ఈ నిరసనల్లో పాల్గొన్నాయి. కొల్‌కతాలో , లక్నోలో జరిగిన సభలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు సుభాషిణి ఆలీ పాల్గొన్నారు. విజయవాడ, హైదరబాద్‌లోనూ నిరసన ప్రదర్శనలు జరిగాయి. జార్ఖండ్‌లోని దేవగఢ్‌లో జరిగిన నిరసన ర్యాలీలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్ పాల్గొన్నారు.

విశాఖలో ఆందోళన చేస్తున్న ఇండియా వేదిక నాయకులు

3

ఢిల్లీలో జరిగిన ర్యాలీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే , ఆ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ఎన్సీపి అధ్యక్షుడు శరద్ పవార్, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా, లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ నాయకుడు అధీర్ రాజన్ చౌదరి, డిఎంకె నేత తిరుచ్చి శివ, సిపిఐఎంఎల్ నేత భట్టాచార్య, జెఎంఎం నేత మహువా మాంఝీ, ఆప్ ఎంపి సుశీల్ కుమార్ రింకు ఇతర ముఖ్య నేతలు పాల్గొని బిజెపిని నిశితంగా విమర్శించారు. ప్రతిపక్ష ఎంపిలను బహిష్కరించి 60 శాతం ప్రజల గొంతును మోడీ నొక్కేశారని అన్నారు. బిజెపి ద్వేషాన్ని వ్యాప్తి చేస్తుంటే, 'ఇండియా' ఫోరం ప్రేమ, సౌభ్రాతృత్వాన్ని చాటుతుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఎంతటి మూల్యం చెల్లించడానికైనా సిద్ధమని ఎన్సిపి అధినేత శరద్ పవార్ అన్నారు.

బెదిరింపులకు భయపడం

- ఆందోళన ఉధృతం చేస్తాం
- అంగన్‌వాడీ సంఘాల ప్రకటన
- వేతనాల పెంపు, గ్రాట్యుటీ ఇవ్వాల్సిందే
- మినీ సెంటర్లు మెయిన్ సెంటర్లుగా మార్పుపై జిఓ ఏదీ?

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరితే ప్రభుత్వం బెదిరింపులకు దిగుతోందని, వాటికి భయపడే ప్రసక్తే లేదని, ఆందోళనను ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ సంఘాలు హెచ్చరించాయి. శుక్రవారం నాడు విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, ఉపాధ్యక్షులు ఎన్‌సిహెచ్.సుప్రజ, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్(ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ, ఎపి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(ఐఎఫ్‌టియు) ప్రధాన కార్యదర్శి వి.ఆర్.జ్యోతి, నాయకులు గంగావతి తదితరులు మాట్లాడారు. సమ్మె విరమించకపోతే ఉద్యోగాల్లో నుండి తీసేస్తామని జిల్లాల్లో అధికారులు బెదిరింపులకు దిగుతున్నారని, అటువంటివాటికి భయపడే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అటువంటి చర్యలు మానుకుని, వర్కర్లు, మినీవర్కర్లు, హెల్పర్లకు జీతాలు పెంచాలని డిమాండు చేశారు. గ్రాట్యుటీ అమలు చేయాలని, లేనిపక్షంలో 25 తరువాత సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి పుట్టినరోజు సందర్భంగా అంగన్‌వాడీ అక్క చెల్లెమ్మలకు తీపికబురు చెబుతారని ఆశించామని, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి మాట్లాడుతూ చీరల కోసం రూ.16 కోట్లు వెచ్చించామని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. మొబైళ్లకు రూ.85 కోట్లు ఇచ్చామని చెప్పారని, అది సెంటర్ల నిర్వహణకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు. రకరకాల యాప్స్ తెచ్చి పనిభారం పెంచి బిపి, షుగర్లు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు పనిచేయక, సొంత ఫోన్లతోనే ఎక్కువమంది పనిచేస్తున్నారని తెలిపారు. అంతకుమించి అంగన్‌వాడీలకు చేసిందేమీ లేదని, పేద గర్భిణులు, బాలింతలకోసం సెంటర్లు నడపాలని చెప్పే ప్రభుత్వం వాటిని సరఫరా చేస్తున్న అంగన్‌వాడీలకు పౌష్టికాహారం అవసరం లేదా, అందుకు కనీస వేతనమైనా ఇవ్వరా అని ప్రశ్నించారు.

వైఎస్ఆర్ జిల్లా మైదుకూరులో రాష్ట్ర ఫుడ్ కమిటీ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్‌రెడ్డి కారు ముందు బైఠాయించిన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు

2

ముందస్తు చర్యలు చేపట్టండి

- కోవిడ్ కొత్త వేరియంట్‌పై సమీక్షలో సిఎం జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కోవిడ్ కొత్త వేరియంట్ జేఎన్-1 విస్తరణ పట్ల అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. క్యాంపు కార్యాలయంలో శక్రవారం ఆయన వైద్య, ఆరోగ్యశాఖకు చెందిన ఉన్నతస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో ఆయన మాట్లాడుతూ అత్యంత బలంగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ముందస్తు చర్యల కోసం అలర్ట్ చేయాలన్నారు.

కొత్త వేరియంట్ లక్షణాలు, తీసుకోవాల్సిన చర్యలపై విలేజ్ క్లినిక్స్ స్టాఫ్‌కు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా బోధన చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని సిఎం జగన్ ఆదేశించారు. అధికారులు మాట్లాడుతూ ఈ వైరస్ సోకినవారు ఆసుపత్రికి వెళ్లాల్సిన అవసరం లేకుండానే కోలుకుంటు న్నారని చెప్పారు. డెల్టా వేరియంట్ తరహా లక్షణాలు లేవని అధికారులు తెల్చారు. జెఎన్-1కు వేగంగా విస్తరించే లక్షణం ఉందని అధికారులు వివరించారు. లక్షణాలు ఉన్నవారికి ప్రభుత్వ ఆసుత్రుల్లో పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. పాజిటివ్ వచ్చిన శాంపిళ్లను విజయవాడ జీనోమ్ ల్యాబ్‌లో పరిశీలిస్తున్నామని తెలిపారు. కొత్త వేరియంట్ గుర్తించడానికి ఈ పరీక్షలు దోహదం చేస్తున్నాయని అన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ర్యాపిడ్ టెస్టింగ్ కిట్స్ పెడుతున్నట్లు తెలిపారు. ఆసుపత్రుల్లో పర్సనల్ కేర్ కిట్లు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వపరంగా ముందస్తు చర్యల్లో భాగంగా ఆక్సిజన్ ఇన్‌ఫ్రాను సిద్ధం చేస్తున్నాయన్నారు. అక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు, డి-టైప్ సిలిండర్లు కూడా సిద్ధం చేశామన్నారు. 56,741 అక్సిజన్ బెడ్లు కూడ సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. సమీక్ష సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, సిఎస్ జవహర్‌రెడ్డి, స్పెషల్ సిఎస్ కృష్ణబాబు, సెకండరీ హెల్త్ డైరెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డిఎస్‌విఎల్ నరసింహం తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

రిపబ్లిక్ డే పరేడ్ ముఖ్య అతిథిగా

బైడెన్ స్థానంలో మాక్రాన్

న్యూఢిల్లీ: భారత గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు ముఖ్య అతిథిగా మొదట ఆహ్వానించిన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ రావడం లేదని వైట్ హౌస్ తెలపడంతో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌ను భారత్ ఆహ్వానించింది. జనవరి 26న ఢిల్లీలో జరిగే పరేడ్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యే ఫ్రాన్స్ దేశాధినేతగా మాక్రాన్ ఆరో వ్యక్తి అవుతాడు. అయితే జో బైడెన్ ఎందుకు రావడం లేదనే దానిపై భారత్ లేదా అమెరికా స్పష్టమైన వివరణ ఇవ్వలేదు. ఖలిస్థాన్ అనుకూల గురుపత్వంత్ సింగ్ పన్నూన్ గురించి అంతర్జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోంది. అమెరికా గడ్డపై పన్నూన్‌ను చంపేందుకు భారత్ ప్రయత్నిస్తోందని అమెరికా ఆరోపిస్తోంది. ఇరువైపులా పలు సందేశాలు పరస్పరం మారాయి. అయితే బైడెన్ ఎందుకు హాజరు కాలేదనే దానిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జనవరి నెలాఖరులో అమెరికా కాంగ్రెస్‌లో ఆయన ప్రసంగించనున్నారు. 2024లో అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు ఉన్నాయి.

ఇన్ని దరఖాస్తులా...?

- ఫారం-7ల పై సిఇసి విస్మయం
- సరిచేయాలని సమీక్షలో సూచన
- నేడు కూడా కొనసాగనున్న సమావేశం

కలెక్టర్లు, ఎస్‌పిలు, సిఇఒలతో సమీక్ష నిర్వహిస్తున్న ఎన్నికల సంఘం ప్రతినిధులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలకు సంబంధించి ఓట్ల తొలగింపునకు (ఫారం-7) అందిన దరఖాస్తులపై కేంద్ర ఎన్నికల సంఘం విస్మయం వ్యక్తం చేసింది. పెద్ద సంఖ్యలో అందిన ఫిర్యాదులపై పరిశీలించేందుకు వచ్చిన ఎన్నికల సంఘం ప్రతినిధులు విజయవాడలోని ఒక హోటల్‌లో జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలు, సిఇఒలతో సమీక్ష నిర్వహించారు. సమీక్ష ప్రారంభంలోనే ఫారం-7 దరఖాస్తులకు సంబంధించిన నివేదికలు చూసిన సిఇసి అధికారులు 'ఇన్ని దరఖాస్తులా...' అంటూ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసినట్లు, 'అసలేం జరుగుతోంది ఇక్కడ...' అని ప్రశ్నించినట్లు తెలిసింది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ జనవరి 5న తుది జాబితా ప్రచురించిన తర్వాత 90లక్షల దరఖాస్తులు అందినట్లు తెలిపారు. వీటిలో 89 లక్షల దరఖాస్తులను పరిష్కరించామని, మిగిలిన వాటిని 26వ తేదీలోగా పరిష్కరిస్తామని చెప్పారు. సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనరు ధర్మేంద్ర శర్మ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో అవకతవకలు లేకుండా ఉండటం ఎంత ముఖ్యమో ప్రతి ఒక్కరు ఓటు వేసేలా రక్షణ కల్పించడం కూడా అంతే ముఖ్యమని చెప్పారు. ప్రతి ఒక్కరు ఓటు వేసేలా చూడాలని, ప్రజాస్వామ్యంలో అదే అత్యంత కీలకమని చెప్పారు. ప్రతి ఎన్నికల్లో తక్కువ ఓట్లు నమోదవుతున్న కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. మొదటి రోజు సమీక్షా సమావేశంలో సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్‌వ్యాస్‌ల నేతృత్వంలోని బృందం సభ్యులు స్వీప్ డైరెక్టర్ సంతోష్ అజ్మేరా, అండర్ సెక్రటరీ సంజయ్‌కుమార్, రాష్ట్ర జాయింట్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసరు ఎ.వెంకటేశ్వరరావు, స్టేట్ పోలీస్ నోడల్ అధికారి వినీత్ బ్రిజ్‌లాల్ హాజరయ్యారు. శనివారం కూడా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపిలతో సమావేశం కొనసాగనుంది.

టిటిడిలో హెల్త్ టెం'డర్'!

- పారిశుధ్య, ఎఫ్ఎంఎస్ కార్మికులపై వేటుకు రంగం సిద్ధం
- 5 వేల మంది ఉపాధికి గండి

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

గత రెండు దశాబ్దాలుగా తిరుమల తిరుపతి దేవస్థానాన్ని నమ్ముకొని పనిచేస్తున్న పారిశుధ్య, ఫెసిలిటీ మేనేజిమెంట్ సర్వీస్ (ఎఫ్ఎంఎస్) కార్మికులపై వేటు పడబోతోంది. గురువారం కొత్తగా పిలిచిన హెల్త్ టెండరల్లో నిబంధనలు అమలైతే వేలాది మంది ఉపాధి కోల్పోనున్నారు. దీంతో, వీరిలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. టిటిడిలో పారిశుధ్య విభాగంలో 3,500 మంది, ఎఫ్ఎంఎస్ కార్మికులు నాలుగు వేల మంది మొత్తం కలిపి 7,500 మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారు. తిరుమలలో పారిశుధ్యం, గదులను శుభ్రం వంటి విధులు వీరు నిర్వహిస్తున్నారు. వీరిలో మహిళా కార్మికులు 75 శాతం మంది ఉన్నారు. పద్మావతి కాంట్రాక్టు కార్మికుల అసోసియేషన్, పనోరమా సంస్థ, ఆలిండియా సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ అసోసియేషన్ ఆధ్వర్యాన వీరు విధులు నిర్వహిస్తున్నారు. ఈ మూడు సంస్థల కాంట్రాక్టు వచ్చే నెల ఒకటో తేదీతో ముగియనుంది. ఈ



నేపథ్యంలో టిటిడి కొత్తగా టెండర్లు పిలిచింది. ఈ టెండర్లలో కాంట్రాక్టర్లకు అనుకూలమైన, కార్మికులకు వ్యతిరేకమైన నిబంధనలు పెట్టింది. 45 ఏళ్లు దాటిన వారిని ఎవరినీ విధుల్లో ఉంచబోమని, మహిళ కార్మికులను 25 శాతానికి కుదిస్తామని పేర్కొంది. దీంతో, ఐదు వేల మంది ఉపాధి కోల్పోనున్నారు. పాదయాత్ర సందర్భంగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తాము అధికారంలోకి వస్తే పారిశుధ్య, ఎఫ్ఎంఎస్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని, రెగ్యులర్ ఉద్యోగులకు అందిస్తున్న సౌకర్యాలను సమకూరుసామని హామీ ఇచ్చారు. వైవి సుబ్బారెడ్డి టిటిడి బోర్డు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాక తొలి బోర్డు సమావేశంలో వీరికి టైంస్కేలు ఇచ్చేందుకు తీర్మానించారు. ఇవేవీ అమలు కాలేదు. పైగా, కార్మికుల పొట్టగొట్టే నిర్ణయానికి ఒడిగడుతున్నారు. ధర్మాన్ని కాపాడాల్సిన టిటిడి యాజమాన్యం శ్రీవారి వద్ద సేవ చేస్తున్న తమ జీవితాల్లో చీకటి నింపాలని చూస్తోందని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆందోళనకు సిద్ధమవుతున్నారు. దీనిపై టిటిడి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవిని వివరణ కోరగా, ఇప్పటి వరకూ ఏడు టెండర్లు వచ్చాయని తెలిపారు. టెండర్లను తెరిచేందుకు ఇంకా పది రోజులు సమయం ఉందని చెప్పారు. కార్మికుల కుదింపునకు సంబంధించి రూల్స్ ప్రకారమే చేస్తున్నామని తెలిపారు.

కార్మికుల పొట్టగొట్టే నిబంధనలొద్దు : టి సుబ్రమణ్యం, సిఐటియు

టిటిడిలో పారిశుధ్య పనుల నిర్వహణకు పిలిచిన టెండర్లలో ప్రస్తుతం పనిచేస్తున్న వేలాది మంది కార్మికులను తొలగించే నిబంధనలొద్దని సిఐటియు జిల్లా నాయకులు టి.సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. తిరుమల హెల్త్ ఆఫీసర్ 45 ఏళ్లు పైబడిన వారిని ఏ ఒక్కరినీ ఒకసాగించబోమని చెప్పడం అన్యాయమన్నారు. కొత్త టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు కొత్తగా పెట్టిన నిబంధనల ప్రకారమే కార్మికులను తీసుకుంటారని, దీనివల్ల కార్మికులు ఉపాధి కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి ఇఒ, హెల్త్ ఆఫీసర్ బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కొత్తగా పిలిచిన టెండర్లను రద్దు చేసి, గతంలో ఉన్న టెండర్ల విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

38 డిప్యూటీ డిఇఒ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యాశాఖలో 38 ఉప జిల్లా విద్యాశాఖ అధికారి పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) నోటిఫికేషన్ విడుదల చేసింది. జనవరి 9 నుంచి దరఖాస్తులు ప్రారంభమవుతాయని కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 29 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఒక్కో పేపర్ 150 మార్కుల చొప్పున మూడు పేపర్లలో పరీక్షను కమిషన్ నిర్వహించనుంది. ఇతర వివరాల కోసం అభ్యర్థులు కమిషన్ వెబ్‌సైట్ psc.ap.gov.inను సంప్రదించాలన్నారు.

ప్రకాశంలో ఘోర ప్రమాదం

- ఆటోను కారు ఢీకొనడంతో ఆరుగురు మృతి
- ముగ్గురికి తీవ్ర గాయాలు

2

పద్మశ్రీ అవార్డు వాపస్

రెజ్లింగ్ చీఫ్ ఎన్నికకు నిరసనగా బజరంగ్ పునియా

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) నూతన అధ్యక్షుడిగా బ్రిజ్‌భూషణ్ సింగ్ సన్నిహితుడైన సంజయ్ సింగ్ ఎన్నికపై నిరసనల పరంపర కొనసాగుతోంది. సంజయ్ సింగ్ ఎన్నికకు నిరసనగా రెజ్లింగ్ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రముఖ రెజ్లర్ సాక్షి మాలిక్ గురువారం ప్రకటించగా, తాజాగా మరో ప్రఖ్యాత రెజ్లర్ బజ్‌రంగ్ పునియా తనకు కేంద్రం ఇచ్చిన పద్మశ్రీ పురస్కారాన్ని వెనక్కి ఇచ్చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా వేదికగా తెలియజేశారు. సంజయ్ ఎన్నికకు నిరసన తెలుపుతూ ఒక లేఖను ప్రధానమంత్రి మోడీకి స్వయంగా అందజేసేందుకు పార్లమెంట్‌కు వెళుతున్న బజరంగ్ పూనియాను కర్తవ్యపథ్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. తాను ఎలాంటి నిరసనలు చేయడం లేదని, ఈ లేఖను ప్రధానమంత్రిని అందచేయడానికి మాత్రమే వెళుతున్నాని పునియా ఎంతగా బతిమిలాడినా పోలీసులు వినిపించుకోలేదు. అనుమతి ఇవ్వలేదు. దీంతో మోడీకి రాసిన ఆ లేఖను పునియా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.



పునియా చేతిలో పద్మశ్రీ అవార్డు, ప్రధానికి రాసిన లేఖ

"ప్రియమైన ప్రధాని గారూ, మీ ఆరోగ్యం క్షేమంగా ఉందని ఆశిస్తున్నాను. మీరు పనిలో బిజీగా ఉంటారు. అయినా కానీ దేశంలోని మల్లయోధుల వైపు మీ దృష్టిని మళ్లించడానికి నేను ఈ లేఖను రాస్తున్నాను' అని లేఖలో పునియా పేర్కొన్నారు.

'బ్రిజ్ భూషణ్ సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ ఈ ఏడాది జనవరిలో దేశంలోని మహిళా రెజ్లర్లు నిరసనను ప్రారంభించారని మీకు తెలిసే ఉంటుంది. నేను కూడా ఈ నిరసనల్లో పాల్గొన్నాను. ప్రభుత్వం గట్టి చర్యకు హామీ ఇవ్వడంతో నిరసన విరమించాం. అయితే మూడు నెలల తర్వాత కూడా బ్రిజ్ భూషణ్‌పై ఎటువంటి ఎఫ్ఐఆర్ లేదు. ఏప్రిల్‌లో మేము మళ్లీ వీధుల్లోకి వచ్చాము, తద్వారా అప్పుడు పోలీసులు అతనిపై కనీసం ఎఫ్ఐఆర్ మిగతా 7లో

ఎపిలో మరో కొత్త రాజకీయ పార్టీ

జెడి లక్ష్మీనారాయణ నేతృత్వంలో 'భారత్ నేషనల్ పార్టీ' ఆవిర్భావం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మరో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించింది. సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టరు లక్ష్మీనారాయణ శుక్రవారం జై భారత్ నేషనల్ పార్టీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇతర పార్టీల్లాగా తాము తప్పు చేయబోమన్నారు. బానిసత్వం నుంచి ప్రజలకు విముక్తి కలిగిస్తామన్నారు. అభివృద్ధితో అవసరాలు ఎలా తీర్చుకోవాలో నేర్పిస్తామని, అవినీతిని అంత మొందిస్తామని అన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు పెంపొందిస్తామని తెలిపారు.

కెయులో స్పాట్ అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్(కృష్ణా జిల్లా)

కృష్ణా విశ్వవిద్యాలయంలో ఎంబిఎ, ఎంసిఎ సీట్లు స్పాట్ అడ్మిషన్ల నోటిఫికేషన్ శుక్రవారం విడుదల చేశారు. ఎంబిఎ, ఎంసిఎ కోర్సుల్లో చేరాలి అనుకునే విద్యార్థులు ఈ నెల 28వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు విశ్వవిద్యాలయం డా. అంబేద్కర్ బ్లాకులో డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ విభాగం వద్దకు రావాలని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డా. నవీన లావణ్య లత తెలిపారు. అదే రోజు దరఖాస్తు దాఖలు, సంబంధిత కోర్సుల్లో ప్రవేశం ఉంటుందన్నారు. స్పాట్ అడ్మిషన్ కోసం వచ్చే వారు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా తీసుకురావాలని, ఎపిఐ సెట్‌లో అర్హత పొందిన వారు మాత్రమే స్పాట్ అడ్మిషన్ పొందడానికి అవకాశం వుంటుందని, యూజిసి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి మూడేళ్ల డిగ్రీ పొందిన వారికి మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు కృష్ణా విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ చూడాలని పేర్కొన్నారు.

కొత్త సర్వీస్ రూల్స్ తీసుకురావొద్దు

- విద్యుత్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ సంస్థల్లో కొత్త సర్వీస్ రూల్స్ తీసుకురావొద్దని విద్యుత్ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ఎపిఎస్ఇబి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ అసోసియేషన్, ఎపిఎస్ఇబి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా భోజన విరామ సమయంలో ఉద్యోగులు శుక్రవారం ఈ ఆందోళన నిర్వహించారు. కొత్తగా చేపట్టే నియామకాల్లో యాజమాన్యాలు అనుసరిస్తున్న విధానాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని ఆ సంఘాల నాయకులు ఈ సందర్భంగా తెలిపారు. కొత్త విధానంతో ఉద్యోగుల మధ్య చిచ్చుపెట్టాలనే ప్రయత్నం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్న వాటిని అమలు చేయకుండా కొత్త నిబంధనలు తీసుకురావాల్సిన అవసరం ఎందుకని ప్రశ్నించారు. ఈ ఆందోళనలో, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి ప్రతాప్‌రెడ్డి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

రిమాండ్ ఖైదీ పరారీ

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలోని మున్సిఫ్ సివిల్ కోర్టులో హాజరుపరిచి తిరిగి జిల్లా జైలుకు తీసుకెళ్తున్న రిమాండ్ ఖైదీ ఎన్.ముకుందరెడ్డి శుక్రవారం పరారయ్యాడు. ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం... పలు చోరీ కేసుల్లో నిందితుడైన సంతబొమ్మాళి మండలం బడే నరసాపురానికి చెందిన ఎన్.ముకుందరెడ్డి జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. వాయిదా కోసం కోర్టులో హాజరుపరిచేందుకు ఇద్దరు పోలీస్ ఎస్కార్ట్ కానిస్టేబుళ్లు స్థానిక మున్సిఫ్ సివిల్ కోర్టుకు తీసుకొచ్చారు. కేసు వాయిదా పడడంతో తిరిగి జిల్లా జైలుకు తరలించేందుకు బస్సు కోసం జాతీయ రహదారి సమీపానికి వచ్చారు. మూత్ర విసర్జనకు వెళ్తానని నిందితుడు చెప్పడంతో, ఎస్కార్ట్ కానిస్టేబుళ్లు అనుమతించారు. అంతలోనే పోలీసుల కళ్లుగప్పి చేతికి వేసిన బేడీలతో సహా పరారయ్యాడు. ఎఆర్ హెడ్ కానిస్టేబుళ్లు సాహు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ముకుందరెడ్డి కోసం గాలిస్తున్నారు.

లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, పే స్కేల్ ఎరియర్స్ చెల్లించాలి

- ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసి ఉద్యోగులకు 2017 పే స్కేల్ ఎరియర్స్, నాలుగేళ్ల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్లను చెల్లించాలని ఎపిపిటిడి ఎస్‌డబ్ల్యుఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలాని బాషా, అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ సుందరయ్య, అయ్యపరెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నెల్లూరు, కర్నూలు, ప్రకాశం, గుంటూరు, విజయవాడ, ఏలూరు, విశాఖ, విజయనగరం జిల్లాల పిటిఒ కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఆర్‌టిసి ఉద్యోగుల పెండింగ్ అప్పీల్స్‌ను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పనిభారం తగ్గించి, అకాల మరణాలను ఆపాలని, కేడర్ స్ట్రెంత్ సర్క్యులర్ రద్దు చేయాలని కోరారు.

యూనిఫామ్, కుట్టుకూలి ఇవ్వాలి: ఇయు

ఆర్‌టిసి ఉద్యోగులకు యూనిఫామ్, కుట్టుకూలికి సంబంధించిన నగదును వెంటనే చెల్లించాలని ఎపిపిటిడి ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎపిఎస్‌ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జివి నర్సయ్య వినతిపత్రం అందజేశారు. ఆర్‌టిసి ఉద్యోగులకు యూనిఫామ్ నగదును ఆరేళ్లుగా చెల్లించడం లేదని తెలిపారు. ఆర్‌టిసిలో క్లాస్ 4 ఉద్యోగి నుంచి అసిస్టెంటు మేనేజర్ వరకు నాణ్యమైన యూనిఫామ్ ఇవ్వాలని కోరారు.

ఏలూరులో ఉద్యోగులకు మద్దతుగా మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు

నెల్లూరులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తాం

- రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎస్ఎ ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి-యంత్రాంగం

తమన్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిందేనని.. అప్పటి వరకు సమ్మెను విరమించబోమని సర్వ శిక్షా అభియాన్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తేల్చి చెప్పారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవులు మంజూరు చేయాలని, మెరుగైన హెల్త్ స్కీమ్‌లు అమలు పరచాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎస్ఎ ఉద్యోగులు చేపట్టిన సమ్మె శుక్రవారం మూడో రోజుకు చేరింది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగించారు. వీరి సమ్మెకు యుటిఎఫ్, ఎస్‌టియు, సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు.

విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఎస్ఎస్ఎ ఉద్యోగులు చేపట్టిన ధర్నాకు మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రాథమిక విద్య వృద్ధి కోసం పాటుపడుతున్న వారి పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. అనకాపల్లిలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఎ వద్ద ఆందోళన చేశారు. నెల్లూరులో సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల ఆందోళనకు మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మద్దతు తెలిపారు. విద్యాశాఖలో సర్వశిక్ష అభియాన్‌లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలో సమ్మె శిబిరాన్ని సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు బి.కాంతారావు సందర్శించి మాట్లాడారు. ఎస్-ఎస్ఎ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విజయనగరంలో ర్యాలీ నిర్వహించి, అనంతరం రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే చంద్రబాబుకు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో సర్వశిక్ష ఉద్యోగులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా కోలాటం చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. కాకినాడలో మానవహారం నిర్వహించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఆందోళన కొనసాగించారు. ఏలూరులో కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు ధర్నా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్ట్ టైం విధానాన్ని రద్దు చేసి ఫుల్ టైం కాంట్రాక్టు విధానాన్ని అమలు చేయాలని కోరారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయిశ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతపురం కలెక్టరేట్ ఎదుట కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. వీరి ఆందోళనకు మాజీ మంత్రి పరిటాల సునీత మద్దతు తెలిపారు. సత్యసాయి జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ చేపట్టారు. గణేష్ సర్కిల్లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు.

మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మద్దతుగా పాల్గొన్నారు. బాపట్లలో చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. చైల్డ్ కేర్ లీవులు కోరుతూ ప్రకాశం జిల్లా ఒంగోలులో ఓ చిన్నారి తన తండ్రితో కలిసి సమ్మెలో పాల్గొన్నారు. కర్నూలులో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు, ఎన్‌టిఆర్ జిల్లా నందిగామలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.అజయ్‌కుమార్ పాల్గొన్నారు. కృష్ణా, పల్నాడు, అన్నమయ్య జిల్లాల్లో ఆందోళనలు కొనసాగించారు.

ప్రవాసాంధ్ర బీమాలో 50 శాతం ప్రభుత్వ రాయితీ

- ఎపిఎన్ఆర్‌టిఎస్ అధ్యక్షులు వెంకట్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విదేశాల్లో ఉంటున్న ప్రవాసాంధ్ర భరోసా బీమా ప్రీమియంలో రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రాయితీ అందిస్తుం దని ఎపిఎన్ఆర్‌టిఎస్ అధ్యక్షులు వెంకట్ ఎస్ మేడపాటి, సిఇఒ పి హేమలత రాణి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగులు, వలస కార్మికులు, డ్రైవర్లు, హౌస్ మెయిడ్స్, హెల్పర్లు వివిధ రంగాల్లో పనిచేసే వారు మూడేళ్లకు రూ.275లతో, విద్యార్థులు పూర్తి ఉచితంగా బీమాలో నమోదు చేసుకోవచ్చునని వివరించారు. ఈ నెల 26 నుంచి జనవరి 15 వరకు నమోదుకు అవకాశం ఉందన్నారు. బీమా తీసుకున్న వ్యక్తి ప్రమాదం వల్ల మరణించినా, శాశ్వత అంగవైకల్యం కలిగినా రూ.10 లక్షలు ఆర్థికసాయం ఉంటుందన్నారు. ప్రమాదం వల్ల కలిగే గాయాలు, అనారోగ్యం చికిత్సకు అయ్యే ఆస్పత్రుల ఖర్చులకు రూ.లక్ష వరకు చెల్లిస్తారని తెలిపారు. మహిళా ఉద్యోగులకు ప్రసూతి హాస్పిటల్ ఖర్చులకు రూ.50 వేల వరకు చెల్లింపు చేస్తారని వివరించారు. బీమా నమోదు కోసం హెల్ప్‌లైన్ నెంబర్లు 91863-2340678, 8500027678 సంప్రదించాలని పేర్కొన్నారు.

ఏలూరులో వైద్యునికి కరోనా పాజిటివ్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు ఆశ్రమం ఆస్పత్రిలో ఓ డాక్టర్‌కి కరోనా పాజిటివ్ వచ్చింది. ఇటీవల హైదరాబాద్ నుంచి వచ్చిన ఆయనకు కరోనా లక్షణాలు కనిపించాయి. దీంతో ర్యాపిడ్ టెస్టును ఆశ్రం ఆస్పత్రిలో చేయించుకున్నారు. పాజిటివ్ అని రావడంతో హోమ్ ఐసోలేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు డిఎంహెచ్ఒ డాక్టర్ శర్మిష్ఠ తెలిపారు.

41ఎ నిబంధనలు ఉల్లంఘించిన లోకేష్

- ఎసిబి కోర్టులో సిఐడి పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో 41ఎ నిబంధనలను టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఉల్లంఘించారని విజయవాడ ఎసిబి కోర్టులో సిఐడి శుక్రవారం పిటిషన్ దాఖలు చేసింది. లోకేష్‌కు నాన్ బెయిల్‌బుల్ వారెంటు జారీ చేయాలని కోరింది. రాష్ట్రంలో తమకు వ్యతిరేకంగా 164 స్టేట్‌మెంట్లు ఇచ్చిన అధికారులను వదలబోమని, అందరి పేర్లు రెడ్‌బుక్‌లో చేర్చినట్లు లోకేష్ అన్నారని కోర్టుకు సిఐడి నివేదించింది. సాక్ష్యాలు ఏమిటని న్యాయమూర్తి ప్రశ్నించగా.. వివిధ పత్రికల క్లిప్పింగులను సిఐడి తరపున న్యాయవాది చూపించారు.

ప్రకాశంలో ఘోర ప్రమాదం

- ఆటోను కారు ఢీకొనడంతో ఆరుగురి మృతి
- ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-పెద్దారవీడు (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆటోను కారు ఢీ కొన్నడంతో నలుగురు అక్కడికక్కడే మరణించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పెద్దారవీడు మండలంలోని దేవరాజుగట్టు గ్రామ సమీపంలోనిశుక్రవారం సాయంత్రం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..గుంటూరుకు చెందిన రాయ వెంకటేశ్వరరావు (52), రాయ నాగేశ్వరరావు (48) తమ బంధువుల గృహ ప్రవేశానికి ప్రకాశం జిల్లా కొమరోలుకు కారులో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో దేవరాజుగట్టు వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి దిగే క్రమంలో ఎస్ఆర్ పెట్రోల్ బంకు వద్ద కారు అదుపు తప్పింది. అదే సమయంలో త్రిపురాంతకం వైపు నుంచి మార్కాపురం వైపు వెళుతున్న ఆటోను ఢీకొంది. కారు వేగం అదుపు కాకపోవడంతో 100 మీటర్ల మేర ఆటోను నెట్టుకుంటూ వెళ్లింది. ఇనుప హోర్డింగ్ పోల్స్‌ను ఢీకొన్ని కారు ఆగిపోయింది. ఆటోలో ప్రయాణిస్తున్న మార్కాపురం పట్టణం పూలసుబ్బయ్య కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ షేక్ అబిద్దాషాన్ (బాబు) (46), త్రిపురాంతకం మండలంలోని దూపాడు గ్రామానికి చెందిన అన్నదమ్ములు ఎనిబెర అభినయ్ (12) మృతి చెందారు. కారులో ప్రయాణిస్తున్న వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు అక్కడికక్కడే మరణించారు. ఆటో ప్రయాణికులు కర్నూలు జిల్లా బి.తాండ్రపాడు మండలంలోని మంగళగిరి కాలనీకి చెందిన ఎల్లూరి మైథిలి, బేతంచెర్లకు చెందిన షేక్ మునీదా తీవ్రంగా గాయపడ్డారు. మరో విద్యార్థి కలీద్ కమెరన్ గాయాలయ్యాయి. ఒంగోలు రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రత్నతేజ (9), పెద్దదోర్నాల మండలంలోని గంటవానిపల్లె గ్రామానికి చెందిన ఉప్పలపాటి దానియేలు(40) మరణించారు. గాయపడిన వారందరికీ కాళ్లు, చేతులు విరిగాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రిస్మస్‌కు కొత్త దుస్తుల కోసమని..

త్రిపురాంతకం మండలంలోని దూపాడు గ్రామానికి చెందిన ఎనిబెర చిన్న గురవయ్య, ఉమా దంపతులకు అభినయ్, రత్నతేజ ఇద్దరు కుమారులు. క్రిస్మస్ వేడుకలో కొత్త దుస్తుల కోసం దూపాడు నుంచి మార్కాపురానికి అన్నదమ్ములు ఇద్దరూ ఆటోలో బయలుదేరారు. ఇరువురూ మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

నేటి నుంచి నంది నాటకోత్సవాలు

గుంటూరు విజ్ఞాన మందిరంలో ఏర్పాట్లు

పోస్టర్‌ను విడుదల చేస్తున్న పోసాని కృష్ణమురళీ, విజయకుమార్ రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర స్థాయి నంది నాటకోత్సవాలు శనివారం నుంచి గుంటూరులోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వారం పాటు జరగనున్నాయి. 73 అవార్డుల కోసం 38 నాటక సమాజాలు 1200 మంది నటీనటులు పోటీపడనున్నారు. ఈ ఉత్సవాలను మంత్రి చెన్నుబోయిన వేణుగోపాలకృష్ణ ప్రారంభించనున్నారు. నాటక ప్రదర్శనలు పరిశీలించి వాటికి స్వర్ణ, రజత, కాంస్య నందుల విజేతలను ఎంపిక చేయడానికి 15 మంది న్యాయ నిర్ణేతలు హాజరుకానున్నారు. శనివారం ఉదయం 11 గం. 'శ్రీ కాళహస్తీశ్వర మహత్యం' (పద్య నాటకం), మధ్యాహ్నం 2.30కు 'ఎర్ర కలువ', సాయంత్రం ఐదుగంటలకు 'నాన్నా... నేనొచ్చేస్తా...', 6 .30కు శ్రీ రామ భక్త తులసీ దాసు (పద్య నాటకం) ప్రదర్శించనున్నారు. కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ టి.విజయ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లు జరగనున్నాయి. నంది నాటకోత్సవాల సందర్భంగా గుంటూరు కలెక్టరేట్‌లో ఎన్‌టిఆర్ రంగస్థల పురస్కారం, డాక్టర్ వైఎస్ఆర్ రంగస్థల పురస్కారానికి విజేతల ఎంపిక కోసం మొత్తం 27 మంది న్యాయనిర్ణేతలు సమావేశమై విజేతలను ఎంపిక చేశారు. ఎన్‌టిఆర్ రంగస్థల అవార్డు 2022 సంవత్సరానికి డా. మీగడ రామలింగ స్వామిని, డా. వైఎస్ఆర్ అవార్డు 2023 సంవత్సరానికి కాకినాడ యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ ఎంపిక అయినట్టు ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోసాని కృష్ణమురళి శుక్రవారం రాత్రి మీడియాకు వెల్లడించారు.

జిందాల్‌తో ఎంఒయు బయటపెట్టండి

ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాలు ధర్నా

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు యాజమాన్యం బ్లాస్ట్ ఫర్నేస్ - 3 విషయంలో ఇఒఐ పద్ధతిన జిందాల్‌తో కుదుర్చుకున్న ఎంఒయును వెంటనే బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖ ఉక్కు అఖిల పక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్‌లోని అన్ని విభాగాలు హెచ్ఒడి కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరాం, ఎఐటియుసి నాయకులు రామకృష్ణ మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారంలో వంద శాతం వాటాలను అమ్మాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఉక్కు శాశ్వత, కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు కూర్మన్నపాలెం కూడలి వద్ద వెయ్యి రోజులుకుపైగా పోరాటం చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోక పోవడం శోచనీయమన్నారు. మెటీరియల్ సప్లయి, కన్వర్షన్ ఇఒఐ పేరుతో జిందాల్ కంపెనీతో రెండు సంవత్సరాలకుగాను ఒప్పందం చేసుకోవడం అత్యంత ఆందోళనకరమైన విషయమని తెలిపారు. ఇది ప్రయివేటీకరణకు తొలి మెట్టు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక హెచ్ఒడి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

స్టీల్‌ప్లాంట్‌లోని డబ్ల్యుఆర్ఎం విభాగం వద్ద ధర్నా చేస్తున్న ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

స్టీల్‌ప్లాంట్‌లో జిందాల్‌ను అడుగుపెట్టనివ్వం

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

జిందాల్ కంపెనీని వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లోకి అడుగుపెట్టనివ్వబోమని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు తేల్చిచెప్పారు. విశాఖలోని జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఆయన శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను వంద శాతం ప్రయివేటుపరం చేస్తామని ప్రకటించిన రోజు నుంచి నేటి వరకూ పెద్ద ఎత్తున కార్మికులు, ప్రజలు పోరాడుతున్నారని తెలిపారు. మోడీ సర్కారు స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా, ముడి సరుకు సరఫరా చేయకుండా ఆటంకాలు సృష్టిస్తోందన్నారు. బ్లాస్ట్ ఫర్నేస్ - 3ని కొంతకాలంగా మూసివేసిందని తెలిపారు. 2017లో పోస్కోతో స్టీల్‌ప్లాంట్ ఒప్పందం చేసుకుందని, అప్పుడు కార్మికులు పెద్ద ఎత్తున దాన్ని తిప్పికొట్టారని గుర్తుచేశారు. ఇప్పుడు జిందాల్‌ను కూడా ఆ రకంగానే వెనక్కి పంపిస్తామని హెచ్చరించారు. జిందాల్ వచ్చినట్లయితే శాశ్వత ఉపాధి అనేది ఉండదని, మొత్తం యంత్రాలతో పనిచేయిస్తారని అన్నారు. కార్మికులకు అతి తక్కువ వేతనాలు చెల్లిస్తారని తెలిపారు. జిందాల్‌తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసే వరకూ పెద్దఎత్తున పోరాడతామని స్పష్టం చేశారు. సమావేశంలో సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పాల్గొన్నారు.

చంద్రబాబుకు ముందస్తు బెయిల్ ఇవ్వొద్దు : సిఐడి

- మెమో దాఖలు చేయడంపై చంద్రబాబు న్యాయవాది అభ్యంతరం
- ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో వాదనలు నేటికి వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు ముందస్తు బెయిల్ ఇవ్వొద్దని హైకోర్టులో సిఐడి మెమో దాఖలు చేసింది. ఇదే కేసులో నిందితునిగా ఉన్న టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్.. పోలీసులను, సాక్షులను మీడియా ఇంటర్వ్యూల్లో బెదిరించారని సిఐడి పేర్కొంది. ఇంటర్వ్యూలు ఉన్న పెన్‌డ్రైవ్‌ను మెమో రూపంలో సిఐడి స్పెషల్ పిపి దుష్యంత్‌రెడ్డి అందజేశారు. దీనిని శుక్రవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగఢ మల్లికార్జునరావు విచారణ జరిపారు. హైకోర్టు బెయిల్ మంజూరు సమయంలో విధించిన షరతులను చంద్ర బాబు ఉల్లంఘించారని అన్నారు. చంద్రబాబుకు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పు వెలువరించే ముందు తాము దాఖలు చేసిన మెమోను పరిగణనలోకి తీసుకో వాలని కోరారు. చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై వాదనలు ముగిశాయని, దీనిపై మెమో దాఖలు చేయడం ఏమిటని ఆయన తరపున న్యాయ వాది ఎస్ ప్రణతి తీవ్ర అభ్యంతరం చెప్పారు. లిఖితపూర్వక వాదనల నిమిత్తమే శుక్రవారం జరుగుతుందని గుర్తు చేశారు. మెమోను పరిగణనలోకి తీసుకోవద్దని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు, సిఐడి మెమోపై అభ్యంతరాలుంటే రాతపూర్వకంగా తెలియజేయాలని చంద్రబాబు న్యాయవాదిని ఆదేశించింది. తదుపరి విచారణను శనివారానికి వాయిదా వేసింది. అభ్యంతరాలు పరిశీలించిన తర్వాతే చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తుది ఉత్తర్వులు జారీ చేస్తామని చెప్పింది.

యాగాలు నిర్వహించిన చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు చండీయాగం, సుదర్శన నారసింహ హోమం నిర్వహించారు. ఉండవల్లిలోని తన నివాసంలో సతీమణి భువనేశ్వరితో పాటు ప్రారంభించారు. ఆదివారం వరకు ఈ యాగాలు జరగనున్నాయి. ప్రజలందరికీ మేలు జరగాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు ఆకాంక్షించారు. కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన టిడిపి నేతలు వారి కుటుంబ సభ్యులతో కలిసి యాగంలో పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే అక్రమ కేసులు

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓటమి భయంతో తమ పార్టీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తూ రాక్షసానందం పొందుతున్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రాష్ట్రంలో జగన్ అరాచక చర్యలు మితిమీరుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాచర్ల టిడిపి ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మానందరెడ్డిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం కింద అక్రమ కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని శుక్రవారం ఒక ప్రకట నలో పేర్కొన్నారు. స్థానిక వైసిపి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రోద్బలంతోనే అక్రమ కేసు నమోదు చేశారని, దీనిని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమానికి కృషి : లోకేష్

త్వరలో ఏర్పడబోయే ప్రజా ప్రభుత్వం ద్వారా రాష్ట్రంలో అభివృద్ధి-సంక్షేమానికి కృషి చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తెలిపారు. తాను చేపట్టిన యువగళాన్ని నవశకం వైపు నడిపించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతూ ఒక ప్రకటన విడుదల చేశారు. పాదయాత్రలో తాను చూసిన కష్టాలు, గ్రామాల సమస్యలు ప్రజల ముందుంచడంలో మీడియా ప్రముఖ పాత్ర వహించిందని తెలిపారు.

సిఎం జగన్ తన మీడియాకు ప్రకటనలిస్తూ ప్రజల సొమ్మును వైసిపి నేతలకు చేరవేస్తున్నారని టిడిపి మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న విమర్శించారు. అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, పారిశుధ్య సిబ్బందికి వేతనాలు పెంచడానికి మాత్రం జగన్‌కు మనసు రాదన్నారు. ఒక అజెండా ప్రకారం గిరిజనులపై కక్షసాధింపులకు జగన్ పాల్పడుతున్నారని టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎం ధారునాయక్ విమర్శించారు. గిరిజన యువతకు దక్కాల్సిన ఉద్యోగాల్ని తన వర్గం వారికి ఇస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారిందని ఆర్‌బిఐ తన నివేదికలో పేర్కొందని టిడిపి అధికార ప్రతినిధి నీలాయంపాలెం విజయ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఆర్‌బికెల్లో కందులు కొనుగోలు

- మార్కెట్ ధరను నిర్ణయించేందుకు కలెక్టర్లు ఛైర్మన్‌గా కమిటీలు
- 6 జిల్లాల్లో సేకరించేందుకు ప్రభుత్వం కసరత్తు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుంచి కందులు కూడా సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పంట దిగుబడి ఈ నెల చివరి నుండి జనవరి వరకు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆరు జిల్లాల్లో కందులు సేకరించేందుకు కసరత్తును పౌరసరఫరాలశాఖ ప్రారంభించింది. ప్రకాశం, పల్నాడు, బాపట్ల, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో అత్యధికంగా సేకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. కందులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.7 వేలు ఉండగా, మార్కెట్లో కందుల రేటు అంతకంటే అధికంగా ఉండటంతో రైతులు ప్రభుత్వానికి అమ్మడానికి ముందుకు రాకపోవచ్చని, ప్రభుత్వం ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఆయా జిల్లాల్లో 35 వేల మెట్రిక్ టన్నుల కందులు సేకరించే దిశగా పౌర సరాఫరాలశాఖ అడుగులు వేస్తోంది. మార్కెట్లో కంది పప్పు ధర కొండెక్కి కూర్చొంది. ఫలితంగా సామాన్యుడు పప్పన్నం తినే పరిస్థితి కూడా లేకుండా పోయింది. మార్కెట్లో కందిపప్పు ధర అధికంగా ఉండటం, రేషన్ షాపుల్లో కందిపప్పు రెగ్యులర్‌గా ప్రభుత్వం అందించలేని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాదిలో అయిదారు నెలలు కందిపప్పును చౌక ధరల దుకాణాల్లో పంపిణీ చేయలేకపోవడం, కొద్ది ప్రాంతాల్లో అరకొర పంపిణీ చేశారు. డిసెంబర్, జనవరి నెలల్లో వరుస పండగల నేపథ్యంలోనైనా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1.45 కోట్ల రేషన్‌కార్డు దారులకైనా కంది పప్పు పంపిణీ జరుగుతోందో లేదో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ వద్ద ప్రస్తుతం 2,800 మెట్రిక్ టన్నులు మాత్రమే ఉండగా, మరో 5,200 మెట్రిక్ టన్నులు కంది పప్పు కోసం హైదరాబాద్ కార్పొరేషన్‌కు ఇండెంట్ పెట్టినట్లు ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఆ సరుకు ఈ నెల 23కు రాష్ట్రానికి చేరుకుంటుందని, 26 జిల్లాల్లో ఈ నెల 25 కల్లా ఆయా పంపిణీ పాయింట్లకు కందిపప్పును తరలించాలని ఆ శాఖ అందుకు తగ్గ ఏర్పాట్లు చేసే పనిలో నిమగ్నమైంది. ప్రభుత్వం అనుకుంటున్నట్లు కందిపప్పు ఇతర రాష్ట్రాల నుంచి వస్తే పండగ నెలలో అందే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తం కార్డులకు కందిపప్పు సరఫరా చేయాలంటే 14.5 మెట్రిక్ టన్నులు సరుకు అవసరం.

మార్కెట్ ధర నిర్ణయించేందుకు జిల్లాల కలెక్టర్లు ఛైర్మన్‌గా కమిటీలు

కందులకు ప్రభుత్వం నిర్ధేశించిన మార్కెట్ ధర కంటే బయట మార్కెట్‌లో అత్యధిక ధర పలుకుతోంది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల కలెక్టర్లు ఛైర్మన్లుగా, జిల్లా జాయింట్ కలెక్టర్లు కన్వీనర్లుగా, సభ్యులుగా డిసిఎంఎస్ సభ్యులు, మార్క్‌ఫెడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు, వ్యవసాయాధికారులు, పౌర సరఫరాలశాఖ అధికారులను ప్రభుత్వం నియమించింది. స్థానిక పరిస్థితులను బట్టి మార్కెట్ ధర ఎంత అని నిర్ధారిస్తే అదే ధరకు ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా కందులు కొనుగోలు చేస్తుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఓటు బ్యాంక్‌పై కందిపప్పు ప్రభావం పడకుండా..

సాధారణ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటం, రేషన్ షాపుల్లో ప్రజలకు కందిపప్పు అందడం లేదనే విమర్శలు పేద ప్రజల్లో బలంగా వుంది. అసలే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ఇబ్బందులు పడుతున్న తమకు కనీసం ప్రభుత్వం కందిపప్పునైనా సబ్సిడీపై ఇవ్వకపోతే ఎలా అని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు. ఇదే పరిస్థితి ఎన్నికల వరకు కొనసాగితే ఓటు బ్యాంక్‌పై తీవ్ర ప్రభావం పడుతుంది. ప్రజల్లో వ్యతిరేకత పెరగకుండా ఉండేందుకు ప్రభుత్వం ఏప్రిల్ నెల వరకు రైతుల వద్ద నుంచి కందులు కొనుగోలు చేసి ఈ నాలుగు నెలలు కందిపప్పు పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

విజయవాడలో ఆందోళన చేస్తున్న ఇండియావేదిక నాయకులు

కర్నూలు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న వామపక్ష నాయకులు

మోడీ, షా రాజీనామా చేయాలి

- ఎంపిల సస్పెన్షన్ పార్లమెంట్ చరిత్రలో చీకటి అధ్యాయం
- ఇండియా ఫోరమ్ నిరసనలో వక్తలు

ప్రజాశక్తి - యంత్రాంగం

దేశ ప్రజాస్వామ్యవ్యవస్థకు కీలకమైన పార్లమెంట్‌పై జరిగిన దాడికి బాధ్యత వహించి ప్రధానమంత్రి నరేంద్రమోడీ, అమిత్‌షా తమ పదవులకు రాజీనామా చేయాలని ఇండియా ఫోరమ్ డిమాండ్ చేసింది. దేశానికి భద్రత కల్పించడంలో వారు విఫలమైనారని విమర్శించింది. ఎంపిల సస్పెన్షన్‌ను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఇండియా ఫోరమ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. విజయవాడ లెనిన్ సెంటర్‌లో వామపక్షపార్టీలు, కాంగ్రెస్, ఆప్ పార్టీలు నిరసన కార్యక్రమం నిర్వహించాయి.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు దాడికి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేసిన 146 మంది పార్లమెంట్ సభ్యులను సస్పెండ్ చేయడం దారుణమన్నారు. పార్లమెంటు చరిత్రలోనే ఈ సస్పెన్షన్‌లు చీకటి అధ్యాయంగ మిగులుతాయని విమర్శించారు. సిపిఎం నగర కార్యదర్శి దోనెపూడి కాశీనాథ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నోటికి నల్లరిబ్బన్‌లను కట్టుకొని, నల్లబెలూన్‌లతో మౌనప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. అలాగే దేశభద్రత అంశంలో విఫలం అయిన మోడీ, అమిత్‌షాలు తక్షణం రాజీనామా చేయాలని, ఎంపిల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బిజెపికి చెందిన మైసూర్ ఎంపి సిఫార్సులతో వచ్చి పార్లమెంట్‌పై దాడికి పాల్పడిన అంశంపై సమాధానం చెప్పుకోలేకే ప్రతిపక్షపార్టీలకు చెందిన 146 మంది ఎంపిలను సస్పెండ్ చేశారని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేసేలా, పార్లమెంట్ భద్రతనే ప్రశ్నార్థకం చేసేలా గందరగోళం సృష్టిస్తున్నా రక్షణ కల్పించడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని విమర్శించారు. ఇంతటి ప్రమాదకరమైన అంశాన్ని దాచేలా బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. దీనిపై సమాధానం చెప్పాలని కోరితే ఎంపీలను సస్పెండ్ చేశారని అన్నారు. ఈ అప్రజాస్వామ్యవైఖరిని దేశం యావత్తు తీవ్రంగా ఖండిస్తుంటే రాష్ట్రంలోని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ, తెలుగుదేశం పార్టీలు సిగ్గులేకుండా బిజెపి ముందు సాగిలపడుతున్నాయని విమర్శించారు. సిపిఐ రాష్ట్రకార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేనంతగా 146 మంది పార్లమెంట్ సభ్యులను సస్పెండ్ చేయడం తగదని అన్నారు. అమిత్‌షా ప్రకటన కోరితే సస్పెండ్ చేయడం ఏమి ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు.

ఇప్పటికే వ్యవస్థలను అన్నింటిని ధ్వంసం చేసిన నరేంద్రమోడీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే దేశంలో ప్రజాస్వామ్యం ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరహరిశెట్టి నరసింహారావు మాట్లాడుతూ.. దేశంలో నరేంద్రమోడీ, అమిత్‌షాలు నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. మణిపూర్‌లో దాడులు, పార్లమెంట్‌పై జరిగిన దాడికి బిజెపి దేశానికి సమాదానం చెప్పాల్సిందేనని అన్నారు. మాజీ మంత్రి, రైతు సంఘాల సమన్వయ సమితి ఛైర్మన్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో సాధారణ ప్రజలకే ప్రశ్నించే హక్కు, మాట్లాడే హక్కులు వుంటాయని ఇప్పుడు నరేంద్రమోడీ ప్రభుత్వం ఎంపిలకు కూడా ప్రశ్నించే హక్కులేదన్న రీతిలో సస్పెండ్ చేయడం అప్రజాస్వామ్య చర్య అని అన్నారు. బిజెపి నియంతృత్వ విధానాలకు చరమగీతం పాడాలన్నారు. ఇందుకు ప్రజలంతా ఐక్యం కావాలని కోరారు. సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు హరనాథ్ మాట్లాడుతూ.. దేశంలో నరేంద్రమోడీ ప్రభుత్వం ఫాసిస్ట్ ధోరణితో పోతోందని విమర్శించారు.. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, సిహెచ్ బాబూరావు, వి ఉమామహేశ్వరరావు, కె ప్రభాకర్‌రెడ్డి, సిపిఐ రాష్ట్రనాయకులు జి కోటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు గురునాథం, కొలనుకొండ శివాజి, ఆప్ నాయకులు ఫణిరాజు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో ఆర్‌టిసి బస్టాండ్, తిరుపతి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. గూడూరు, శ్రీకాళహస్తి, బిఎన్ కండ్రిగలో నిరసన తెలిపారు. కర్నూలు కలెక్టరేట్ గాంధీ విగ్రహం ముందు ధర్నా నిర్వహించారు. ఆలూరులో అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్సు జంక్షన్‌లో రాస్తారోకో చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జాంపేట గాంధీ బొమ్మ వద్ద నిరసన తెలిపారు. ఒంగోలులోని అద్దంకి బస్టాండ్ సెంటర్, బాపట్లలో అంబేద్కర్ సర్కిల్ వద్ద, విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద, అనకాపల్లి జిల్లా కేంద్రంలో నిరసన చేపట్టారు.

'యువగళం'తో టిడిపి సాధించిందేమిటి? : మాజీ మంత్రి పేర్ని నాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో : నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రతో టిడిపి ఏమి సాధించిందో చెప్పాలని మాజీ మంత్రి పేర్ని నాని ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. లోకేష్ యాత్ర జంపింగ్ జపాంగ్ యాత్రగా మిగిలిపోయిందని విమర్శించారు. యాత్ర ప్రారంభానికి వచ్చిన మేనమామ కుమారుడు చనిపోతే ఆపని పాదయాత్రను.. చంద్రబాబు జైలుకు వెళ్తే మాత్రం ఆపేశారని అన్నారు. సిఎం జగన్‌ని బూతులు తిట్టేందుకే పాదయాత్ర చేసినట్లు వుంది తప్ప ప్రజల కోసం చేసినట్లు ఎక్కడా కనిపించలేదన్నారు. గతంలో 650 హామీలు ఇచ్చి గాలికి వదిలేశారని, ఇప్పుడు మళ్లీ కొత్త హామీలు ఇస్తున్నారని అన్నారు. నియోజకవర్గాల మార్పుపై మాట్లాడుతున్న టిడిపి.. చంద్రగిరి నుండి చంద్రబాబు కుప్పం నియోజకవర్గానికి ఎందుకుపోయారో చెప్పాలని డిమాండ్ చేశారు. లోకేష్‌ను దొంగ అన్న పవన్‌కల్యాణ్ ఇప్పుడు ఓటెయ్యాలని అడుగుతున్నారని అన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి

- గ్రామీణ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ గౌరవాధ్యక్షులు కె ఉమామహేశ్వరరావు, అధ్యక్షులు ఎం పరందామయ్య, ప్రధాన కార్యదర్శి బి నరసింహులు, కోశాధికారి ఎస్‌కె ఖాదర్ బాషా శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎఫ్‌టిఇ (ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయీస్) అమలు చేయాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలోకి విలీనమైన గ్రామ పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలన్నారు. అర్హత, అనుభవం కలిగిన ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రమోషన్, మండల స్థాయిలో బదిలీ సౌకర్యం కల్పించాలన్నారు. ఎంఎం, ఎస్‌ఎం, ఎఫ్‌ఎ అనే తారతమ్యం లేకుండా అందరినీ ఫీల్డ్ అసిస్టెంట్లుగా పరిగణించి వేతనాలు ఇవ్వాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రమాదవశాత్తూ మరణిస్తే వారికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా అమలు చేయాలన్నారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పనిదినాలు, రోజుకు రూ.600 వేతనం పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కిడ్నాప్ కేసులో దస్తగిరికి నోటీసు

- ఇంటికి అంటించిన పోలీసులు

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్ షేక్ దస్తగిరికి, ఆయన భార్య షబానా పేరు మీద కిడ్నాప్ కేసుకు సంబంధించి శుక్రవారం పులివెందుల పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఈ నోటీసులో ఎటువంటి తేదీలు, క్రైం నంబర్, విచారణకు హాజరు కావాల్సిన సమయమూ లేదు. తమ కుమారున్ని కిడ్నాప్ చేసి డబ్బులు ఇవ్వాలంటూ దస్తగిరి, ఆయన భార్య షబానా బెదిరిస్తున్నారని అదే వీధిలో ఉంటున్న గూగుడు వల్లి, కళావతి మూడు నెలల క్రితం ఫిర్యాదు చేశారు. పోలీస్ అధికారులు కేసు నమోదు చేశారు. దస్తగిరి ఇప్పటికే వేరే కేసులో కడప సబ్ జైల్‌లో ఉండగా, షబానా వ్యక్తిగత పనిమీద బయటి ఊరికి వెళ్లారు. దీంతో, ఇంటికి 41ఎ, 41బి కింద నోటీసులు అంటించారు. ఊరి నుంచి వచ్చిన షబానా పక్కింటి వారి ద్వారా ఈ విషయం తెలుసుకున్నారు. విచారణకు హాజరు కావాలని ఈ నోటీసుల్లో ఉంది.

మనప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
MANAPPURAM HOME FINANCE LTD.
గతంలో మణప్పురం హెూమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌గా తెలిసినది
CIN: U65923K12010PIC039179
రిజిష్టర్డు ఆఫీస్: IV/470A (OLD)W/638A(NEW), మణప్పురం హౌస్ వలపాడ్ త్రిస్సూర్, కేరళ 680567
కార్పొరేట్ ఆఫీస్: మణప్పురం హెూమ్ ఫైనాన్స్ లిమిటెడ్, మూడవ అంతస్తు, యూనిట్ నం. 301 నుండి 315, ఎ వింగ్, 'కనకియా వాల్ స్ట్రీట్', అంధేరి-కుర్లా రోడ్, అంధేరి ఈస్ట్, ముంబై 400093, మహారాష్ట్ర. ఫోన్ నెంబర్. 022-66211000, వెబ్‌సైట్: www.ma[illegible]

డిమాండ్ నోటీసు

ఇందుమూలంగా దిగువ రుణగ్రహీత/లకు నోటీసు ఇవ్వడమేమనగా కంపెనీ నుండి వారిపొందిన రుణా వసతులకు సంబంధించి అసలు మరియు వడ్డీని తిరిగిచెల్లించుటలో డిఫాల్ట్ అయినారు మరియు వారి రుణాలు నాన్-పర్మామింగ్ అసెట్స్(ఎన్‌పిఏ)గా వర్గీకరించబడినవి. వారు కంపెనీకి అందించిన వారి చివరిగా తెలిసిన చిరునామాలకు బాకీపడిన బకాయిల రికవరీ కొరకుసెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంట్రెస్ట్ యాక్ట్ 2002 క్రింద సెక్షన్ 13(2) క్రింద వారికి డిమాండ్ నోటీసు జారీచేయబడినది, సదరు రుణగ్రహీలకు సమాచారం నిమిత్తం దీనికి అదనంగా, ఈ బహిరంగ ప్రకటన రూపంలో సదరు రుణగ్రహీతలకు తెలియజేయబడుతున్నది.

క్ర. సం	రుణగ్రహీత/సహ-రుణగ్రహీత పేరు/లాన్/ బ్రాంచ్	క్రియేట్‌చేసిన ఇంట్రెస్ట్‌కు సంబంధించి సెక్యూర్డు అసెట్ వివరణ	ఎన్‌పిఏ తేది	పంపిన నోటీసు తేది & బాకీపడిన మొత్తం
1	కొలకలూరి విక్టోరియా కొలకలూరి సూర్యప్రకాశరావు కొలకలూరి సంతోష్‌కుమార్ /MHL00310002825/ విజయవాడ	డోర్ నెం.2-135, ఆర్.ఎస్.నెం.1224, నేషనల్ హైవే, తేలప్రోలు గ్రామపంచాయతీ, ఉంగూరు మండలం, వార్డు నెం.2, పెనుయేలు ప్రేయర్ ప్రదాన మందిరం దగ్గర, ఉంగుటూరు, పి.ఓ.తేలప్రోలు, కృష్ణా, ఆంధ్రప్రదేశ్, పిన్: 521109	07-12-2023	11-12-2023 & Rs. 4,11,110/-

పై పేర్కొన్న రుణగ్రహీతలను సెక్షన్ 13(2) క్రింద నోటీసు జారీ తేది నుండి 60రోజుల్లోపు బాకీపడిన మొత్తాలను చెల్లించమని కోరుతున్నారు, విఫలం చెందితే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంట్రెస్ట్ యాక్ట్ 2002 నియమాల ప్రకారం పై పేర్కొన్న తేదిన సెక్షన్ 13(2) క్రింద నోటీసు జారీ తేది నుండి 60 రోజుల గడువు ముగిసిన తరువాత తదుపరి చర్యలు చేపట్టబడును.

సం/-
తేది: 23 డిసెంబర్, 2023
ప్రదేశం: ఆంధ్రప్రదేశ్
అధీకృత అధికారి
మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీస్: యూనిట్ నం. 203, అమిత్ బిల్డింగ్, పిరమల్ అగస్త్య కార్పొరేట్ పార్క్, అగ్నిమాపక దళం స్టేషన్ ఎదురుగా కమని జంక్షన్, L.B.S. మెయిన్ రోడ్, కుర్లా (పశ్చిమ) ముంబై - 400 070
బ్రాంచ్ కార్యాలయం: డోర్.నెం: 5-1-451, 3వ అంతస్తు, సుజుకి షోరూమ్ మేడమీద, పల్నాడు రోడ్, నరసరావు పేట, గుంటూరు జిల్లా, (ప్రస్తుత పల్నాడు జిల్లా) 522 601 & వినుకొండ బ్రాంచ్

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు) See rule 8(1)

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ మరియు ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు - 2002 పరిధిలో ఈ క్రింది సంతకందారు మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇప్పటి నుండి MRHFL గా పరిగణించునది), రిజిస్టర్డ్ కార్యాలయం, మహీంద్రా టవర్స్, 4వ అంతస్తు, Dr.G.M.భోసలే మార్గ్, వర్లి, ముంబై 400 018 ఇండియా వద్ద మరియు బ్రాంచి కార్యాలయం - డోర్.నెం: 5-1-451, 3వ అంతస్తు, సుజుకి షోరూమ్ మేడమీద, పల్నాడు రోడ్, నరసరావు పేట, గుంటూరు జిల్లా, (ప్రస్తుత పల్నాడు జిల్లా) 522 601 & వినుకొండ బ్రాంచ్ వద్ద కలిగియున్న సంస్థ అధీకృత అధికారిగా మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్ మెంట్) రూల్స్ 2002 యొక్క 3వ రూలుతో కూడిన సదరు చట్టం 13 (12) విభాగం క్రింద సంక్రమించిన అధికారాలతో ఈ క్రింది ప్రతి ఖాతాకు ఎదురుగా సూచించిన మొత్తమును చెల్లించవలసినదిగా సంబంధిత రుణగ్రహీత/లును సదరు నోటిసు స్వీకరణ తేదీ నుండి 60 దినములలోగా చెల్లించవలసినదిగా ప్రతి ఖాతా ఎదురుగా తెలిపిన తేదీలలో డిమాండ్ నోటిసు/లు జారీ చేసినారు. రుణగ్రహీత/లు సదరు మొత్తమును తిరిగి చెల్లింపు చేయుటలో విఫలమైనారు. కనుక రుణగ్రహీత/లుకు మరియు యావన్మంది ప్రజానీకమునకు తెలియచేయునది ఏమనగా సదరు చెప్పిన నియమావళి యొక్క రూ.లు 8 తో కూడిన సదరు చట్టం 13 (4) విభాగం పరిధిలో అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలతో దిగువ వివరించిన ఆస్తి/ఆస్తులను క్రింది సంతకందారు ప్రతి ఖాతా ఎదురుగా తెలిపిన తేదీన స్వాధీన పరచుకొనినారు. రుణగ్రహీత/లుకు ప్రత్యేకంగాను మరియు యావన్మంది ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు అట్టి లావాదేవీలు ఏవైనను మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి లోను అగ్రిమెంటు ప్రకారం చెల్లించవలసిన మొత్తము మరియు అందుపై వడ్డీ చెల్లింపునకు లోబడి మాత్రమే నిర్వర్తించవలెను. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు సదరు చట్టం 13వ విభాగం (8)వ ఉప-విభాగం నియమావళి పరిధిలో తగిన సమయం లభించునని రుణగ్రహీతలకు సూచించటమైనది.

వ. నెం	అగ్రిమెంట్ నెం. / ఫిన్ నెం.	రుణ గ్రహీత /సహ-రుణ గ్రహీత / హామీదారు(లు)	డిమాండ్ నోటీస్ తేదీ	డిమాండ్ నోటీస్ ప్రకారం మొత్తం	స్వాధీన పరచుకున్న తేదీ	స్థిరాస్థి వివరణ
1	XRESNRS008 09108/999754	శ్రీ & శ్రీమతి కందుల సుబ్బారావు తండ్రి దేవసహాయం, (రుణగ్రహీత) శ్రీ & శ్రీమతి కందుల జ్యోతి భర్త సుబ్బారావు, (సహ-రుణగ్రహీత) RS.నెం:271/1A2, D.నెం:4-74, ముప్పాళ్ల గ్రామం, ముప్పాళ్ల మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522408. శ్రీ & శ్రీమతి మన్నం రమేష్ తండ్రి జగన్నాథం (హామీదారు) D.నెం:4-59, ముప్పాళ్ల గ్రామం, ముప్పాళ్ల మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్ -522408.	09-11-2022	రూ. 1,17,956/- (రూ. లక్షా పదిహేడు వేల తొమ్మిది వందల యాభై ఆరు మాత్రమే)	19-12-2023	D.నెం:4-74, ముప్పాళ్ల గ్రామం, ముప్పాళ్ల మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్ర ప్రదేశ్-522408. వద్ద RS.నెం: 271/1A2, సంపూర్ణమైన ఆస్థి సరిహద్దులు: **ఉత్తరం:** పంచాయతీ రోడ్డు, **దక్షిణం:** కె.సువరత గారి స్థలం, **తూర్పు:** కె. నాగరత్నం గారి ఇల్లు, **పడమర:** కె.నాగరాజు గారి ఇల్లు.
2	XRESNRS007 77669/948805	శ్రీ & శ్రీమతి పల్లెపోగు సాంబయ్య తండ్రి చిన్నసుబ్బారావు, (రుణగ్రహీత) శ్రీ & శ్రీమతి పల్లెపోగు వెంకాయమ్మ భర్త చిన్నసుబ్బారావు, (సహ-రుణగ్రహీత) RS.నెం:521, D.నెం:7-118, గుర్రపనాయుడుపాలెం గ్రామం, నూజెండ్ల మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522660. భవనాసి ప్రసాద్ తండ్రి సుబ్బయ్య (హామీదారు), D.నెం:7-139, గుర్రప నాయుడుపాలెం గ్రామం, నూజెండ్ల మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్ -522660.	09-11-2022	రూ. 1,03,718/- (రూ. లక్షా మూడు వేల ఏడు వందల పద్దెనిమిది మాత్రమే	21-12-2023	D.నెం:7-118, గుర్రప నాయుడు పాలెం గ్రామం, నూజెండ్ల మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522660. వద్ద RS.నెం:521, సంపూర్ణమైన ఆస్థి సరిహద్దులు: **ఉత్తరం:** L. ఆడమ్ గారి భూమి, **దక్షిణం:** రహదారి, **తూర్పు:** M. విశ్రాంతం గారి భూమి, **పడమర:** రహదారి.
3	XRESVDA0099 2903/1274445	శ్రీ & శ్రీమతి కొమ్మతోటి సంగీతబాబు తండ్రి ఆనందరావు, (రుణగ్రహీత) శ్రీ & శ్రీమతి కొమ్మతోటి మరియ కుమారి భర్త ఆనందరావు, (సహ-రుణగ్రహీత) శ్రీ & శ్రీమతి కొమ్మతోటి ఆనందరావు తండ్రి సత్యానందం, (సహ రుణగ్రహీత) RS.నెం:190 D.నెం:1-184, ముండ్రు వారిపాలెం గ్రామం, శావల్యపురం మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 522646. శ్రీ & శ్రీమతి తుళ్లూరి కిషోర్ తండ్రి లూథర్ (హామీదారు) RS.నెం:190 D.నెం: 3-141, ముండ్రు వారిపాలెం గ్రామం, శావల్యపురం మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522646.	09-11-2022	రూ. 1,27,282/- (రూ. లక్షా ఇరవై ఏడు వేల రెండు వందల ఎనభై రెండు మాత్రమే)	21-12-2023	D.నెం:1-184, ముండ్రు వారిపాలెం గ్రామం, శావల్యపురం మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 522646. వద్ద RS.నెం:190 సంపూర్ణమైన ఆస్థి సరిహద్దులు: **ఉత్తరం:** పంచాయతీ రోడ్డు, **దక్షిణం:** కె.పెద్ద సత్యానందం, **తూర్పు:** కె.చిన్నయోహను గారి ఇల్లు, **పడమర:** పంచాయతీ రోడ్డు.
4	XRESVDA0096 4149/1232095	శ్రీ & శ్రీమతి నందిప శేఖర్ తండ్రి రాజు, (రుణగ్రహీత) శ్రీ & శ్రీమతి నందిప ధనలక్ష్మి భర్త శేఖర్, (సహ-రుణగ్రహీత) శ్రీ & శ్రీమతి నందెపు పెదరాజు తండ్రి లింగయ్య, (సహ-రుణగ్రహీత) RS.నెం:280, D.నెం: 4-99, కంభంపాడు గ్రామం, నూజెండ్ల మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522660. కవలకుంట గురవయ్య తండ్రి బోడియ్య (హామీదారు) D.నెం:4-101, ఖమ్మంపాడు గ్రామం, నూజెండ్ల మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522660.	09-11-2022	రూ. 1,05,985/- (రూ. లక్షా ఐదు వేల తొమ్మిది వందల ఎనభై ఐదు మాత్రమే)	21-12-2023	D.నెం: 4-99, కంభంపాడు గ్రామం, నూజెండ్ల మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522660. వద్ద RS.నెం:280, సంపూర్ణమైన ఆస్థి సరిహద్దులు: **ఉత్తరం:** ఎన్.కోటేష్ గారి ఇల్లు, **దక్షిణం:** ఎస్. పూర్ణ చంద్ర గారి ఇల్లు, **తూర్పు:** పంచాయతీ రోడ్, **పడమర:** జి.చిన్న గారి ఇల్లు.

స్థలం : నరసరావుపేట
తేదీ : 23-12-2023
సం /- అధీకృత అధికారి
M/S. మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

పిరమాల్ క్యాపిటల్ మరియు హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
Piramal Capital & Housing Finance
(గతంలో డిహెచ్ఎఫ్ఎల్)
సిఐఎన్: L65910MH1984PLC032639
రిజిస్టర్డ్ ఆఫీస్: యూనిట్ నం.601, 6వ అంతస్తు, అమితి భవనం, అగస్త్య కార్పొరేట్ పార్క్, కమని జంక్షన్, ఫైర్ స్టేషన్ ఎదురు, ఎల్‌బిఎస్ మార్గ్, కుర్లా (వెస్ట్), ముంబై-400070 టి+91 22 3802 4000, www.piramalfinance.com

అనుబంధం IV స్వాధీనతా నోటీసు (స్థిరాస్థి కొరకు)

ఏదైతే, సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్, 2022 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) కింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ పిరమాల్ క్యాపిటల్ అండ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ గతంలో దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (డిహెచ్ఎఫ్ఎల్) యొక్క ఆధీకృత అధికారి దిగువ పేర్కొనబడిన మొత్తాన్ని 60 రోజులలోగా చెల్లించవలెనని రుణగ్రహీత(లు)/హామీదారులకు డిమాండ్ నోటీసు జారీ చేయడమైంది. రుణగ్రహీత తిరిగి చెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, సదరు రూల్స్‌లోని 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ ఆధీకృత అధికారి దిగువ వివరించిన ఆస్తిని స్వాధీనపరచుకోవడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను రక్షించుకొనుటకు అందుబాటులో ఉన్న సమయాన్ని బట్టి, సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8) నిబంధనలకు రుణగ్రహీత యొక్క దృష్టిని ఆహ్వానించబడుతుంది. ప్రత్యేకించి రుణగ్రహీతలు/హామీదారులకు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదని మరియు సదరు ఆస్తితో జరిపే లావాదేవీలు (డిహెచ్ఎఫ్ఎల్) యొక్క తనఖాకు లోబడి ఉంటాయని తెలపడమైనది

క్ర. సం	రుణగ్రహీతలు/హామీదారుల పేర్లు	సెక్యూర్డ్ అసెట్స్ వివరణ (స్థిరాస్తి)	డిమాండ్ నోటీసు తేదీ మరియు మొత్తం	స్వాధీనతా తేది
1.	ఎపిపి ఐడి మరియు యూని కోడ్: 00536965 మరియు 02400002108 శాఖ పేరు- విజయవాడ **గౌస్ మహమ్మద్,** ఆర్.ఎస్.నం.695/2ఎ, డో.నం.3-103/డి, ఎ కొండూరు మండలం, చీమలపాడు కృష్ణ (పాత) ఆంధ్రప్రదేశ్-521227 **గౌస్ మహమ్మద్,** పంజా సెంటర్ వద్ద ఎ కొండూరు మండలం, చీమలపాడు కృష్ణ (పాత) ఆంధ్రప్రదేశ్-521227 **గౌస్ మహమ్మద్,** మండల పరిషత్ డివిజన్ కార్యాలయం మండల పరిషత్ ఎ కొండూరు కృష్ణ (పాత) ఆంధ్రప్రదేశ్-521227 **జానీ బేగం మహమ్మద్,** పంజా సెంటర్ వద్ద ఎ కొండూరు మండలం చీమలపాడు కృష్ణ (పాత) ఆంధ్రప్రదేశ్-521227	ఆర్.ఎస్.నం.695/2ఎ, డో.నం.3-103/డి, ఎ కొండూరు మండలం, చీమలపాడు కృష్ణ (పాత) ఆంధ్రప్రదేశ్-521227	04-Nov-22 For Rs. 113906/-	21-Dec-23
2.	ఎపిపి ఐడి మరియు యూని కోడ్ : 01896816 మరియు 02400006962 శాఖ పేరు : విజయవాడ **చంద్రశేఖరరెడ్డి గడ్డం,** డో.నం.1-82 (పాత), 2-1 (ప్రస్తుత), మూలపాడు గ్రామ పంచాయతీ ఏరియా, ఇబ్రహీంపట్నం, కృష్ణాజిల్లా. **చంద్రశేఖరరెడ్డి గడ్డం,** డో.నం.10-13-154, ఉప్పర వాగు, మల్లికార్జున పేట, విజయవాడ, కృష్ణ, ఎ.పి.-520001 **చంద్రశేఖరరెడ్డి గడ్డం,** డో.నం.9-76-72, కెటి రోడ్డు కొత్తపేట, విజయవాడ, కృష్ణ, ఎ.పి.-520001. **డేవిడ్ గడ్డం,** డో.నం.10-13-154, ఉప్పరవాగు, మల్లికార్జున పేట, విజయవాడ, కృష్ణ, ఎ.పి.-520001 **మేరీ రాణి గడ్డం,** డో.నం.10-13-154, ఉప్పర వాగు, మల్లికార్జున పేట, విజయవాడ, కృష్ణ, ఎపి-520001	కృష్ణాజిల్లా, ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ అధికార పరిధిలోని మూలపాడు గ్రామ పంచాయతీ ఏరియా, డో.నం.1-82 (పాత), 2-1 (ప్రస్తుత), ఆర్.ఎస్.నం.38/1లో కవర్‌చేయబడిన ఆర్‌సిసి భవనం మరియు ఎసిసి షెడ్ సైట్ విస్తీర్ణం 435.6 చ.గ.లు. లేదా 364.2 చ.మీ.లు. ఉన్న హద్దులు : ఉత్తరం : అన్నె కోటేశ్వరరావు ఆస్తి, దక్షిణం : పంచాయతీ బజార్, తూర్పు : జెడ్.పి.రోడ్డు, పడమర : సిహెచ్.వెంకటేశ్వరరావు ఆస్తి.	31-Jul-23 For Rs. 2481266/-	21-Dec-23

ప్రదేశం : కృష్ణ
తేది: 22.12.2023
(అధీకృత అధికారి)
పిరమాల్ క్యాపిటల్ మరియు హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
(గతంలో దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది)

ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ
లెనిన్ సెంటర్, గవర్నర్‌పేట్, విజయవాడ-520002

నోటీసు

ఫైల్ నెంబర్: MAU61-PLG0OTH/04/2023

ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ చట్టం 2014 నందు సెక్షన్ 41(3) గల అధికారముల ప్రకారం జి.ఓ.ఎం.స్ నెం.244 తేది. 27/04/2000 ద్వారా అమోదించిన **నిడమానూరు జోనల్ డెవలప్మెంట్ ప్లాన్** లోని, డి.నెం. 133/4(P), నిడమానూరు గ్రామ పంచాయతి, విజయవాడ రూరల్ మండలం, ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని విస్తీర్ణమును 2800.96 Sq.mts, పబ్లిక్ ఓపెన్ స్పేస్ భూవినియోగము నుండి నివాసిత భూవినియోగమునకు కొరకు మార్పు చేయుటకు ప్రతిపాదించటం జరిగింది.

ఏ వ్యక్తి అయినా లేదా ఏ స్థానిక సంస్థ అయినా పైన ప్రతిపాదించిన మార్పు ద్వారా ప్రత్యక్షముగా లేదా పరోక్షముగా ప్రభావితం అయితే గెజెట్ నందు ప్రచురించిన తేది నుండి **15 రోజుల లోపు** తమ అభ్యంతరములను లేదా సలహాలను కమీషనర్, ఏ.పీ.సి.ఆర్.డీ.ఏ వారికి అందచేయవచ్చును. తదుపరి వివరాలను సి.ఆర్.డీ.ఏ వెబ్ సైట్ http://crda.ap.gov.in. లోను, సి.ఆర్.డీ.ఏ విజయవాడ కార్యాలయంలో, నిడమానూరు గ్రామ పంచాయతి కార్యాలయంలో పని దినములలో చూడ వచ్చును.

సం/- కమిషనర్, ఏపీ సిఆర్డీఏ

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
IDFC FIRST Bank
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో కలవడమైనది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పిలువబడుతున్నది) CIN : L65110TN2014PLC097792
నమోదిత కార్యాలయం: కెఆర్ఎం టవర్స్, 8వ అంతస్తు, హర్రింగ్‌టన్ రోడ్, చెట్‌పట్, చెన్నై-600031.
టెలి: +91 44 4564 4000 ఫ్యాక్స్: +91 44 4564 4022.

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద నోటీసు

ఏదైతే, ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో కలవడమైనది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పిలువబడుతున్నది) నుంచి దిగువ తెలిపిన రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలు దిగువ తెలియపరిచిన సెక్యూర్డ్ లోన్స్‌ను తీసుకొని ఉన్నారు. రుణగ్రహీతలు మరియు సహ రుణగ్రహీతలు వారు వారి యొక్క ఆస్తులను తనఖా పెట్టి లోన్‌ను తీసుకున్నారు. వారు వారి యొక్క లోన్ అగ్రిమెంట ప్రకారం ఉన్న నియమాలు మరియు నిబంధనలు పాటించడంలో విఫలమైనారు మరియు వారి యొక్క లోన్‌ను ఆర్‌బిఐ గైడ్ లైన్స్ ప్రకారం ఎన్‌పిఏ లుగా వర్గీకరించబడినాయి. వారు సదరు ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో కలవడమైనది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పిలువబడుతున్నది) బ్యాంకు వారికి బకాయి ఉన్న మొత్తంను నోటీసులో జారీ చేయబడిన విధంగా దిగువ టేబుల్‌లో వివరింపబడ్డాయి మరియు బకాయిల మీద తదుపరి వడ్డీ కూడా ఉంటుంది మరియు అదే కాంట్రాక్టువల్ రేటు ప్రకారం తెలిపిన తేదీలలో ఆమోదించబడతాయి.

క్ర. సం	లోను అకౌంట్ నెం	లోను రకం	రుణగ్రహీత మరియు సహ-రుణగ్రహీతల పేరు	సెక్షన్ 13(2) నోటీసు తేది	సెక్షన్ 13(2) నోటీసు ప్రకారం బకాయి మొత్తం	ఆస్తి చిరునామా
1	39425077	ఆస్తి పై రుణం	1. పద్మజ దార, 2. కొనల నవీన్ కుమార్	14.11.2023	INR 38,28,475.57/-	ఆంధ్రప్రదేశ్ 520002, కృష్ణ, విజయవాడ జిల్లా, పటమట, పటమట సబ్ రిజిస్ట్రీ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, మొగల్‌రాజపురం, ఎన్.టి.ఎస్.నం.800/ఎ, కొత్త వార్డు నం.27, పాత మున్సిపల్ వార్డు నం.24, రెవెన్యూ వార్డు నం.10, బ్లాక్ నం.18, మూల్యాంకనం నం.25121ఎ, డో.నం.32-8-7చ 32-8/7ఎ లో మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ విస్తీర్ణం 20 చ.గ.లు. (16.72 చ.మీ.లు.) సైట్ మొత్తం పరిధిలో 1107.11 చ.గ.లు. (925.65 చ.మీ.లు.) అవిభక్త వాటా తో పాటు "కృష్ణ సాయి టవర్స్" గా పిలువబడే అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్ లోని రెండవ అంతస్తులో బేరింగ్ ఫ్లాట్ నం.201 కొలిచే 1040 చ.అ.లు. (బిల్డప్ ఏరియా) తో అన్నీ సౌలభ్య హక్కులు. మరియు హద్దులు : **ఫ్లాట్ సరిహద్దులు : తూర్పు : ఓపెన్ టు స్కై, పడమర : అపార్ట్‌మెంట్ నం.202, ఉత్తరం : కారిడార్, దక్షిణం : ఓపెన్ టు స్కై (మున్సిపల్ రోడ్డు)** **సైట్ సరిహద్దులు :** **ఒకటవ అంశం : తూర్పు : అంశం నం.2 మరియు తాడంకి జగపతిరావు ఆస్తి, పడమర : అనంత రామచంద్రారావు ఆస్తి, ఉత్తరం : అడుసుమిల్లి రామచంద్రారావు ఆస్తి, దక్షిణం : 40 అ.లు. వెడల్పు రోడ్డు.** **రెండవ అంశం : తూర్పు : పులివర్తి రాజమ్మ ఆస్తి, పడమర : అంశం నం.1, ఉత్తరం : అడుసుమిల్లి రామచంద్రారావు మరియు కంటమనేని విశాలాక్ష్మి ఆస్తి, దక్షిణం : వద్దంకి జగపతి రావు ఆస్తి మరియు అంశం నం.3** **మూడవ అంశం : తూర్పు : పులవర్తి రాజ్యలక్ష్మి ఆస్తి, పడమర : తాడంకి జగపతి రావు ఆస్తి, ఉత్తరం : అంశం నం.2, దక్షిణం : 40 అ.లు. వెడల్పు రోడ్డు.**

మీకు తెలియజేయవలసినది ఏమనగా ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో కలవడమైనది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పిలువబడుతున్నది) కు బకాయిలను చెల్లిచవలసిందిగా మరియు టేబుల్ లో చూపించిన దాని ప్రకారం కాంట్రాక్టువల్ రేటు ప్రకారం దాని యొక్క తేదీలతో పాటుగా ఇతర ఖర్చులు, చార్జీలు మరియు ఇతరమైనవి ఈ నోటీసు ప్రచురించిన 60 రోజులలోగా చెల్లించవలెను., ఒక వేళ మీరు గనుక చెల్లించడంలో విఫలమైనచో దిగువ సంతకాదారుడు SARFAESI చట్టం యొక్క సెక్షన్ 14 మరియు సెక్షన్ 13(4) ప్రకారం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో కలవడమైనది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పిలువబడుతున్నది) బ్యాంకు వారు వారి యొక్క ప్రక్రియ మొదలుపెడతారు. కనుక మీరు సెక్షన్ 13(13) ప్రకారం మీరు మీ యొక్క సెక్యూర్డ్ ఆస్తులను అమ్మడం/లీసు కు ఇవ్వడం గానీ లేదా ఇతర పనులు చేయడానికి మీకు అనుమతి లేదు.

సం/-
అధీకృత అధికారి
తేది: 23.12.2023
ప్రదేశం: కృష్ణ, ఆంధ్రప్రదేశ్
ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో కలవడమైనది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పిలువబడుతున్నది)

AXIS BANK LIMITED
రిటైల్ లెండింగ్& పేమెంట్ గ్రూప్ (లోకల్ ఆఫీసు/ బ్రాంచి): యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డోర్ నం.30-22-79, శ్రీ టవర్స్, 1వ అంతస్తు, ఏలూరు రోడ్, సీతారామపురం సర్కిల్, విజయవాడ-520002.

రూల్ 8(1) క్రింద లాంఛనప్రాయ స్వాధీన ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, **యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్** (గతంలో యుటిఐ బ్యాంక్ లిమిటెడ్‌గా పేరుగలది) యొక్క అధీకృత అధికారి, దీని రిజిస్టర్డు ఆఫీసు: "తిషూల్", సమర్తేశ్వర్ టెంపుల్ ఎదురుగా, లా గార్డెన్ దగ్గర, ఎల్లిస్‌బ్రిడ్జ్, అహ్మదాబాద్-380006, ఇతర ప్రదేశంలోని దీని బ్రాంచి ఆఫీసులతోసహా **అనగా., రిటైల్ లెండింగ్ & పేమెంట్ గ్రూప్ (లోకల్ ఆఫీసు/బ్రాంచి): యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డోర్ నం.30-22-79, శ్రీ టవర్స్, 1వ అంతస్తు, ఏలూరు రోడ్, సీతారామపురం సర్కిల్, విజయవాడ-520002** ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని **డిమాండ్ నోటీసు** జారీచేసి, షార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద రుణగ్రహీత/ హామీదారులు/ తాకట్టుదారులను ఆహ్వానించుట జరిగింది.

క్ర. సం.	దరఖాస్తుదారు/ సహ-అభ్యర్థి, హామీదారులు పేరు మరియు చిరునామా	బకాయి రూ.లలో	ఈక్విటేబుల్ తాకట్టు ఆఫర్‌చేసిన ఆస్తి మరియు స్వాధీనతా తేది
2	**1. మెసర్స్ భైరవి & కం.,** ప్రతినిధియైన దీని యజమాని: తమ్మన చంద్ర వెంకట మహేశ్, డోర్ నం.74-6-11/5 బి2, నేతాజి రోడ్, అయ్యప్ప నగర్, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-520006. **2. శ్రీ తమ్మన చంద్ర వెంకట మహేశ్,** తండ్రి తమ్మన వెంకట సుబ్బారావు, డోర్ నం.74-6-11/5, ఫ్లాట్ నం.320, నేతాజి రోడ్, అయ్యప్ప నగర్, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-520006. **3. శ్రీమతి టి.బి.ఎన్.వి.ఎస్. రత్న ప్రభ, (హామీదారు),** భర్త తమ్మన వెంకట సుబ్బారావు, డోర్ నం.74-6-11/5, ఫ్లాట్ నం.320, నేతాజి రోడ్, అయ్యప్ప నగర్, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-520006. **4. శ్రీ తమ్మన వెంకట సుబ్బా రావు, (హామీదారు),** డోర్ నం.74-6-11/5, ఫ్లాట్ నం.320, నేతాజి రోడ్, అయ్యప్ప నగర్, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-520006. **డిమాండ్ నోటీసు తేది:** 11-09-2023 **రుణ ఖాతా నం.:** త916030023698577.	రూ. **4,24,05,888.85 పై.లు** (రూపాయలు నాలుగు కోట్ల ఇరువై నాలుగు లక్షల ఐదు వేల ఎనిమిది వందల ఎనభై ఎనిమిది మరియు ఎనభై ఐదు పైసలు మాత్రమే)	**ఆస్తి-1 షెడ్యూలు-ఎ:** కృష్ణా జిల్లా, విజయవాడ రిజిస్ట్రేషన్ జిల్లా, పటమట సబ్-రిజిస్ట్రార్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, విజయవాడ టౌన్, పటమట, ఆర్.ఎస్.నం.223/7బి సైటు, విస్తీర్ణం 264.60 చ.గ.లు మరియు సరిహద్దులు: **తూర్పు:** మున్సిపల్ కార్పొరేషన్ రోడ్, **దక్షిణం:** మున్సిపల్ కార్పొరేషన్ రోడ్, **పడమర:** ముప్పవరపు సీతారామయ్య & ఇతరుల ఆస్తి, **ఉత్తరం:** మందవ పద్మావతి ఆస్తి, ఈ పై సరిహద్దుల్లో విస్తీర్ణం 264.60చ.గ.లు లేదా 221.63చ.మీ.లు దీని 1/6వ భాగమైన 44.1చ.గ.లు లేదా 36.87చ.మీ.ల అన్ని ఉమ్మడి& ఈజిమెంటరీ హక్కులతో పూర్తి విస్తీర్ణంనకుగాను సూచించని మరియు విడదీయలేని భాగం. **షెడ్యూలు-బి:** పటమట, అయ్యప్పనగర్ (డిమాండ్ నోటీసు మరియు ప్లాన్ ప్రొసిడింగ్ ప్రకారం) డోర్ నం.74-6-6/3ఎలో మొదటి అంతస్తులోని ఫ్లాట్ నం.2లో నిర్మించిన ఆర్‌సిసి ధాబా భవనము యొక్క గ్రౌండ్, మొదటి మరియు రెండవ అంతస్తులతోసహా పై షెడ్యూలులో చూపిన పూర్తి ఏరియా మరియు **సరిహద్దులు: తూర్పు:** బాల్కని, **దక్షిణం:** ఫ్లాట్ నం.ఎఫ్1, **పడమర:** ఒపెన్ టు స్కై, **ఉత్తరం:** బాల్కనీ, ఈ పై సరిహద్దుల్లో బాల్కనీలు, మెట్లు, డ్రైనేజి, నీరు& పార్కింగ్‌లో ఉమ్మడి హక్కులతో సదరు అపార్టుమెంట్ యొక్క అన్ని ఉమ్మడి రిసోర్సెస్ మరియు సదరు ఫ్లాట్‌కు బిగించబడిన అన్ని రకాల వుడెన్ ఫర్నీచర్ మొ॥వాటితో ఫ్లాట్ యొక్క 800చ.అ.ల ప్లింత్ ఏరియా. **ఆస్తి-2:** కృష్ణా జిల్లా, విజయవాడ సబ్-రిజిస్ట్రీ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, ఆర్.ఎస్.నం.217/4, డోర్ నం.74--11/5, పడమట, నేతాజీ రోడ్, అయ్యప్పనగర్ వద్దగల దానిలో నివాసిత భవనము యొక్క 348.45చ.గ.ల విస్తీర్ణం మరియు **సరిహద్దులు: తూర్పు:** 30'-0" వెడల్పు రోడ్డు, **దక్షిణం:** బి. సాంబ శివ నాగి రెడ్డి ఆస్తి, **పడమర:** డి. శేషగిరి రావు ఆస్తి, **ఉత్తరం:** 30'-0" వెడల్పు రోడ్డు, పై నాలుగు సరిహద్దుల్లో అన్ని ఉమ్మడి వసతులు& ఈజిమెంట్ హక్కులతోపాటు ఆర్‌సిసి భవనముతో 348.45చ.గ.లు లేదా 291.34చ.మీ.ల విస్తీర్ణపు ఖాళీ సైటు. **ఆస్తి-3:** కాకినాడ ఎస్ఆర్ఓ పరిధిలో, కృష్ణా జిల్లా, విజయవాడ, గంగూరు గ్రామపంచాయతి, విజయవాడ పరిధిలో ఆర్.ఎస్.నం.222/2, ప్లాట్ నం.33, పాత డోర్ నం.1-60, కొత్త డోర్ నం.4-78లోకి వచ్చు గంగూరు గ్రామం వద్దగల ఆర్‌సిసి రూఫ్డ్ స్టిల్ట్, గ్రౌండ్, మొదటి& రెండవ అంతస్తుల ప్రతిపాదిత నిర్మాణంతోపాటు 253.30చ.గ.లు (211.78చ.మీ.)ల విస్తీర్ణపు ఖాళీ నివాసిత సైటు. **సరిహద్దులు: తూర్పు:** బొడ్డు సుగునమ్మ ఆస్తి, ప్లాట్ నం.14, **దక్షిణం:** 40అ.ల వెడల్పు రోడ్, **పడమర:** త30అ.ల వెడల్పు రోడ్డు, **ఉత్తరం:** ప్లాట్ నం.32 రామాబాయి ఆస్తి, ఈ పై సరిహద్దుల్లో అన్ని ఉమ్మడి వసతులు& ఈజిమెంట్ హక్కులతోపాటు ఆర్‌సిసి రూఫ్డ్ స్టిల్ట్, గ్రౌండ్, మొదటి& రెండవ అంతస్తుల తో దానిపై రెసిడెన్షియల్ భవనము యొక్క ప్రతిపాదిత నిర్మాణంతోపాటు 253.30చ.గ.లు లేదా 211.78చ.మీ.ల విస్తీర్ణపు నివాసిత సైటు. **ఆస్తి-4:** ఎస్ఆర్ఓ పటమట పరిధిలో కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, కానూరు గ్రామపంచాయతి పరిధిల్లో ఆర్.ఎస్.నం.246/1ఎ1, డోర్ నం.5-170 సమీపానకు వచ్చు కానూరు గ్రామం వద్దగల ఆర్‌సిసి రూఫ్డ్ స్టిల్ట్, గ్రౌండ్, మొదటి& రెండవ అంతస్తుల ప్రతిపాదిత నిర్మాణపు నివాసిత భవనముతోపాటు 234.0చ.గ.లు (195.647చ.మీ.) విస్తీర్ణపు ఖాళీ నివాసిత సైటు. **సరిహద్దులు: తూర్పు:** పంట కాలువ, **దక్షిణం:** దుక్కిపాటి రంగనాయకమ్మ ఆస్తి, **పడమర:** దొండపాటి లక్ష్మణ రావు ఆస్తి, **ఉత్తరం:** మాచే వదిలిన రోడ్డు. ఈ నాలుగు సరిహద్దుల్లో అన్ని ఉమ్మడి వసతులు& ఈజిమెంట్ హక్కులతోపాటు ఆర్‌సిసి రూఫ్డ్ స్టిల్ట్, గ్రౌండ్, మొదటి& రెండవ అంతస్తుల తో దానిపై రెసిడెన్షియల్ భవనము యొక్క ప్రతిపాదిత నిర్మాణంతోపాటు 234చ.గ.లు లేదా 195.647చ.మీ.ల విస్తీర్ణపు నివాసిత ఖాళీ సైటు. **ఆస్తి-5:** పటమట సబ్-రిజిస్ట్రీ పరిధిలో వైఎస్ఆర్ తడిగడాప మున్సిపల్ ఏరియా, పటమట విజయవాడ, కృష్ణా జిల్లా, ఎ.పి. యొక్క ఆర్.ఎస్.నం.98/4లో గల డోర్ నం.1-10 సమీపాన గ్రౌండ్ ఫ్లోర్ లో 879చ.అ.ల ప్లింత్ ఏరియా కలిగియున్న 97.77చ.గ.లు లేదా 81.74చ.మీ.ల విస్తీర్ణం మరియు **సరిహద్దులు: తూర్పు:** 30అ.ల వెడల్పు రోడ్, **దక్షిణం:** స్వంత ఆస్తి, **పడమర:** అంబటి జ్ఞాన్సు ఆస్తి, **ఉత్తరం:** వడ్లమూడి రామకృష్ణ& ఇతరుల ఆస్తి, అన్ని ఉమ్మడి వసతులు& ఈజిమెంటరీ హక్కులతోపాటు ఆర్‌సిసి రూఫ్ గ్రౌండ్& మొదటి అంతస్తు 879చ.అ.ల ప్లింత్ ఏరియా కలిగియున్న 97.77చ.గ.లు లేదా 81.74చ.మీ.ల విస్తీర్ణపు నివాసిత సైటు. **లాంఛనప్రాయ స్వాధీనతా తేది: 22.12.2023**

తేది: 23.12.2023
ప్రదేశం: విజయవాడ.
సం/- అధీకృత అధికారి,
యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్.

సంపాదకీయం

చీకటి పర్వం

పార్లమెంటు శీతాకాల సమావేశాలు షెడ్యూలు కంటే ఒక రోజు ముందుగానే గురువారం ముగిశాయి. హంగులతో అధునాతనంగా నిర్మించిన పార్లమెంటు నూతన భవన సముదాయంలో ఈ నెల 4న ప్రారంభమై 21 వరకు సమావేశమయ్యాయి. మూడు క్రిమినల్ బిల్లులు సహా మొత్తం 19 బిల్లులు ఉభయ సభల్లో ఆమోదం పొందాయి. లోక్‌సభ 74 శాతం, రాజ్యసభ 79 శాతం ఉత్పాదకత సాధించినట్లుగా ప్రభుత్వం ప్రకటించుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో మొట్ట మొదటి సారిగా భారతీయత జోడించిన క్రిమినల్ చట్ట బిల్లులను ఆమోదింపజేసుకున్నామని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి స్వీయభుజకీర్తులు తగిలించుకొని బాకాలూదారు. కానీ వాస్తవంలో జరిగిందేమిటో దేశమంతా చూసింది. కేంద్రంలో బిజెపి అధికారంలో ఉండగానే 2001 డిసెంబరు 13న పార్లమెంటు పాత భవనంపై ఉగ్రవాదులు దాడి జరిగింది. నాటి దాడిలో అమరులైనవారిని స్మరించుకుంటూ శ్రద్ధాంజలి ఘటిస్తున్న రోజే పార్లమెంటు కొత్త భవనంలోకి చొరబడి దుండగులు ఎంతటి భయోత్పాతానికి గురి చేశారో చూశాం. బాంబులతో రంగుల పొగ వదిలి అధునాతన భవనమని మోడీ సర్కార్ చెబుతున్న పార్లమెంటు భద్రతా ప్రమాణాల డొల్ల తనాన్ని ఈ ఘటన రట్టు చేసింది. చొరబడిన దుండగులకు పాసులిచ్చిన బిజెపి ఎంపీని కనీసం ప్రశ్నించేందుకు కూడా మోడీ సర్కార్ ఉపక్రమించడం లేదు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రాపై అనర్హత వేటు వేయడంతో మొదలైన బిజెపి అప్రజాస్వామిక ఎత్తుగడలు శీతాకాల సమావేశాల చివరి రోజు వరకు కొనసాగాయి. భారత పార్లమెంటు చరిత్రలోనే ఒకే సెషన్‌లో 146 మంది ఎంపీలను సస్పెండ్ చేసి మోడీ సర్కార్ ఒక చీకటి పర్వాన్ని లిఖించుకుంది. నూతన పార్లమెంటు భవనం గాండ్రించే సింహతలాటం, రాజదండాలతో నిరంకుశ రాచరికానికి ప్రతిబింబంగా ఉందని, దాని ఆకారమే 'శవ పేటిక'ను తలపిస్తోందంటూ విమర్శకులు సంధించిన వ్యంగాస్త్రాలను రుజువు చేసేలా నిరంకుశ చర్యలతో ప్రజాస్వామ్య విలువలకు బిజెపి ప్రభుత్వం ఈ శీతాకాల సమావేశాల్లో సమాధి కట్టేసింది.

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం తెలంగాణలో కాంగ్రెస్, మిజోరంలో జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ అధికారంలోకి రాగా మిగిలిన మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో బిజెపి విజయం సాధించిన నేపథ్యంలో పార్లమెంటు శీతాకాల సమావేశాలు వాడీవేడీగా జరుగుతాయని భావించినవారికి ఈ సెషన్ తీవ్ర అసంతృప్తిని మిగిల్చిందనే చెప్పాలి. భద్రతా వైఫల్యం, గంపగుత్తగా ప్రతిపక్షాల సభ్యులపై వేటు, క్రిమినల్ చట్టాలకు సంబంధించిన బిల్లులపై మాట్లాడేందుకు తమకు తగినంత సమయం ఇవ్వలేదని అధికార పార్టీ మహిళా ఎంపీలే నిట్టూర్చడం వంటి ఘటనలతో శీతాకాల సమావేశాలు వాస్తవరూపు దాల్చిన పీడకలగా నిలిచిపోయాయి. ప్రభుత్వ దుర్మార్గపు చర్యలను నిరసిస్తూ పార్లమెంటు ఆవరణలోనే ప్రతిపక్షాల సభ్యులు నిరసన తెలియజేస్తే దానికి కూడా వక్రభాష్యాలు అల్లేసి, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్‌కు అన్యాయం జరిగిపోయిందహో అంటూ పార్లమెంటులో బిజెపి నేతలు చేసిన చేష్టలు విరక్తి పుట్టించే నాటకాన్ని తలపించాయి.

భారత శిక్షాస్మృతి, భారత నేర ప్రక్రియా స్మృతి, భారత సాక్ష్యాధారాల చట్టాల స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య సంహిత తీసుకొచ్చేందుకు ఉద్దేశించి మూడు బిల్లులను, టెలికమ్యూనికేషన్ల బిల్లును, భారత ఎన్నికల ప్రధాన కమిషనరు, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన సవరణ బిల్లును ఈ సెషన్‌లో ఆమోదింపజేసుకున్నారు. ఇవన్నీ కూడా భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలను, ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే బిల్లులే. ప్రతిపక్షమంటే ప్రజల గొంతుక. ప్రజల సమస్యలను ప్రస్తావించేలా చట్ట సభల అధిపతులు ప్రతిపక్షాల హక్కులను కాపాడి వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలి. కానీ పార్లమెంటు ఉభయ సభల అధిపతులూ ఈ బాధ్యతను నిర్వహించకపోవడమే గాకుండా ప్రభుత్వానికి వంత పాడి సభాసాంప్రదాయాలను సైతం మంటగల్పారన్న విమర్శలకు శీతాకాల సమావేశాలే తార్కాణం. ఈ నిరంకుశ చర్యలకు చరమగీతం పాడాలంటే మోడీ సర్కార్‌ను సాగనంపడమే మార్గం. ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు ఇదే లక్ష్యంతోనే ఐక్యం అవ్వాలి.

మహనీయుల మాట



మనకు గల సత్తాను బట్టి మనల్ని మనం అంచనా వేసుకుంటాం. మనం చేసిన పనులను బట్టి ఇతరులు మనల్ని అంచనా వేస్తారు.

- లాంగ్ ఫెలో,
కవి, విద్యావేత్త.



మానవ హక్కులను మసి చేసిన మనుస్మృతి

సందర్భం

ఎస్. వినయ కుమార్

> **వర్ణాశ్రమ ధర్మాన్ని మనుషుల మీద రుద్దడానికే మనుస్మృతి ఉనికిలోకి వచ్చింది. ఈ విషయం మనుస్మృతి లోని రెండవ శ్లోకంలోనే దాపరికం లేకుండా చెప్పారు. "కొందరు మహర్షులు ఒకరోజు మనువు దగ్గరికి వెళ్లి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులనే నాలుగు వర్ణాల గురించి చెప్పమని అడిగారట. మనువేమో భృగు మహర్షి చెప్తాడని వారిని పంపించారట. సమాజం మనుగడ సాఫీగా సాగడానికి మనుస్మృతి రాశారని ఎవరైనా చెబితే అది పెద్ద మోసం. మెజారిటీ ప్రజలను దోచుకొని మైనారిటీ జనం సుఖ భోగాలను అనుభవించడానికే మనుస్మృతి ఉనికిలోకి వచ్చింది. అలాగే మహిళలను అణచిపెట్టడానికి పనికొచ్చింది. ఆ స్మృతి ఒకరు రాసింది కాదు. తమ సుఖం కోసం బ్రాహ్మణులు వందల యేళ్లపాటు తమ ప్రక్షిప్తాలు జోడించారు.**

మెజారిటీ ప్రజలకు మానవ హక్కులను మృగ్యం చేసేది మనుస్మృతి. మానవ హక్కుల కోసం జీవితాంతం పోరాడిన బాబా సాహెబ్ తన ఉద్యమ తొలినాళ్లలోనే మనుస్మృతిని బహిరంగంగా తగలబెట్టారు. 1927 డిసెంబర్ 25న, అంటే 96 ఏళ్ల క్రింతం మహద్ చెరువు పోరాటం సందర్భంగా దాన్ని దహనం చేశారు. మహద్ చెరువులోని నీటిపై దళితులకు కూడా హక్కు ఉందని చాటడానికి జరిగిన పోరాటమని మహర్లు, చంబార్లు, మాంగులతో పాటు అంటరానితనానికి వ్యతిరేకంగా కలిసి వచ్చే ఉన్నత కులాల వారినీ సమీకరించారు అంబేద్కర్. మహద్ సభలో మనుస్మృతిని తగలబెట్టాలన్న తీర్మానాన్ని ప్రతిపాదించే బాధ్యతను ఒక బ్రాహ్మణుడికి అప్పగించారాయన. అప్పటికే ఆంగ్లేయుల పాలనలోని బొంబాయి శాసనసభ, ప్రభుత్వ వనరులను, స్థలాలను అంటరానివారితో సహా అందరూ ఉపయోగించుకోవచ్చన్న తీర్మానాన్ని ఆమోదించింది. అయినా బ్రాహ్మణులు ఇతర ఉన్నత కులాలవారు అడ్డుకున్నారు.

మనుస్మృతి దహనంతో మొత్తం భారతదేశ దృష్టిని అంబేద్కర్ ఆకర్షించారు. ఆయన ఉద్యమాన్ని, ఆలోచనలను లెక్కచేయని పత్రికలు దహనం తర్వాత అంబేద్కర్‌పై కాలు దువ్వి కయ్యానికి దిగాయి. తమ సంపాదకీయాల్లో ఎడాపెడా తిట్టేశాయి. ఆ తిట్లు అంటరానితనానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం పాలిట వరాలయ్యాయి. అంబేద్కర్ ఉద్యమం గురించి కొత్తగా చాలా మందికి తెలిసొచ్చింది. ఆ ఉద్యమంపై నిప్పులు చెరిగిన పత్రికలకు అంబేద్కర్ తన "బహిష్కృత్ భారత్" పత్రికలో ఘాటైన సమాధానాలు ఇచ్చారు.

వర్ణాశ్రమ ధర్మాన్ని మనుషుల మీద రుద్దడానికే మనుస్మృతి ఉనికిలోకి వచ్చింది. ఈ విషయం మనుస్మృతి లోని రెండవ శ్లోకంలోనే దాపరికం లేకుండా చెప్పారు. "కొందరు మహర్షులు ఒకరోజు మనువు దగ్గరికి వెళ్లి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులనే నాలుగు వర్ణాల గురించి చెప్పమని అడిగారట. మనువేమో భృగు మహర్షి చెప్తాడని వారిని పంపించారట. సమాజం మనుగడ సాఫీగా సాగడానికి మనుస్మృతి రాశారని ఎవరైనా చెబితే అది పెద్ద మోసం. మెజారిటీ ప్రజలను దోచుకొని మైనారిటీ జనం సుఖ భోగాలను అనుభవించడానికే మనుస్మృతి ఉనికిలోకి వచ్చింది. అలాగే మహిళలను అణచిపెట్టడానికి పనికొచ్చింది. ఆ స్మృతి ఒకరు రాసింది కాదు. తమ సుఖం కోసం బ్రాహ్మణులు వందల యేళ్లపాటు తమ ప్రక్షిప్తాలు జోడించారు.

మనుస్మృతిలో దేవుడు బ్రాహ్మణులకు నాలుగు నియమాలను విధించాడట. అధ్యయనం (నేర్చుకోవడం), అధ్యాపనం (నేర్పించడం), యజనం (యజ్ఞం చేయడం), యాజనం (యజ్ఞం చేయించడం). క్షత్రియునికేమో ధర్మబద్ధ పాలన, తనవారి సంరక్షణ, వైశ్యులకేమో వస్తు సేకరణ, ధనార్జన ధర్మంగా చెప్పారు. శూద్రుల విధి పై మూడు వర్ణాలకు సేవ చేయడమే అని నిర్దిష్టంగా నిస్సిగ్గుగా చెప్పారు. దానికి కారణం నాల్గవ వర్ణమైన శూద్రుల్లో పూర్తిగా అజ్ఞానం ఉంటుందని సిద్ధాంతీకరించారు. వారి శారీరక మానసిక స్థితిలోనూ అనేక దోషాలుంటాయని వర్ణం మార్చుకోవడం సాధ్యం కాదనీ చెప్తుంది. మరి పంచములు ఎలా వచ్చారో స్మృతి చెప్పదు. కాని శూద్రల కంటే పంచములతో ఎంత అన్యాయంగా, అనాగరికంగా వ్యవహరించవచ్చో చెప్తుంది. మనుస్మృతి క్రీస్తు పూర్వం నుండే రాసిందే అయినా ఇప్పటికీ దాని ప్రభావం హిందూ సమాజంపై గాఢంగా ఉంది.

స్త్రీలకు మనుస్మృతి ఆస్తి హక్కునిచ్చిందని, వరకట్నాలు కన్యాశుల్కాన్ని నిషేధించిందని, స్త్రీకి మళ్లీ చేసుకొనే అవకాశం ఉందని సంతానవతి అయిన భార్య బతికుండగా పురుషుడు మరో పెళ్లి చేసుకోవడాన్ని నిషేధించిందని చెప్తారు. ఆ హక్కులన్నీ ఎక్కడికి పోయాయి? వైద్యశాస్త్రం అభివృద్ధి చెందిన నేటి దశలోనూ సంతానం లేకపోవడానికి స్త్రీయే కారణం అన్న భావన అత్యధికుల్లో ఇప్పటికీ ఉండటానికి మనుస్మృతే కదా కారణం. యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా: అంటే ఎక్కడ స్త్రీలను పూజిస్తారో అక్కడ దేవతలు సంతోషిస్తారని అర్థం. మనుస్మృతిలో ఈ శ్లోకం ఉన్న మాట నిజం. అదే సమయంలో స్త్రీ బాల్యంలో తండ్రి సంరక్షణలో, యవ్వనంలో భర్త సంరక్షణలో, ముసలితనంలో పుత్రుడు లేదా బంధువుల సంరక్షణలో ఉండాలి. స్త్రీ స్వతంత్రంగా ఉండటానికి వీల్లేదన్న (నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి) శ్లోకం కూడా మనుస్మృతి లోనే ఉంది కదా? స్త్రీ మాత్రమే కామ పీడితురాలు అయినట్లు చెప్పే శ్లోకాలు కూడా మనుస్మృతిలో ఉన్నాయి. అనేక చోట్ల స్త్రీలపై ఆంక్షలు విధించి, ఈ ఒక్క శ్లోకంతో పాప పరిహారం పొందాలంటే ఎలా చెల్లుతుంది?

తండ్రి, సోదరులు తనను ఎవరికి అప్పగిస్తారో అతనికి జీవితాంతం స్త్రీ సేవలు చేయాలి. అతను చనిపోతే మళ్లీ పెళ్లి చేసుకోరాదు. భర్తను ఆదరిస్తే అతను పరలోకంలో కూడా స్త్రీకి సుఖాన్నిస్తాడు. దురాచారి, స్త్రీ లోలుడు సుగుణాలు లేని భర్తను కూడా ఆదరించాలి. అంటే ఆ బాపతు పరలోకంలో కూడా వదలడన్న మాట. మంత్రాలోచన సమయంలో వికలాంగులను, వృద్ధులను మ్లేచ్ఛులను, స్త్రీలను అక్కడి నుండి పంపించాలని మనుస్మృతి చెప్తుంది. అప్పులకు సంబంధించి ఒక స్త్రీ మరో స్త్రీకి సౌఖ్యంగా ఉండవచ్చుట. ఇతర విషయాల్లో మంచి బుద్ధిగలవారైనప్పటికీ స్త్రీలు సాక్ష్యానికి పనికిరారట. ఎందుకంటే వారు చపల చిత్తులని మనుస్మృతి చెప్తుంది కాని నిజానికి సంకల్ప శుద్ధి స్త్రీల్లోనే ఎక్కువ కన్పిస్తుంది. ముస్లింల్లోనూ ఇద్దరు స్త్రీ సాక్షులు ఒక పురుష సాక్షికి సమానమట. ఎందుకంటే భగవంతుడు స్త్రీకి సగం మెదడు మాత్రమే ఇచ్చారని ముస్లిం బోధకులు చెప్తుంటారు. ఎంత అశాస్త్రీయం?

మనుస్మృతిని భారత రాజ్యాంగంతో పోల్చుతూ అర్థంలేని వాదన కూడా చేస్తారు. రాజ్యాంగానికి సవరణలు చేసినట్లే మనుస్మృతి లోనూ కాలమాన పరిస్థితులను బట్టి మార్పులు చేసుకోవచ్చంటారు. 1950 నుండి రాజ్యాంగం అమల్లోకి వచ్చింది కనుక మనుస్మృతితో పని లేదని మాత్రం చెప్పరు. ఎందుచేత? రాజ్యాంగ సవరణకు నిర్ణీత పద్ధతులున్నాయి. ఒక వేదిక ఉంది. పార్లమెంట్‌లో మూడింట రెండవ వంతు సభ్యుల ఆమోదంతో మాత్రమే రాజ్యాంగ సవరణ చేయవచ్చు. మరి మనుస్మృతిని ఎక్కడ, ఎవరు, ఏ విధంగా సవరించవచ్చో చెప్పలేరు. భగవంతుడే మనుషులను అసమాన సామర్థ్యంతో నాలుగు వర్ణాలుగా పుట్టించారన్న మౌలిక అవగాహనలో మాత్రం ఎలాంటి సవరణ జరగలేదు. అలాగే శూద్రులు, పంచముల పట్ల సామాజిక వివక్ష చూపాలన్న శ్లోకాల్లో సవరణ జరగలేదు. స్మృతిలో అనేక మూఢనమ్మకాలూ ఉన్నాయి. వాటికీ జరగలేదు కదా!

యూరపు దేశాలు ఫ్యూడల్ వ్యవస్థ నుండి బయట పడి స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం పేర ప్రభుత్వాలను ఏర్పరచుకొన్నాయి. ఆ ప్రజాస్వామ్యంలో ఉన్న స్వేచ్ఛ, సమానత్వాలు ఏ పాటివి? అన్న విషయాన్ని పక్కన పెడదాం. ఆ దశలో భారతదేశం లోకి తమ మార్కెట్లను విస్తరించుకోవడానికి వచ్చిన ఆంగ్లేయ కంపెనీలు మన దేశాన్ని వలసదేశంగా మార్చుకొని పరిపాలన సాగించాయి. తమ పాలన కోసం ఒక చట్టం రూపొందించాలని చూస్తున్న దశలో వారికి మనుస్మృతి తమకు అనుకూల గ్రంథంగా కన్పించింది. బ్రిటిష్ పాలకుల ఆదేశం మేరకు కోల్‌కతా లోని జగన్నాథ తర్క పంచానన అనే సంస్కృత పండితుడు మనుస్మృతిపై ఒక గ్రంథం రాశారు. మనుస్మృతితో పీడిత వర్గాలను ఎంత సునాయసంగా దోచుకోవచ్చో బ్రిటిష్ పాలకులు కూడా గుర్తించారు. ఆ తర్వాత చాలా మంది ఆంగ్లేయులు మనుస్మృతిని ఇంగ్లీషులోకి అనువదించారు. ప్రజలను విడదీసి పాలించడానికి ఒక రెడీమేడ్ సాధనంగా వారికి మనుస్మృతి కన్పించడంలో ఆశ్చర్యం లేదు.

ఏ మతమైనా, తమ మత గ్రంథాలు దేవుడి నుండి నేరుగా వెలువడినవేనని, వాటిని సవరించడానికి ఏ మాత్రం వీల్లేదని చెప్తుంది. కాని మతాచరణలో అనేక మార్పులు జరుగుతుంటాయి. మారనిదల్లా మార్చడానికి అవకాశం లేదన్న అబద్ధం మాత్రమే. ఇతర మతాల్లోలాగే వేదాలను కూడా అపౌరుషేయాలని చెప్పారు. అంటే వాటిని పురుషులు (మనుషులు) రాయలేదని అర్థం. వేదాలు సులభంగా అర్థమయ్యేవిగావని అందులో పెక్కు శాఖలున్నాయని, వేదాలకు పరిమితి నిర్ణయించలేమనీ చెప్పారు. దానివల్ల హిందూ మతంలోకి దేనినయినా సులభంగా కలిపేసుకొని దాని అవశేషంగా మిగిల్చే అవకాశం దక్కింది. బౌద్ధాన్ని, జైనాన్ని, సూఫీ బోధనలను, దర్గాలను, క్రైస్తవ బోధనలను ఒకటేమిటి సర్వం స్వీకరించి "వాతాపి జీర్ణం" అని త్రేన్చవచ్చు.

అలా చూస్తే బిజెపి ప్రవచించే పరమత ద్వేషం మతపరమైంది కాదు. అది కేవలం రాజకీయపరమైంది. ముస్లింలపై, క్రైస్తవులపై అది విద్వేషం నూరిపోస్తుంది. మనుస్మృతి శూద్రులకు భావప్రకటనా స్వేచ్ఛను కూడా నిరాకరించింది. పైమూడు వర్ణాల వారిని విమర్శించకుండా వారికి శూద్రులు శుశ్రూష చేయాలని శాసిస్తుంది. కష్టం చేసే వాడికే కదా నిష్కామ కర్మ సిద్ధాంతం వర్తించేది. మానవుల్లో బ్రాహ్మణులు శ్రేష్ఠులని చెప్తుంది. భూమి మీద ఉన్న సంపద అంతటికీ బ్రాహ్మణుడే అర్హుడంటుంది.

ఎవరిదీ కాని నిధి బ్రాహ్మణుడికి దొరికితే దాన్ని అతను పూర్తిగా తీసుకోవచ్చు. రాజుకు దొరికితే సగం బ్రాహ్మణులకిచ్చి సగం ఖజానాకు తరలించాలి. శూద్రుడు ఆస్తికి హక్కుదారుడు కాదు గనుక ఆ సమస్యే రాదు. బ్రాహ్మణుడిని తిడితే క్షత్రియునికి నూరు రూకలు, వైశ్యునికి 200 రూకలు, శూద్రునికి దెబ్బలు దండనగా విధించాలి. బ్రాహ్మణుడు క్షత్రియుడిని తిడితే యాభై రూకలు, వైశ్యుడిని తిడితే 25 రూకలు, శూద్రుడిని తిడితే 12 రూకలు, దండన విధించాలి. చట్టం ముందు అందరూ సమానమేనన్న సూత్రం వర్తించదు. శూద్రుడు ద్విజులను 'పాపిష్టి వాడా' అని తిడితే వాడి నాలుక కోసెయ్యాలి. ఎందుకంటే వాడిది హీన జన్మ అని స్మృతి లోని శ్లోకాలు చెప్తాయి. రాజ్యాంగం దృష్టిలోనేమో పౌరులందరూ సమానమే, మను ధర్మంలో శిక్షలు, దుస్తులు, ఆభరణాలు, ఆచారాలు వర్ణ, కులాలను బట్టి ఉంటాయి. మనుస్మృతి అన్ని విధాలా వివక్షాపూరితమైనది. ప్రజాస్వామ్య స్ఫూర్తికి, భారత రాజ్యాంగానికీ పూర్తి విరుద్ధమైనది. అందుకనే దాన్ని తిరస్కరించాలి.

/వ్యాసకర్త 'ప్రజాశక్తి' పూర్వ సంపాదకులు/

రాష్ట్ర ఎన్నికల్లో కీలకం కానున్న మైనారిటీలు!

విశ్లేషణ

ఐ.వి. మురళీకృష్ణ శర్మ



> **మణిపూర్‌లో క్రిస్టియన్లపై దాడులు చేసినా కేంద్రంలోని, ఆ రాష్ట్రంలోని బిజెపి సర్కారు సరిగ్గా స్పందించలేదనే అసంతృప్తి ఎ.పి లోనూ నెలకొని ఉంది. ఈ ఘటనపై పలు క్రిస్టియన్ సంఘాలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టాయి. పై పరిణామాలతో ముస్లిం, క్రిస్టియన్ సామాజిక వర్గాలు బిజెపి పై ఆగ్రహంతో, ఆ పార్టీతో అంటకాగే పార్టీని కూడా శిక్షించాలనే దృఢ నిశ్చయంతో ఉన్నాయి. అయితే రాష్ట్రంలో వైఎస్‌ఆర్‌సిపి, టిడిపి-జనసేన కూటమి మైనార్టీల భావాలను పట్టించుకోకుండా ముందుకెళ్తే ఎదురుదెబ్బ తప్పదు.**

వేసవి కాలంలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు చలికాలంలోనే వేడిని పుట్టిస్తున్నాయి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ముగియడంతో ఇప్పుడు తెలుగువారి దృష్టి అంతా ఆంధ్రా ఎన్నికలపైనే ఉంది. సంక్షేమ పథకాలే తమను మళ్లీ అధికారంలోకి తెస్తాయని వైఎస్‌ఆర్‌సిపి ఆశిస్తుండగా, ప్రభుత్వ వ్యతిరేకతతో అధికార మార్పిడి ఖాయమని టిడిపి-జనసేన కూటమి భావిస్తోంది. ఆ పార్టీలు సంక్షేమ పథకాలు, అభివృద్ధి, ప్రభుత్వ వ్యతిరేకత వంటి అంశాలపైనే దృష్టి కేంద్రీకరిస్తున్నాయి. అంతకంటే ఎక్కువగా ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించనున్నారని చెప్పవచ్చు.

మైనార్టీల జనాభా, గత ఎన్నికల్లో వారు అనుసరించిన విధానం అంశాలను పరిశీలించడంతోపాటు ప్రస్తుత రాష్ట్ర రాజకీయ పరిస్థితులను కూడా పరిగణలోకి తీసుకుంటూ 'పీపుల్స్ పల్స్' శాస్త్రీయంగా అధ్యయనం చేసింది. ఎపి లో సుమారు పది శాతం ముస్లింలు, ఒక శాతం క్రిస్టియన్లు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఎస్‌సి, ఎస్‌టి, బిసి లతో పాటు అగ్రవర్ణాలలో కూడా మత మార్పిళ్లు జరుగుతున్నాయి (ఇలాంటివి అధికారిక గణాంకాల్లో వ్యక్తం కావు). ఎన్నికల్లో మైనార్టీల ప్రభావం ఉండబోతోంది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, నెల్లూరు, అనంతపురం, చిత్తూరు జిల్లాలలో పది శాతానికి పైగా, కడప, కర్నూలు జిల్లాలలో పదిహేను శాతానికి పైగా మైనార్టీలున్నారు. ప్రధానంగా ముస్లింలు 64 స్థానాలకు పైగా అసెంబ్లీ నియోజక వర్గాల్లో నిర్ణయాత్మకంగా ఉన్నారని అంచనా.

మైనార్టీల నిర్ణయం రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితుల కంటే బిజెపి పైనే అధికంగా ఆధారపడి ఉంటోంది. ఇక్కడి పార్టీలు బిజెపి కి అనుకూలంగా, వ్యతిరేకంగా వ్యవహరించే తీరునుబట్టి ముస్లింలు నిర్ణయం తీసుకుంటారని గత ఎన్నికల అనుభవాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో టిడిపి, వైఎస్‌ఆర్‌సిపి గత ఎన్నికల్లో పొందిన ముస్లిం ఓట్ల శాతాన్ని పరిశీలిస్తే ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. సిఎస్‌డిఎస్-లోక్‌నీతి డేటాను పరిశీలిస్తే బిజెపి తో పొత్తు పెట్టుకోకుండా పోటీ చేయడంతో టిడిపి 1996లో 36.7 శాతం, 1998లో 46.6శాతం, 2009లో 24.8శాతం, 2019లో 46శాతం ముస్లిం ఓట్లు పొందింది. అదే బిజెపి తో కలిసి పోటీ చేసిన 1999లో 28.2శాతం, 2004లో 34శాతం, 2014లో 33శాతం ముస్లిం ఓట్లు పొందింది. బిజెపి తో పొత్తు పెట్టుకొని పోటీ చేసినప్పుడు ముస్లిం మద్దతు కోల్పోతున్న టిడిపి, బిజెపి తో కలవకుండా పోటీ చేసినప్పుడు మాత్రం అధికంగా ముస్లిం ఓట్లను పొందుతోంది. బిజెపి తో పొత్తు లేకుండా 2009లో పోటీ చేసిన టిడిపి కి 24.8 శాతం ఓట్లే రావడానికి ప్రధాన కారణం అప్పుడు జరిగిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కీలక దశలో ఉండడమే.

రాష్ట్ర విభజన తర్వాత వైఎస్‌ఆర్‌సిపి 2014లో రికార్డు స్థాయిలో 66 శాతం మైనార్టీల మద్దతు పొందింది. అదే 2019 ఎన్నికలొచ్చే సరికి 17 శాతం ఓట్లు కోల్పోయి 49 శాతం ఓట్లే పొందింది. దీనికి ప్రధాన కారణాలు ఆ ఎన్నికలకు ముందు జగన్ బిజెపి కేంద్ర నాయకులతో సత్సంబంధాలు కొనసాగించడంతో పాటు చంద్రబాబు బిజెపి కి వ్యతిరేకంగా కఠినంగా వ్యవహరించడం. ఈ చరిత్రలను పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో ఏ మాత్రం ప్రభావం లేని బిజెపి పరోక్షంగా ఇతర పార్టీల గెలుపోటములపై ప్రభావం చూపిస్తుందని చెప్పవచ్చు.

వైఎస్.రాజశేఖర రెడ్డిని తమ ఆరాధ్య దైవంగా భావించే వైఎస్‌ఆర్‌సిపి ప్రస్తుతం వైఎస్‌ఆర్ ప్రధాన ఆశయమైన సెక్యులర్ భావాలకు తిలోదకాలిస్తుందనే భావన రాష్ట్రంలోని మైనార్టీలలో నెలకొంది. వైఎస్‌ఆర్ ఎప్పుడూ రాజీ పడకుండా బిజెపి, సంఘ్ పరివార్ సంస్థలకు వ్యతిరేకంగా వ్యవహరించారు. ఒకానొక సమయంలో వైఎస్‌ఆర్‌పై ఆర్‌ఎస్‌ఎస్ కేసు కూడా పెట్టింది. ఇందుకు భిన్నంగా వైఎస్.జగన్ ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా అనేక కారణాలతో మొదటి నుండి బిజెపి తో ప్రత్యక్షంగా, పరోక్షంగా సయోధ్యగానే మెలుగుతున్నారు. 2014లో వైఎస్‌ఆర్‌సిపి ఓడిపోయిన తర్వాత నరేంద్ర మోడీ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయకముందే జగన్ కలిశారు. అప్పటి నుండే జగన్ బిజెపి పై సాఫ్ట్‌కార్నర్‌గా ఉంటున్నారు. వైఎస్‌ఆర్‌సిపి ఇప్పటి వరకూ బిజెపితో ప్రత్యక్షంగా పొత్తు పెట్టుకోకపోయినా, కేంద్రంలో అందరి కంటే ముందే బిజెపి కి మద్దతు ఇస్తుండడంతో రాష్ట్రంలోని మైనార్టీలు జగన్ ప్రభుత్వంపై ఆగ్రహంగా ఉన్నారు. వైఎస్‌ఆర్‌సిపి కి రాష్ట్రంలో మొదటి నుండి ముస్లింలు, క్రిస్టియన్లు ఏకపక్షంగా మద్దతిస్తున్నారు. ముస్లింలతోపాటు క్రిస్టియన్లకు కూడా జగన్ బిజెపి దోస్తీ నచ్చడం లేదు. క్రిస్టియన్ల ఓటింగ్ శాతం తక్కువే అయినా మత మార్పిడితో క్రిస్టియన్లుగా మారుతున్న సామాజిక వర్గాలకు కూడా బిజెపి తో సయోధ్యపై జగన్ అంటే గుర్రుగా ఉన్నారు. బిజెపి తో జగన్ తీరు ఇలాగే కొనసాగితే అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్‌ఆర్‌సిపి ముస్లిం ఓట్లను నష్టపోయే అవకాశాలున్నాయని ఆ పార్టీ సానుభూతిపరులు భావిస్తున్నారు.

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మొదటి నుండి బిజెపి పట్ల దృఢవైఖరితో లేకుండా అవకాశవాద రాజకీయాలకు పాల్పడుతున్నారు. 1998లో చంద్రబాబు బిజెపి ని విమర్శిస్తూ ఆ పార్టీ మసీదులు కూలుస్తుంటే తాము మసీదులు నిర్మిస్తున్నా మంటూ వ్యాఖ్యానించారు. 1999 పార్లమెంట్ ఎన్నికల సమయంలో 13 పార్టీలతో కూడిన యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా ఉన్న చంద్రబాబు కూటమిలోని నేతలకు చెప్పకుండా బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ వైపు మళ్లారు. 2004 ఎన్నికల్లో ముస్లింలు బిజెపి కి వ్యతిరేకంగా ఉండడంతో ఆ పార్టీతో పొత్తు పెట్టుకొని ఓడిపోయానని, ఇకపై బిజెపి తో కలవనని చంద్రబాబు చెప్పారు. మళ్లీ 2014లో బిజెపి తో జతకట్టిన చంద్రబాబు 2019 ఎన్నికల ముందు బిజెపి కి రాంరాం చెప్పారు. ఇకపై భవిష్యత్తులో ప్రాణం పోయినా బిజెపి తో కలవమని ఆయన చెప్పగా, టిడిపి తో ఇక ముందు పొత్తు పెట్టుకోమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా అన్నారు. ఆ సమయంలో రాష్ట్రానికి వచ్చిన అమిత్ షాను టిడిపి శ్రేణులు అడ్డుకొన్నాయి. నిప్పు, నీరుగా సాగిన వీరి తీరులో 2019లో టిడిపి ఓటమి తర్వాత మార్పు వచ్చింది. 2019కి ముందు బిజెపి పై కఠినంగా వ్యవహరించిన చంద్రబాబు వైఖరిలో మార్పు స్పష్టంగా కనిపించింది.

ఆంధ్రప్రదేశ్‌కు దక్కాల్సిన ప్రత్యేక హోదాతో పాటు ఇతర హామీలపై మోడీ ప్రభుత్వం వివక్ష చూపిస్తుందని, రాష్ట్రానికి కావాల్సింది పాచిపోయిన లడ్డూలు కావని 2019లో బిజెపి పై తీవ్ర విమర్శలు చేసిన జనసేనాని పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎన్‌డిఎలో భాగస్వామి అయ్యారు. బిజెపి తో పొత్తు కొనసాగిస్తున్నారు. పొత్తుపై ఆయన అనేక వివరణలు ఇచ్చినా మైనార్టీలకు అన్యాయం జరిగితే మొదటగా తానే స్పందిస్తానని పవన్ చెబుతున్నా ప్రస్తుత బిజెపి పోకడలతో ఆయన మాటలను మైనార్టీలు విశ్వసించడం కష్టమే.

బిజెపి వ్యవహారాలను వ్యతిరేకించే మైనార్టీలకు ఇతర రాష్ట్రాల్లో ప్రత్యామ్నాయాలున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో ఎస్‌పి, బిఎస్‌పి, కాంగ్రెస్, బీహార్‌లో ఆర్‌జెడి, జెడియు, పశ్చిమ బెంగాల్‌లో టిఎంసి, వామపక్షాలు, కాంగ్రెస్, ఒడిస్సాలో బిజెడి, కాంగ్రెస్‌లు ప్రత్యామ్నాయాలుగా ఉన్నాయి. ఆంధ్రాలో వైఎస్ ఆర్‌సిపి, టిడిపి-జనసేన కూటమే ఉండడం ఇబ్బందికరమే!

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను మొదటి నుండి పరిశీలిస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా బిజెపి ప్రభావం నామమాత్రమే. రాష్ట్రంలో నోటాతో పోటీ పడుతున్న బిజెపి గురించి మైనార్టీలు పెద్దగా పట్టించుకోలేదు. 2014లో నరేంద్ర మోడీ నేతృత్వంలో బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అధికారం చేపట్టినప్పటి నుంచి తీసుకుంటున్న వివాదాస్పద నిర్ణయాలతో మైనార్టీలలో అభద్రతా భావం పెరగడంతో పాటు ఆ పార్టీపై ఆగ్రహం కూడా ప్రారంభమైంది. అయోధ్య రామాలయం అంశంపై బిజెపి దూకుడు, కాశ్మీర్ 370 ఆర్టికల్ రద్దు, సిఎఎ, ఎన్‌ఆర్‌సి, కామన్ సివిల్ కోడ్ ప్రతిపాదన వంటి నిర్ణయాలతో తమ ఉనికికే ప్రమాదం ఏర్పడిందని ముస్లింలు భావిస్తున్నారు.

మణిపూర్‌లో క్రిస్టియన్లపై దాడులు చేసినా కేంద్రంలోని, ఆ రాష్ట్రంలోని బిజెపి సర్కారు సరిగ్గా స్పందించలేదనే అసంతృప్తి ఈ రాష్ట్రంలోనూ నెలకొని ఉంది. ఈ ఘటనపై పలు క్రిస్టియన్ సంఘాలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టాయి. పై పరిణామాలతో ముస్లిం, క్రిస్టియన్ సామాజిక వర్గాలు బిజెపి పై ఆగ్రహంతో, ఆ పార్టీతో అంటకాగే పార్టీని కూడా శిక్షించాలనే దృఢ నిశ్చయంతో ఉన్నాయి. అయితే రాష్ట్రంలో వైఎస్‌ఆర్‌సిపి, టిడిపి-జనసేన కూటమి మైనార్టీల భావాలను పట్టించుకోకుండా ముందుకెళ్తే ఎదురుదెబ్బ తప్పదు.

బిజెపి పోకడలపై దేశ వ్యాప్తంగా అనేక ప్రజా సంఘాలు, ఎన్‌జీవోలు, మేధావుల సంఘాలు మండిపడుతున్నాయి. వారు కర్ణాటకలో బిజెపి ప్రభుత్వాన్ని పడగొట్టడంలో, తెలంగాణలో బిజెపి ని అడ్డుకోవడంలో విజయవంతమయ్యారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఎపి లో వైఎస్‌ఆర్‌సిపి, టిడిపి-జనసేన కూటమి బిజెపి తో ఎంత దూరం పాటిస్తే అంత మంచిదనే వాస్తవాన్ని గుర్తించి మెలిగితేనే మంచిది.

/వ్యాసకర్త 'పీపుల్స్ పల్స్' రీసెర్చర్/

కవిత్వం

కరువు పాట

ఎండు మేఘంపై
తొలి కోడి ఆర్భాటంగా కూసింది
బోసిపోయిన నేలమ్మ
గట్టిగా ఆవులించింది
సీమలో చింతాకుకే వరం
పొలంలో కలుపుకు బలం.

ఏ పాటైనా
కరువు పల్లవితో మొదలౌతుంది
ఏ రాగమైనా
ఏడుపుతోనే ఆరంభమౌతుంది
ఆకలి పాటంటే
కడుపు తరుక్కుపోయి
జీవితం ఉలిక్కిపడుతుంది.

మూగబోయిన కోయిల
వలస పాటల రాగాలను ఆలపిస్తూ
చిగురు మరచిన చింతతో
కరువు గాయాలకు
లేపనం రాస్తూ మూగబోయింది.

నిరుపయోగపు నీటితో ఏరు
కడుపు నింపుకుంటోంది
మోటు విరిగిన నాగలి
మారుమూలన కూలబడింది
రైతు కన్నీటి తడుపులతో పంట
కొన ఊపిరితో
కొట్టుమిట్టాడుతోంది.

రాయలసీమ ఆకలి పాటకు
కలుపు మొక్కల నేల తాళం వేసింది
అరువు మద్దెల జోరు జోరుగా
రైతు వీపున మారుమోగింది
బతకలేని సగటు బతుకు
కాలానికి ప్రణమిల్లింది.

- నరెద్దుల రాజారెడ్డి
సెల్ : 9666016636

మీ రచనలను పంపాల్సిన మెయిల్ : editpageps@ gmail.com

మనోవికాసాన్ని పెంపొందించే బాలోత్సవాలు

ముగింపు సభలో వక్తలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

చిన్నారులు మనోవికాసాన్ని పెంపొందించేందుకు బాలోత్సవం వంటి వేదికలు ఎంతగానో దోహదం చేస్తాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. గుంటూరు మంగళగిరి ఎంటిఎంసి పరిధిలోని ఎర్రబాలెం డాన్‌భాస్కో హై స్కూల్ ఆవరణలో ఎంఎస్ స్వామినాథన్ వేదికపై గత రెండ్రోజుల నుండి జరుగుతున్న మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం రెండవ పిల్లల పండగ శుక్రవారం ముగిసింది. ముగింపు బహుమతి ప్రదానోత్సవ సభకు బాలోత్సవం మంగళగిరి అధ్యక్షులు వివి ప్రసాద్ అధ్యక్షత వహించారు. సభలో రోటరీ క్లబ్ మంగళగిరి ప్రాజెక్ట్ చైర్మన్ అనిల్ చక్రవర్తి, ప్రెసిడెంట్ అందే రేవంత్ మాట్లాడారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తేనే ఉన్నత స్థితికి చేరుకుంటారని తెలిపారు.

అందుకు బాలోత్సవాలు తోడ్పడతాయన్నారు. అమరావతి బాలోత్సవం వ్యవస్థాపకులు పిన్నమనేని మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి కొండలరావు మాట్లాడుతూ వేలాది మందితో మంగళగిరిలో బాలోత్సవం నిర్వహించామని, రాష్ట్రవ్యాప్తంగా 43 చోట్ల ఈ తరహా ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బాలోత్సవం గౌరవ అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు, విజె డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పి రాజశేఖర్, డాన్ బాస్కో హై స్కూల్ ప్రతినిధులు ఫాదర్ పికె జోష్ తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు.

చిన్నారుల ప్రదర్శనకు విశేష స్పందన

చిన్నారులు లఘు నాటికల రూపంలో రైతుల సాధక బాధకాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. దేశభక్తిని పెంపొందించేలా కొన్ని నాటికలు, గేయాలు, పెద్దలను ఉపాధ్యాయులను ఏ విధంగా గౌరవించాలో తెలియజెప్పేలా ప్రదర్శనలు ఆకర్శించాయి. సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబిమించేలా కోలాటం, జానపద, శాస్త్రీయ నృత్యాలు చేస్తూ సంక్రాంతి పండుగ ముందే వచ్చినంత సందడి చేశారు.

బాలికల కోలాటం

ద్రవ్యోల్బణంతో వినిమయానికి దెబ్బ : ఆర్‌బిఐ

న్యూఢిల్లీ : వినిమయ డిమాండ్‌ను ద్రవ్యోల్బణం దెబ్బ తీస్తుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) పేర్కొంది. వినియోగదారుల వ్యయానికి హెచ్చు ధరలు ప్రతికూలంగా మారాయని ఆర్‌బిఐ తన డిసెంబర్ బులిటెన్‌లో పేర్కొంది. ఇది ఉత్పాదక కంపెనీల మొత్తం వృద్ధికి, వాటి మూలధన వ్యయాలకు ఆటంకం కలిగిస్తోందని విశ్లేషించింది. ద్రవ్యోల్బణాన్ని సత్వరమే తిరిగి లక్ష్యానికి తీసుకురాకపోతే, సమర్థవంతంగా నియంత్రించకపోతే.. ఆర్థిక వృద్ధి నిలిచిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. వచ్చే 2024-25 తొలి మూడు త్రైమాసికాల్లో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 4.6 శాతానికి తగ్గొచ్చని ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ మైఖెల్ దేబబ్రత పాత్ర నేతృత్వంలోని బృందం ఈ కథనం రాసింది. ఈ బులిటెన్ లో 2024లో ప్రపంచ వృద్ధి వేగం మరింత నెమ్మదించవచ్చని విశ్లేషించింది. గడిచిన నవంబర్ మాసంలో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 5.6 శాతానికి చేరిన విషయం తెలిసిందే. ఉల్లిపాయలు, టామాటోలు వంటి నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం వల్ల రాబోయే నెలల్లో ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉందని ఆర్థికవేత్త సుజన్ హజ్రా పేర్కొన్నారు.

నగరాలతో సమానంగా గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్

- ఎపిఇపిడిసిఎల్ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యప్రతాప్

ప్రజాశక్తి - సీతంపేట (పార్వతీపురం మన్యం)

నగరాలతో సమానంగా గ్రామాలకు కూడా ఇకపై త్రీఫేస్ విద్యుత్ అందిస్తామని ఎపిఇపిడిసిఎల్ ప్రాజెక్ట్ రాష్ట్ర డైరెక్టర్ వివి సూర్యప్రతాప్ తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండం కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ..

మరో 18 నెలల్లో నగరాలతో సమానంగా గ్రామాలకూ త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అందిస్తామని తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, రంపచోడవరంతో పాటు 11 జిల్లాల్లో 17,505 గ్రామాల్లో 3761 గృహాలకు విద్యుత్తు లేదని, ఐటిడిఎల నుంచి మినిస్టీరియల్ ట్రైబల్ వెల్ఫేర్ నుంచి తమ వద్దకు నివేదికలు వస్తే దానిపై సర్వే చేపట్టి, ఈనెల 24లోగా పూర్తి చేస్తామని చెప్పారు. లోయల్లో విద్యుత్ స్తంభం వేయలేని గ్రామాలకు సోలార్ విద్యుత్తును అందిస్తామన్నారు. పాలకొండ డివిజన్‌లో 451 గ్రామాల్లో 1468 గృహాలకు సర్వే చేపడుతున్నామని, ఈ డివిజన్‌లో గూడంగి, పెద్దగూడ గుర్తించామని, ఈ గ్రామాలకు సోలార్ విద్యుత్ అందిస్తామని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టిలకు 200 యూనిట్లు ఉచితంగా ఇస్తున్నామని చెప్పారు. ఆయన వెంట ఎస్‌ఇ కృష్ణమూర్తి, డిఇ గోపాలకృష్ణ, ఎఇ నీలిమ ఉన్నారు.

నిరాశా కేంద్రాలుగా రైతు భరోసా కేంద్రాలు

- నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతు భరోసా కేంద్రాలు నిరాశా కేంద్రాలుగా మారాయని జనసేన పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ విమర్శించారు. 10,408 కేంద్రాల నిర్మాణాల పేరుతో రూ.2,300 కోట్ల ఉపాధి హామీ నిధులు తీసుకున్నప్పటికీ నిర్మించిన భవనాలు 3,200 మాత్రమేనన్నారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆర్‌బికెలకు ఈ నాలుగున్నరేళ్లలో బడ్జెట్లో కేటాయించినది రూ.158 కోట్లేనన్నారు.

అనేక ప్రాంతాల్లో భవనాలకు అద్దె డబ్బులు చెల్లించక పోవడంతో మూతపడ్డాయన్నారు. వైసిపి నేతలు చెబితేనే యూరియా అయినా, పురుగు మందులైనా ఇస్తున్నారని ఆరోపించారు. ఇకవైసిపి చేయించుకోవాలని ప్రభుత్వం అన్నదాతలకు చెబుతుంటే, రైతు భరోసా కేంద్రాల్లో ఆ సేవలు అందడం లేదన్నారు. పైగా సాంకేతిక సమస్యలు ఎక్కువగా వస్తున్నాయన్నారు.

అంగన్‌వాడీలకు మద్దతుగా రౌండ్‌టేబుల్ సమావేశం లో మాట్లాడుతున్న వి. వెంకటేశ్వర్లు

అంగన్‌వాడీల సమ్మెకు సంపూర్ణ మద్దతు

- ప్రత్యక్ష పోరాటాల్లోకి వ్యవసాయ కార్మికులు
- వ్యవసాయ కార్మిక సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చెల్లించవలసిన బకాయిలను పూర్తిగా చెల్లించని సందర్భంలో పైన తెలిపిన తేదీన ఈ-వేలం అమ్మకం నిర్వహణ గురించి సదరు ఋణం తీసుకున్న ఋణగ్రహీత / సహబాధ్యతగల వారికి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని 8(6) రూలు 9(1) క్రింద దీనిని నోటీసుగా పరిగణించవలెను.

తేది : 18-12-2023 సం/- అధీకృత అధికారి,
ప్రదేశం : తాడిగడప యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తాడిగడప బ్రాంచి

ఆంధ్రప్రదేశ్‌కు రూ. 2,952.74 కోట్లు

- కేంద్ర పన్నుల వాటా కింద అదనపు నిధుల్ని విడుదల చేసిన కేంద్రం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర పన్నుల్లో వాటా కింద (స్టేట్స్ డివల్యూషన్ ఫండ్స్) కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ. 2,952.74 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. అలాగే తెలంగాణకు రూ. 1,533.64 కోట్ల ను కేంద్రం రిలీజ్ చేసింది. దేశ వ్యాప్తంగా 28 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కలిపి రూ.72,961. 21 కోట్లను కేంద్రం విడుదల చేసింది. ఈ వివరాలను శు క్రవారం కేంద్ర ఆర్థిక శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. రాబోయే పండుగల సీజన్, కొత్త సంవత్సరాన్ని దృష్టిలో పెట్టుకొని వివిధ సామాజిక సంక్షేమ చర్యలు, మౌలిక సదుపాయల అభివృద్ధికి పథకాలకు నిధులు సమకూర్చుకోడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ నిధులు ఉపయోగపడతాయని పేర్కొంది. ఈనెల 11న విడుదల చేసిన నిధులకు, వచ్చే ఏడాది జనవరి 10న రాష్ట్రాలకు చెల్లించాల్సిన పన్ను పంపిణీకి ఈ నిధులు అదనం అని స్పష్టం చేసింది. కాగా అత్యధికంగా ఉత్తరప్రదేశ్ కు రూ. 13,088 కోట్లు, తరువాత స్థానంలో బీహార్ కు రూ. 7,338.44 కోట్లు, మధ్య ప్రదేశ్ కు రూ. 5,727 కోట్లు, పశ్చిమ బెంగాల్ కు రూ. 5,488.88 కోట్లు, మహారాష్ట్రకు రూ. 4,608.96 కోట్లు, తమిళనాడుకు రూ. 2,976.10 కోట్లు, కర్ణాటకకు రూ. 2,660.88 కోట్లు, గుజరాత్ కు రూ.2,537 కోట్లు కేంద్రం విడుదల చేసింది.

త్వరలో పంచాయతీలకు రూ.2,988 కోట్లు

- ఎపికి కేంద్రం హామీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లోని స్థానిక సంస్థలకు, గ్రామ పంచాయతీలకు 2022-23, 2023- 24లో 15వ ఆర్థిక సంఘం నుంచి రావలసి ఉన్న కేంద్ర నిధులు రూ.2,988 కోట్లు త్వరలో విడుదల చేస్తామనికేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ అదనపు కార్యదర్శి చంద్రశేఖర్ కుమార్ హామీ ఇచ్చారు. ఈ నిధులు తక్షణమే విడుదల చేయాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు జాస్తి వీరాంజనేయులు చేసిన విజ్ఞప్తికి ఆయన స్పందించారు. జీవన్ భారతి భవన్ లో కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ అదనపు కార్యదర్శి చంద్రశేఖర్ కుమార్‌కు జాస్తి వీరాంజనేయులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివద్ధి శాఖ అదనపు కార్యదర్శి చంద్రశేఖర్ కుమార్ మాట్లాడుతూ గతంలో కేంద్ర ప్రభుత్వం పంపిన నిధులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యుత్తు బకాయిలు కింద తీసుకున్నందున ప్రస్తుతం నిధులను ఆపడం జరిగిందని తెలిపారు. విద్యుత్ చార్జీల కింద గ్రామ పంచాయతీలలో కేంద్ర పంపించే నిధులను డైరెక్ట్ గా రాష్ట్ర ప్రభుత్వం తీసుకోకుండా గ్రామ పంచాయతీలే విద్యుత్తు డిస్కములకు చెల్లించే విధంగా స్పష్టమైన హామీ ఇచ్చి ఉన్నందున నిధులను అతి త్వరలో విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

ఆర్మీవాహనంపై దాడి ఐదుకు చేరిన మృతుల సంఖ్య

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లో పూంచ్ జిల్లాలో గురువారం జరిగిన ఉగ్రవాదుల దాడిలో మృతుల సంఖ్య ఐదుగురికి చేరింది. గురువారం నలుగురు మరణించగా, చికిత్స పొందుతూ శుక్రవారం ఒకరు మృతి చెందినట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. సందీప్ కుమార్, శ్యామ్ సుందర్ దాస్, తోడ్మల్ జ్ఞానేశ్వర్ భాస్కరరావులు గాయపడ్డారని, వారిలో ఒకరు చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మరణించినట్లు అధికారులు తెలిపారు. బుధవారం నుంచి పూంచ్ జిల్లాలో ఉగ్రవాదుల కోసం కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంతానికి వెళుతున్న రెండు ఆర్మీ వాహనాలపై రాజౌరీ జిల్లాలోని పిర్ పంజల్ వ్యాలీ వద్ద ఉగ్రవాదులు ఒక్కసారిగా కాల్పులు జరిపారు.

అధ్యక్షుడికి వ్యతిరేకంగా అర్జెంటీనాలో భారీ నిరసనలు

బ్యూనస్ ఎయిర్స్ : ప్రజా వ్యయాన్ని తగ్గిస్తానానే హామీతో అధికారంలోకి వచ్చిన అధ్యక్షులు, పచ్చి మితవాది జేవియర్ మిలైకి వ్యతిరేకంగా అర్జెంటీనాలో ప్రజలు ఆందోళనకు దిగారు. మిలై ఆర్థిక చర్యలను వ్యతిరేకిస్తూ వేలాది మంది అర్జెంటీనియన్లు రాజధాని బ్యూనస్ ఎయిర్ వీధుల్లో నిరసన చేపట్టారు. పేదలకు ఆర్థిక మద్దతు కల్పించాని డిమాండ్ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి అధ్యక్ష భవనం ఎదుట ఉన్న చారిత్రాత్మక మీటింగ్ పాయింట్ ప్లాజా డి మయో స్క్వేర్ ర్యాలీగా చేరుకున్నారు. మిలై ప్రమాణస్వీకారం చేసిన ప్రాంతంలోనే నిరసన చేపట్టారు. మిలై నియంతలా వ్యవహరిస్తున్నారని నినాదాలిచ్చారు. భారీగా పోలీసులు మోహరించడంతో ఇది శాంతియుత ర్యాలీ అని, ఆందోళనలు, ఘర్షణలు కోరుకోవడం లేదని వామపక్ష నాయకులు అధ్యక్షుడు ఎడ్వార్డో బెల్లిబోనీ తెలిపారు.

అర్జెంటీనా అధ్యక్షుడిగా జేవియర్ మిలై ఈ నెల 10 బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. గతవారం అర్జెంటీనా కరెన్సీ విలువను 54 శాతం తగ్గిస్తున్నట్లుగా ప్రకటించారు. అలాగే సబ్సిడీలను, ప్రభుత్వ సేవలను రద్దు చేశారు. అర్జెంటీనా ఆర్థిక సంక్షోభం నుండి బయటపడాలంటే ఈ చర్యలు తప్పవని మిలై పేర్కొన్నారు.

కేంద్రానికి అసాధారణ అధికారాలు

- ఈ మూడు బిల్లుల లక్ష్యం అదే
- వార్తలను సెన్సార్ చేయొచ్చు
- ఇంటర్నెట్ సేవలు నిలిపేయవచ్చు
- గోప్యత హక్కుకు భంగం కలిగించవచ్చు

న్యూఢిల్లీ : కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తాజాగా తీసుకొచ్చిన మూడు బిల్లులు సర్కారుకు అసాధారణ అధికారాలు కట్టబెడుతున్నాయి. ఈ బిల్లుల ద్వారా ఇకపై కేంద్రం తన ఇష్టానుసారం వార్తలను సెన్సార్ చేయవచ్చు. ఇంటర్నెట్ సేవలను సులభంగా నిలిపివేయవచ్చు. సమాచార మార్పిడిని అడ్డుకోవచ్చు. వాట్సప్ వంటి సామాజిక మాధ్యమాలలో వ్యక్తుల మధ్య నడిచే సంభాషణలను తెలుసుకోవచ్చు. తద్వారా సమాచార గోప్యతకు సంబంధించిన హక్కుకు భంగం కలిగించవచ్చు.

డిజిపబ్ సంస్థ ఈ నెల 20న నిర్వహించిన సమావేశంలో పలువురు నిపుణులు ఈ మేరకు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. 60కి పైగా డిజిటల్ న్యూస్ మీడియా సంస్థలు, స్వతంత్ర పాత్రికేయులు, వ్యాఖ్యాతలకు డిజిపబ్ ప్రాతినిధ్యం వహిస్తోంది. ఇంతకీ కేంద్రం తీసుకొచ్చిన మూడు బిల్లులు ఏమిటంటే...టెలికమ్యూనికేషన్ బిల్లు, బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసుల (నియంత్రణ) ముసాయిదా బిల్లు, డిజిటల్ పర్సనల్ డాటా ప్రొటెక్షన్ చట్టం.

దేనినైనా సెన్సార్ చేయొచ్చు

ప్రభుత్వం దృష్టిలో అస్పష్టంగా ఉన్న వార్తలు సహా ఆన్‌లైన్ సమాచారాన్ని నియంత్రించే అధికారం బ్రాడ్‌కాస్టింగ్ బిల్లు ద్వారా సర్కారుకు లభిస్తుందని 'ది క్వింటెంట్' పోర్టల్ సీఈఓ రితూ కపూర్ తెలిపారు. అయితే శిక్ష, విచారణ, దర్యాప్తు, సెన్సార్‌షిప్ వంటి చర్యలకు ఎలాంటి వార్తలు దారితీస్తాయో స్పష్టంగా తెలియడం లేదని ఆమె చెప్పారు. సీఈఓలు స్వీయ ధృవీకరణ చేసిన వార్తలను మాత్రమే ప్రసారం చేయాలని అనడం పత్రికలకు ఆచరణ సాధ్యం కాదని అన్నారు. వార్తా పత్రికలకు వర్తించే ఆంక్షలే సామాజిక మాధ్యమాలలో వ్యాఖ్యలు చేసే వారికి కూడా వర్తిస్తాయని డిజిటల్ వార్తా కథనాల రూపకర్త మేఘనాథ్ తెలిపారు. వార్తలు, కరంట్ అఫైర్స్ కార్యక్రమాలు ప్రభుత్వం నిర్దేశించిన నియమావళికి కట్టుబడి ఉండాల్సి ఉంటుందని చెప్పారు. అయితే ఈ నియమావళి కార్యక్రమాలను నియంత్రిస్తూ ఉంటుందని అన్నారు. వార్తలను అందించే పాత్రికేయులు తమకు ఆ సమాచారం ఎక్కడ నుండి వచ్చిందో గోప్యంగా ఉంచే అవకాశం ఇక ఉండబోదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ఇష్టం లేని అంశాలను చర్చించే వారిని లక్ష్యంగా చేసుకొని ఈ చట్టాలను ప్రయోగించే ప్రమాదం ఉన్నదని 'ది మూక్‌నాయక్' న్యూస్ వెబ్‌సైట్ వ్యవస్థాపకురాలు మీనా కొట్వాల్ తెలిపారు. అన్ని విషయాలు ప్రభుత్వం చేతిలో ఉంటాయి కాబట్టి ఏది ఒప్పో ఏది తప్పో అదే నిర్ణయిస్తుందని చెప్పారు. 'ప్రభుత్వంలోని పలు మంత్రిత్వ శాఖలు తప్పుడు సమాచారం ఇస్తుంటాయి. అయితే వాటిని ఎవరూ ఏమీ చేయరు. మనం అందించే సమాచారం సరైనదే అయినప్పటికీ మనల్ని లక్ష్యంగా చేసుకోవడం తేలిక' అని వ్యాఖ్యానించారు.

ప్రభుత్వాన్ని, దాని విభాగాలను విమర్శిస్తూ కథనాలు ప్రచురించే పాత్రికేయులను వేధించడం, అరెస్ట్ చేయడం వంటి ఉదంతాలు ఇటీవల చోటుచేసుకుంటున్నాయి. అలాంటి ఘటనలు పాత్రికేయులను నిరుత్సాహపరుస్తాయి. వారిలో భయాన్ని రేకెత్తించి స్వీయ నియంత్రణకు అవకాశం కల్పిస్తాయి.

నిఘా పెరుగుతుంది

'టెలికం బిల్లు కారణంగా మీడియాపై ప్రభుత్వ నిఘా పెరుగుతుంది. అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతాయి. ఇంటర్నెట్ సేవలు నిలిచిపోతాయి. సమాచారాన్ని ఎవరికీ అందుబాటులో లేకుండా దానిని కోడ్‌గా మార్చేయవచ్చు' అని న్యాయవాది అపర్ గుప్తా తెలిపారు. లోక్‌సభ నుండి 95 మంది ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేసిన తర్వాత ఈ బిల్లును ఆమోదించారు. ఇంటర్నెట్ సేవలను దీర్ఘకాలం నిలిపివేస్తే జమ్మూకాశ్మీర్, మణిపూర్ ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతారని గుప్తా చెప్పారు. బిల్లును రూపొందించే సమయంలో టెలికమ్యూనికేషన్ నిబంధనలను పూర్తిగా విస్మరించారని విమర్శించారు. 2022 సెప్టెంబరులో ప్రజా సంప్రదింపుల కోసం విడుదల చేసిన దానితో పోలిస్తే ప్రస్తుత బిల్లు ఘోరంగా ఉన్నదని, అప్పుడు ప్రజలు వ్యక్తం చేసిన అభిప్రాయాలను టెలికం శాఖ బహిర్గతం చేయలేదని తెలిపారు. 'ఒకరి నుండి మరొకరికి వచ్చిన సందేశాన్ని వాట్సప్ అప్లికేషన్ కోడ్ రూపంలో మార్చి దానిని అధికారులకు పంపాల్సి ఉంటుంది. ఒకరి సందేశాలు మరొకరు చదవడం సాధ్యం కాదని ప్రస్తుతం వాట్సప్ చెబుతోంది. సందేశాన్ని తాను కూడా చూడలేనని అంటోంది. మరి ఇప్పుడేమో సందేశాన్ని కోడ్‌గా రాసే బాధ్యతను వాట్సప్‌కి అప్పగిస్తే సమాచార గోప్యత హక్కుకు భంగం కలగదా?' అని ప్రశ్నించారు. మణిపూర్ హింసకు సంబంధించి సామాజిక మాధ్యమాలలో వచ్చే ఏ వార్తనైనా ఉద్రిక్తతకు కారణమవుతోందన్న సాకుతో నిరోధించే అధికారం కేంద్రానికి లభిస్తుందని న్యాయవాది బృందా భండారీ తెలిపారు. అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు అన్ని టెలికం సేవలను నిలిపివేసే అధికారం టెలికం బిల్లు ద్వారా ప్రభుత్వానికి లభిస్తుందని న్యాయవాది శ్రేయా సింఘాల్ చెప్పారు.

గడువుతీరినా .. టోల్ ప్లాజాలను తొలగించం

న్యూఢిల్లీ : నిర్దిష్ట గడువు పూర్తయిన తర్వాత.. లేదా మూలధన వ్యయాన్ని రికవరీ అయిన తరువాత కూడా.. టోల్ ప్లాజాలను తొలగించమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇటీవల ముగిసిన పార్లమెంట్ సమావేశాల్లో ఈ విషయాన్ని కేంద్ర ఉపరితల రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. గురువారం లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి ఈ మేరకు లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. అలాగే, దేశంలోని జాతీయ రహదారులపై ఏర్పాటు చేసిన ఏ ఒక్క టోల్ ప్లాజాలోనూ ఇప్పటివరకు మూలధన వ్యయాన్ని పూర్తిగా రికవరీ చేయలేదని మంత్రి చెప్పారు. సాధారణంగా మనలో చాలామంది నిర్ణీత గడువు తర్వాత టోల్‌ప్లాజాలను మారుస్తారు లేదా తొలగిస్తారని అనుకుంటారు. అయితే జాతీయ రహదారుల రుసుముల నిబంధనలు-2008 ప్రకారం.. నిర్దిష్ట గడువు పూర్తయిన తర్వాత మూలధన వ్యయాన్ని రికవరీ చేశాక టోల్ ప్లాజాలను తొలగించాలనే ఎలాంటి నిబంధనా లేదని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పార్లమెంట్ సాక్షిగా వెల్లడించారు.

దేశంలో రవాణా సౌకర్యాలను మెరుగు పరిచేందుకు కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఎన్‌హెచ్‌ఏఐ పని చేస్తుంది. ఇది ప్రైవేటు కాంట్రాక్టు సంస్థల సహాయంతో వివిధ రాష్ట్రాల మధ్య హైవేలు, ఎక్స్‌ప్రెస్ హైవేలు నిర్మిస్తుంది. రోడ్డు నిర్మాణానికి చేసిన ఖర్చును టోల్ రూపంలో వసూలు చేసి కాంట్రాక్టర్లకు చెల్లిస్తుంది. ఈ ప్రక్రియ కొన్నేళ్లపాటు సాగుతుంది.మరోవైపు, జాతీయ రహదారులపై టోల్ ఛార్జీల వసూలుకు జీపీఎస్ ఆధారిత వ్యవస్థను 2024 మార్చి నాటికి తీసుకురానునట్లు గడ్కరీ ఇటీవల ప్రకటించారు. దీనివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తొలగడంతో పాటు జాతీయ రహదారిపై ప్రయాణించిన దూరానికి మాత్రమే టోల్ ఛార్జీ చెల్లించాల్సి ఉంటుందని మంత్రి తెలిపారు.

న్యూస్‌క్లిక్‌పై విచారణకు మరో 60 రోజుల సమయం

న్యూఢిల్లీ : న్యూస్ పోర్టల్ న్యూస్‌క్లిక్‌పై విచారణ పూర్తి చేసేందుకు ఢిల్లీ పోలీసులకు మరో 60 రోజుల సమయానికి కోర్టు శుక్రవారం అనుమతి ఇచ్చింది. అలాగే న్యూస్‌క్లిక్ ప్రధాన సంపాదకులు ప్రబీర్ పుర్కాయస్తా, హెచ్‌ఆర్ విభాగం చీఫ్ అమిత్ చక్రవర్తిలకు జ్యుడీషియల్ కస్టడీని జనవరి 20 వరకూ కోర్టు పొడిగించింది. ప్రత్యేక జడ్జి హర్దీప్ కౌర్ ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు. న్యూస్‌క్లిక్‌పై దర్యాప్తు పూర్తి చేసేందుకు మరికొంత సమయం కావాలని ఢిల్లీ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం కోర్టు విచారణ చేసింది. పుర్కాయస్తా, అమిత్ చక్రవర్తిలను ఢిల్లీ పోలీసులకు చెందిన ప్రత్యేక విభాగం అక్టోబర్3న అరెస్టు చేసింది. న్యూస్‌క్లిక్‌పై ఉపా చట్టం కింద కేసులును నమోదు చేసింది. కాగా, కేంద్ర ఆదాయపన్ను శాఖ ఇటీవల న్యూస్‌క్లిక్ బ్యాంక్ ఖాతాలను స్థంభింప చేసింది.

ఫ్రాన్స్‌లో వలస వ్యతిరేక చట్టానికి మరిన్ని కోరలు

- ఫాసిస్టు, మితవాద శక్తులతో చేతులు కలిపిన మాక్రాన్
- 349-186 ఓట్ల తేడాతో బిల్లు ఆమోదం

వలస వ్యతిరేక చట్ట సవరణ బిల్లుకు ఆమోదం తెలుపుతున్న పార్లమెంటు సభ్యులు

పారిస్: మాక్రాన్ ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద వలస వ్యతిరేక చట్ట సవరణ బిల్లుకు పార్లమెంటు గురువారం ఆమోద ముద్ర వేసింది. ఈ బిల్లు అమలుకు వ్యతిరేకంగా పెద్దయెత్తున ఉద్యమం చేపడతామని వామపక్షాలు, కార్మిక సంఘాలు, జాత్యహంకార వ్యతిరేక ఉద్యమ సంస్థలు ప్రకటించాయి. దీనికి వ్యతిరేకంగా ఉమ్మడి నిరసనకు పిలుపునిచ్చాయి. మెరైన్ లీ పెన్ నేతృత్వంలోని పచ్చి మితవాద పార్టీ నేషనల్ ర్యాలీ, సంప్రదాయవాద రిపబ్లికన్లు దీనికి ఆమోదం తెలిపారు. మరోవైపు, జాతీయ అసెంబ్లీలో బిల్లును ఆమోదించడంపై పార్లమెంటు లోపల, వెలుపల వామపక్ష, ప్రగతిశీల శక్తులు నిరసన తెలిపాయి. పౌరసత్వం , ఇతర సామాజిక ప్రయోజనాలను పొందే విషయంలో ఫ్రాన్స్‌లోని వలసదారులకు ఈ చట్టం కఠినమైన ఆంక్షలు విధించింది. ఈ బిల్లు ప్రజల మధ్య విభజన తెచ్చేదిగా ఉందని లెఫ్టిస్ట్ న్యూ ఎకోలాజికల్ అండ్ సోషల్ పీపుల్స్ యూనియన్ కూటమిలోని పార్టీలు, జనరల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ లేబర్‌తో సహా ట్రేడ్ యూనియన్లు, వివిధ హక్కుల సంఘాలు వ్యాఖ్యానించాయి.

డిసెంబర్ 21 సాయంత్రం, కౌంటీ అంతటా నగరాల్లో బిల్లును నిరసిస్తూ ప్రదర్శనలు నిర్వహించారు. వలసదారులు, శరణార్థులపై కఠినమైన ఆంక్షలు విధించాలన్న మితవాద గ్రూపుల దశాబ్దాల డిమాండ్లను నెరవేర్చే విధంగా బిల్లు ఉందని ప్రగతిశీలవాదులు విమర్శిస్తున్నారు. పార్లమెంటు దిగువ సభలో ఈ బిల్లుకు అనుకూలంగా 349, వ్యతిరేకంగా 186 ఓట్లు వచ్చాయి. అంతకుముందు సెనేట్‌లో ఇది ఆమోదం పొందింది. దిగువ సభలో సాధారణ మెజారిటీ లేని మాక్రాన్ ప్రభుత్వం పునరుజ్జీవనోద్యమ పార్టీ, మితవాద లా రిపబ్లికన్‌లతో ఒప్పందం కుదుర్చుకుంది.బిల్లు ఆమోదించడాన్ని మితవాదుల సైద్ధాంతిక విజయంగా లీపెన్ అభివర్ణించారు. మరో వైపు మాక్రాన్ సొంత పార్టీ నుంచి దీనికి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ బిల్లుకు నిరసనగా ఆరోగ్య మంత్రి ఆరేలియన్ రూసో రాజీనామా చేశారు. ఈ బిల్లను ఫ్రెంచ్ కమ్యూనిస్ట్ పార్టీ నాయకుడు ఫాబియన్ రౌసెల్ తీవ్రంగా విమర్శించారు. ఫ్రెంచ్ రిపబ్లిక్ విలువలను సజీవంగా ఉంచాలని కోరుకునే ప్రతి ఒక్కరూ దీనిని వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు .కుటుంబ భత్యాలు, హౌసింగ్ సహాయం మొదలైన సామాజిక ప్రయోజనాలు పొందేందుకు అవసరమైన కనీస వ్యవధిని ఆరు నెలల నుండి 5 సంవత్సరాలకు ఈ బిల్లులో పొడిగించారు. ఈ అమానవీయమైన బిల్లు ఫ్రెంచ్ రిపబ్లిక్ గౌరవిస్తున్న ప్రాథమిక ఆదర్శాలు (స్వేచ్ఛ! సమానత్వం! సోదరభావం!)కు విరుద్ధమని వామపక్షాలు విమర్శించాయి. గత రెండు పర్యాయాల అధ్యక్ష ఎన్నికల్లో ఫ్రాన్స్ ప్రజలు రెండవ రౌండ్‌లో మాక్రాన్‌కు ఓటు వేశారు, మితవాద నాయకురాలు మెరైన్ లీ పెన్ అధ్యక్ష పదవిని చేపట్టకుండా అడ్డుకున్నారు.

ఒపెక్ నుంచి వైదొలిగిన అంగోలా

న్యూఢిల్లీ : పెట్రోలియం ఎగుమతి దేశాల కూటమి (ఒపెక్) నుంచి తాము వైదొలుగుతున్నట్లు అంగోలా దేశం ప్రకటించింది. "మేము 2006లో ఒపెక్‌లో స్వచ్ఛందంగా చేరాము. ఇప్పుడు కూడా స్వచ్ఛందంగానే నిష్క్రమించాలని నిర్ణయించుకున్నాము. ఇది ఆలోచించకుండా.. హఠాత్తుగా తీసుకున్న నిర్ణయం కాదు" అని అంగోలా చమురు శాఖ మంత్రి డయామంటినో పెడ్రో అజెవెడో పేర్కొన్నారు. చమురు ఉత్పత్తి కోటాపై భిన్నాభిప్రాయాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు గురువారం ఆయన పేర్కొన్నారు. ఆ దేశ రాజధాని లువాండాలోని ప్రెసిడెన్షియల్ ప్యాలెస్‌లో అంగోలా ప్రెసిడెంట్ జోవా లౌరెన్కో అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశం తర్వాత ఈ నిర్ణయం ప్రకటించారు. ఒపెక్ సభ్యత్వం ఆఫ్రికన్ దేశ ప్రయోజనాలకు ఉపయోగపడదని అంగోలా ఆందోళన వ్యక్తం చేస్తోంది. "అంగోలా ఎల్లప్పుడూ తన బాధ్యతలను నెరవేర్చింది. అదే విధంగా ఒపెక్‌ను ఆధునీకరించడానికి, దాని సభ్యులకు ప్రయోజనాలను పొందడంలో సహాయం చేయడానికి అన్ని సమయాలలో పోరాడుతూనే ఉంది. కానీ.. అంగోలా ఒపెక్‌లో ఉండడం ద్వారా ఏమీ ప్రయోజనం పొందలేదు. మా ప్రయోజనాలను కాపాడుకోవడానికి ఒపెక్‌ను వదిలివేయాలని నిర్ణయించుకుంది. మేము ఒపెక్‌లో కొనసాగితే అంగోలా ఉత్పత్తిని తగ్గించవలసి వస్తుంది. ఇది ఒప్పందాలను గౌరవించే మా విధానానికి విరుద్ధంగా ఉంటుంది. ఈ నిర్ణయం అంత తేలికగా తీసుకున్నది కాదు." అని ప్రెసిడెన్షియల్ ప్యాలెస్ ప్రెస్ రూమ్‌లో అజెవెడో పేర్కొన్నారు. ఒపెక్ సభ్య దేశమైన అంగోలా రోజుకు 11 లక్షల బ్యారెల్స్ ముడి చమురును ఉత్పత్తి చేస్తుంది. ఆఫ్రికన్ ఖండంలో రెండవ అతిపెద్ద చమురు ఉత్పత్తిదారుగా ఉంది.

ఇజ్రాయిల్ యుద్ధ నేరాలపై విచారణ

- ఐరాస డిమాండ్

న్యూయార్క్: గాజాలో ఇజ్రాయిల్ ఆర్మీ సాగించిన యుద్ధ నేరాలపై విచారణ జరిపించాలని ఐక్యరాజ్య సమితి డిమాండ్ చేసింది. రమల్లాలోని వెస్ట్ బ్యాంక్ సిటీలో ఐరాస మానవ హక్కుల సంస్థ ఏర్పాటు చేసిన సహాయక శిబిరంలో తలదాచుకున్న నిరాయుధులైన పాలస్తీనీయులపై ఇజ్రాయిల్ సైన్యం కాల్పులు జరపడాన్ని ఐరాస తప్పు పట్టింది. ఈ కాల్పుల్లో 11 మంది పాలస్తీనీయులు, వారి కుటుంబ సభ్యులు చనిపోయారు. గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న హంతక దాడులను ఆపేందుకు తాత్కాలిక కాల్పుల విరమణ పాటించాలని కోరుతున్న తీర్మానం భద్రతా మండలి ముందుకు ఓటింగ్‌కు వస్తున్న తరుణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇజ్రాయిల్ అమానుష చర్య యుద్ధ నేరం కిందికే వస్తుందని ఐరాస మానవ హక్కుల సంస్థ పేర్కొంది. ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా తెచ్చే తీర్మానాన్ని గుడ్డిగా వీటో చేస్తున్న అమెరికా, ఈ యుద్ధ నేరాలపై విచారణను కూడా అడ్డుకోవాలని చూస్తోంది. గాజాలో తక్షణ మానవతావాద కాల్పులవిరమణను డిమాండ్ చేస్తూ భద్రతా మండలి ఈ నెల8న తీసుకొచ్చిన తీర్మానాన్ని అమెరికా వీటో చేసిన సంగతి తెలిసిందే. ఆ తరువాత 193 మంది సభ్యుల జనరల్ అసెంబ్లీ డిసెంబరు12న ఇదే తీర్మానాన్ని 153-10 ఓట్ల తేడాతో ఆమోదించింది. 23 దేశాలు ఓటింగ్‌కు గైర్హాజరయ్యాయి. ఇజ్రాయిల్ సాగిస్తున్న విచక్షణా రహిత దాడులకు వ్యతిరేకంగా, పాలస్తీనాకు సంఘీభావంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రదర్శనలు జరుగుతున్నాయి. హమాస్‌ను నాశనం చేసేవరకు పాలస్తీనీయులపై దాడులు కొనసాగుతాయని ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు హూంకరిస్తున్నారు.

ట్రంప్ అనర్హత కేసులో జడ్జీలకు బెదిరింపులు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేందుకు మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనర్హుడు అని కొలరాడో కోర్టు ఇటీవల తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే కేసులో తీర్పు వెలువరించిన న్యాయమూర్తులకు పలువురి నుంచి బెదిరింపులు వస్తున్నట్లు సమాచారం. అలాగే జడ్జీలకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో తీవ్రమైన పదజాలంతో కొందరు పోస్టులు పెడుతున్నారని అడ్వాన్స్‌డ్ డెమోక్రసీ అనే ప్రభుత్వేతర సంస్థ తెలిపింది. కొలరాడో కోర్టు తీర్పు వెలువరించినప్పటి నుంచి జడ్జీలకు వ్యతిరేకంగా పలువురు పోస్టులు పెడుతున్నారు, ఈ రకమైన వ్యాఖ్యలు ఆందోళనకరం. జడ్జీలకు, వారి కుటుంబ సభ్యులకు హాని తలపెట్టాలని రెచ్చగొట్టే పోస్టులు పెడుతున్నారని వెల్లడించింది.

పిసి సర్కార్ ను విచారించిన ఇడి

కొల్‌కతా: ప్రఖ్యాత ఇంద్రజాలికుడు పిసి సర్కార్ (జూనియర్)ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి) శుక్రవారం విచారించింది. సర్కార్‌ను సాల్ట్ లేక్‌లోని తన కార్యాలయానికి పిలిపించుకున్న ఇడి అధికారులు పిన్‌కాన్ గ్రూప్, టవర్ ఇన్ఫోటెక్ లిమిటెడ్‌గా కేంద్ర ఏజెన్సీలు గుర్తించిన రెండు కంపెనీలకు సంబంధించిన స్కామ్‌లలో ఆయన ప్రమేయం గురించి ప్రశ్నించారు. 790 కోట్ల రూపాయలకు పైగా మదుపరులను మోసగించిన చిట్ ఫండ్ మోసానికి సంబంధించి కొనసాగుతున్న విచారణలో భాగంగా సర్కార్‌ను ప్రశ్నించినట్లు ఒక అధికారి తెలిపారు.శుక్రవారం మధ్యాహ్నం సర్కార్ సాల్ట్ లేక్‌లోని ఇడి కార్యాలయానికి చేరుకున్న వెంటనే ఇడి అధికారులు ప్రశ్నించారు. ఈ కుంభకోణాల్లో ఆయనకు ఏదైనా ప్రమేయం ఉందా లేదా అనేది మేము కనుగొనవలసి ఉంది" అని ఇడి అధికారి పిటిఐ కి తెలిపారు. కొద్ది రోజుల క్రితం టవర్ గ్రూప్‌కు చెందిన సీనియర్ అధికారిని ఇడి అదుపులోకి తీసుకుందని, అతనిని గ్రిల్ చేస్తున్నప్పుడు సోర్కార్ పేరు బయటపడిందని అధికారి తెలిపారు. 2021లో ఇదే కేసుకు సంబంధించి సర్కార్ బాలిగంజ్ నివాసంలో సిబిఐ సోదాలు నిర్వహించింది.

క్రేజీవాల్‌కు మూడోసారి ఇడి సమన్లు

న్యూఢిల్లీ : ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మరోసారి సమన్లు జారీ చేసింది. జనవరి 3వ తేదీన విచారణకు హాజరు కావాలని కోరింది. కేజ్రీవాల్‌కు ఇడి సమన్లు జారీ చేయడం ఇది మూడోసారి. ఢిల్లీ మద్యం కుంభకోణం వ్యవహారంలో మనీలాండరింగ్ కేసులో విచారణకు హాజరు కావాలని ఇప్పటికే రెండుసార్లు ఇడి సమన్లు జారీ చేయగా.. ఆయన రెండు సార్లూ గైర్హాజరయ్యారు. ఈ నేపథ్యంలో తాజాగా మరోసారి ఇడి అధికారులు కేజ్రీవాల్‌కు శుక్రవారం సమన్లు పంపారు. తొలుత నవంబర్ 2న విచారణకు హాజరు కావాలని ఇడి సమన్లు జారీ చేసింది. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం నేపథ్యంలో ఆయన గైర్హాజరయ్యారు. తరువాత మరోసారి ఈ నెల 21న విచారణకు హాజరు కావాలని సమన్లు జారీ చేసినా హాజరుకాలేదు. ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకే తమ రాజకీయ ప్రత్యర్థుల తరఫున తనకు సమన్లు జారీ అయ్యాయని కేజ్రీవాల్ ఆరోపించారు. కాగా, బుధవారమే కేజ్రీవాల్ 10 రోజుల విపాసన ధ్యాన శిక్షణకు గుర్తుతెలియని ప్రాంతానికి వెళ్లారు. ఆ సమయంలో ఈడీకి బదులిస్తూ.. తన జీవితంలో దాచడానికి ఏమీ లేదని పేర్కొన్నారు. "రాజకీయంగా ప్రేరేపితమైన సమన్లు ఉపసంహరించుకోవాలి. నేను నిజాయతీతో పారదర్శకంగా జీవిస్తున్నాను. నా జీవితంలో దాచడానికి ఏమీ లేదు. షెడ్యూల్ ప్రకారమే నేను విపాసన ధ్యాన కోర్సుకు వెళ్తానని అందరికీ తెలుసు. గత 25 ఏళ్లుగా నేను ఈ కోర్సుకు హాజరవుతున్నా' అని కేజ్రీవాల్ తెలిపారు.

300 మంది భారతీయులున్న విమానాన్ని నిలిపేసిన ఫ్రాన్స్

- మానవ అక్రమ రవాణాగా అనుమానం

పారిస్ : నికరాగువాకు చెందిన ఒక విమానం 300 మంది భారతీయ ప్రయాణీకులతో వెళ్తుండగా ఫ్రాన్స్ వైమానిక అధికారులు గురువారం అది ల్యాండ్ అయిన విమానాశ్రయంలోనే నిలిపేశారు. మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు అనుమానించి ఈ విమానాన్ని నిలిపివేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) నుంచి ఈ విమానం టేకాఫ్ అయినట్లు గుర్తించారు. ఈ విమానంలో మానవ అక్రమ రవాణాకు గురైన బాధితులున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీంతో విమానాన్ని ఆపేసినట్లు పారిస్ ప్రభుత్వ న్యాయవాది కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఘటనపై దేశ విద్రోహ నేర విభాగం (జునాల్కో) దర్యాప్తు చేస్తోందని పేర్కొంది. రోమానియన్ కంపెనీ లెజెండ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఎ340 విమానం ఇంధనం నింపుకోవడానికి పారిస్‌కు 150 కిలోమీటర్ల దూరంలోని వట్రీ విమానాశ్రయంలో ల్యాండ్ అవ్వగా..అందులో మానవ అక్రమ రవాణాకు గురైన బాధిత ప్రయాణికులున్నట్లు గుర్తించి అక్కడే నిలిపేశామని అధికారులు పేర్కొన్నారు. అయితే యుఎఇలో పనిచేసే 303 మంది భారతీయ ప్రయాణికులు విమానంలో ఉన్నారని, ఇంధనం నింపుకునేందుకు వట్రీలో ల్యాండ్ అయ్యిందని లెజెండ్ ఎయిర్‌లైన్స్ తెలిపింది. కాగా ఇందులో ఉన్నవారిని సెంట్రల్ అమెరికాకు తీసుకెళ్లి అక్కడ నుంచి అమెరికా లేదా కెనడాకు చట్ట విరుద్ధంగా తరలించనున్నట్లు తెలిసింది. వీరందరినీ తొలుత విమానంలోనే ఉంచిన అధికారులు అనంతరం టెర్మినల్‌లోని ఒక భవనానికి తరలించి వేర్వేరుగా వసతి కల్పించారు. ప్రస్తుతం వట్రీ విమానాశ్రయం వద్ద పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు. సాధారణంగా చౌక ధరలకు టిక్కెట్లు లభించే బడ్జెట్ విమాన సర్వీసులు ఈ ఎయిర్ పోర్టు నుంచి నడుపుతుంటారు. మానవ అక్రమ రవాణా నేరానికి ఫ్రాన్స్‌లో 20 ఏళ్ల వరకు జైలు శిక్ష విధించేలా చట్టాలున్నాయి.

నోయిడాలో మళ్లీ కోవిడ్

నొయిడా: ఉత్తరప్రదేశ్‌లోని గౌతమ్ బుద్ధ నగర్ జిల్లా నొయిడాలో చాలా నెలల తరువాత మొదటి కోవిడ్-19 కేసు నమోదయింది. నోయిడా వాసికి కోవిడ్ పరీక్ష నిర్వహించగా పాజిటివ్ అని తేలింది. గుర్గావ్‌లోనిసెక్టార్ 36లో ఉంటున్న 54 ఏళ్ల ఈ రోగి ఒక బహుళజాతి కంపెనీలో పనిచేస్తున్నాడని గౌతమ్ బుద్ధ నగర్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ శర్మ గురువారం తెలిపారు. ప్రస్తుతం అతనిని హోమ్ ఐసోలేషన్‌లో ఉంచామని, రోగి నమూనాను జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం ఢిల్లీకి పంపామని, ఫలితం కోసం వేచి చూస్తున్నామని వైద్య అధికారి తెలిపారు. జిల్లా నిఘా అధికారి, ప్రజారోగ్య నిపుణుడు డాక్టర్ అమిత్ కుమార్ మాట్లాడుతూ, రోగి ఈ నెల ప్రారంభంలో నేపాల్‌కు వెళ్లి, తిరిగి వచ్చిన తర్వాత గుర్గావ్ కార్యాలయంలో విధులకు హాజరయ్యాడని తెలిపారు. కోవిడ్-19 సబ్‌వేరియంట్ సాధారణ లక్షణాలు గొంతు నొప్పి, నీరసం, తలనొప్పి వంటివని డాక్టర్ అమిత్ కుమార్ తెలిపారు. నోయిడాను ఆనుకుని వున్న ఘజియాబాద్‌లో 3 కోవిడ్ కేసులు నమోదయ్యాయి. కేసులు పెరుగుతున్న నేపథ్యంలో, పౌరులు కోవిడ్ -19 ప్రోటోకాల్‌ను పాటించాలని, ఫేస్ మాస్కులు ధరించాలని, హ్యాండ్ శానిటైజర్‌లను ఉపయోగించాలని ఆరోగ్య శాఖ కోరింది.

భారత్‌లో మరోసారి కోవిడ్ విజృంభిస్తోంది. కొన్ని రోజులుగా కరోనా కేసులు వేగంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా జెఎన్.1 సబ్ వేరియంట్ వ్యాప్తి చెందుతోంది. దేశవ్యాపంగా గురువారం 594 కేసులు నమోదైనట్లు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ శుక్రవారం ఉదయం తెలిపింది. దీంతో దేశంలో క్రియాశీల కేసులు 2,311 నుండి 2,669కి పెరిగాయి. అలాగే గురువారం కేరళలో ముగ్గురు, కర్ణాటకలో ఇద్దరు, పంజాబ్‌లో ఒకరు సహా మొత్తం ఆరుగురు మరణించగా, మొత్తం మృతుల సంఖ్య 5,33,327కి చేరింది.

పద్మశ్రీ అవార్డు వాపస్

(మొదటి పేజీ తరువాయి)

నమోదు చేశారు' అని లేఖలో పునియా గుర్తు చేశారు. 'జనవరిలో 19 మంది బ్రిజ్ భూషణ్‌కు వ్యతిరేకంగా ఫిర్యాదు చేశారు. అయితే ఏప్రిల్ నాటికి ఈ సంఖ్య 7కి తగ్గింది. అంటే బ్రిజ్ భూషణ్ 12 మంది మహిళా రెజ్లర్లపై తన ప్రభావాన్ని చూపారు' అని పునియా తెలిపారు.

'న్యాయం కోసం మా పతకాలను గంగా నదిలో కలిపేద్దామనుకున్నాం. అప్పుడు కూడా అతడిపై చర్యలు తీసుకుంటామని కేంద్రం హామీ ఇచ్చింది' అని బజరంగ్ తన లేఖలో వెల్లడించారు.'కానీ, తాజా డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికల ఫలితాలతో రెజ్లింగ్ సమాఖ్య మళ్లీ బ్రిజ్‌భూషణ్ చేతుల్లోకే వెళ్లినట్లయ్యింది. ఈ ఫలితాలను భరించలేక సాక్షి మాలిక్ రిటైర్మెంట్ ప్రకటించింది. ఇప్పుడు మేం న్యాయం కోసం ఎక్కడికెళ్లాలో అర్థం కావట్లేదు. ఈ ప్రభుత్వం మాకు ఎంతో చేసింది. 2019లో నాకు పద్మశ్రీ దక్కింది. అర్జున, ఖేల్‌రత్న వంటి అవార్డులు కూడా వచ్చాయి. కానీ, ఈ రోజు మహిళా రెజ్లర్లు తమకు భద్రత లేని కారణంగా ఆటకు వీడ్కోలు పలకాల్సి వచ్చింది. ఇది నన్ను ఎంతగానో కుంగదీసింది. అందుకే నా పద్మశ్రీని మీకే (ప్రధాని మోడీ) తిరిగిచ్చేయాలని నిర్ణయించుకున్నా' అని పునియా తన లేఖలో వెల్లడించారు.

రాష్ట్రపతి, ప్రధాని సమాధానం చెప్పాలి : విజేందర్ సింగ్

సంజయ్ సింగ్ ఎన్నికకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న రెజ్లర్లకు ప్రముఖ బాక్సర్ విజేందర్ సింగ్ మద్దతుగా పలికారు. దీనిపై రాష్ట్రపతి, ప్రధానమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "ఒక క్రీడాకారుడిగా ఆమె (సాక్షి మాలిక్) బాధను నేను అర్థం చేసుకోగలను. రెజ్లింగ్‌లో ఒలింపిక్ పతకం సాధించిన ఏకైక క్రీడాకారిణి ఆమె. నేడు న్యాయం కోసం పోరాటం చేస్తున్నా కానీ, ఆమెకు న్యాయం జరగడం లేదు. దీంతో ఆవేదనకు గురైన ఆమె ఆటకు వీడ్కోలు పలికింది. తాజా పరిణామాలతో క్రీడారంగం మొత్తం అసంతృప్తికి గురైంది. ఇలాంటివి జరిగిన తర్వాత ఏ తల్లిదండ్రులైనా తమ కుమార్తెలను మైదానాలకు పంపిస్తారా? 'ఒలింపిక్ పతక విజేతకే న్యాయం జరగలేదంటే.. మాకు ఎలా న్యాయం జరుగుతుంద'ని కుమార్తెల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు' అని విజేందర్ సింగ్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ పరిణామాలతో ప్రజాస్వామ్య, న్యాయ వ్యవస్థలపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయని.. దీనికి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాన మంత్రి సమాధానం చెప్పాలని కోరారు.

చిన్నారి

మీ కోసం
తులసి ఆకులు నీళ్లలో వేసుకొని ప్రతిరోజూ తాగుతుంటే గొంతు ఇన్ఫెక్షన్ తగ్గుతుంది.

జీవన సౌరభం
విజయం కోసం ప్రయత్నించడమే జీవితం కాకూడదు. విలువల కోసం జీవించడమే జీవిత లక్ష్యం కావాలి.

JEEVANA జీవన the family

కోతి - మామిడి పండు

ఆకలితో ఒక్క కోతి
అలమటించసాగెను
అడవిలో అటునిటు
చూసుకుంటూనడిచెను.

ఒక్కచోట తియ్యనైన
మావిపండు దొరికెను
అబ్బబ్బో అనుకుంటూ
కూర్చుని తిన సాగెను.

తియ్యని ఇలాటి పండు
ఇంతవరకు చూడలే
ఇంకా కొన్ని దొరికినా
అందరికి పంచెదను

అనుకుంటూ వానర
మాలోచించ సాగెను
అంతలో కాకి బావ
అక్కడికేతెంచెను.

కోతి తన మనసులో
మాట విప్పి చెప్పెను
దానికి ఆ కాకి బావ
మంచి సలహా ఇచ్చెను

ఈ అడివిన మామిడి
తక్కువగా వున్నవి
పండు టెంక పాతిన
కొత్తమొక్క వొచ్చును.

కాకి మాట విన్నకోతి
గొయ్యితీసి టెంకపాతె
నీరు పోసి పాదు చేసి
మంచిగా సాగు చేసే.

కోరిక ఫలియించెను
మావిపిలకలొచ్చేను
ఆనతి కాలంలోనే
గున్నమావి పూసేను

కొమ్మకొమ్మ కాసెను
పక్షులొచ్చి చేరెను
మొక్కేసిన కోతమ్మకు
అభినందన తెలిపెను

తిన్నపండు విత్తనంబు
పాతండోయ్ బాలలు
మొక్కలొచ్చి కాపు కాసి
పండ్ల నిచ్చు పిల్లలు

- కూచిమంచి నాగేంద్ర,
91821 27880.

నేను గీసినబొమ్మ

రాహుల్
ఏడవ తరగతి
జడ్పీ హెచ్ యస్ పావెల
ఘణపూర్
మెదక్ జిల్లా

అంకెలు కలపండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన అంకెలను వరుసగా కలిపితే అందమైన బొమ్మ వస్తుంది. ట్రై చేయండి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలు పంపండి. ఇదిగో మెయిల్ ఐడి: chinnaarips@gmail.com

పట్టుదలతో పతకాలు సాధిస్తోంది...

'అమ్మ వంటింటికే పరిమితమా.. ఇల్లు, పిల్లలతోనే కాలక్షేపం చేయాలా..' అంటే.. కాదని, ఎంతోమంది మహిళలు పెళ్లయి, పిల్లల బాధ్యతలో తలమునకలౌతున్నా విభిన్న రంగాల్లో రాణిస్తున్నారు. వారి కోవలోకే చెందుతారు తెలంగాణకు చెందిన పార్వతీ శ్రీరామ్. ఇద్దరు బిడ్డల తల్లి. తెలంగాణ పెట్టుబడుల నిర్వహణ ఉద్యోగిగా రోజంతా కార్యాలయంలోనే పని. తీరికలేని పనులతో గడుపుతున్నా తనకంటూ ఓ గుర్తింపు సాధించుకున్నారు ఆమె. ఇటీవల మలేషియాలో జరిగిన అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతక విజేతగా నిలిచారు. ఆమె ప్రయాణం గురించి తెలుసుకుందాం.



'నాకు చిన్నప్పటి నుండి ఆటలంటే ఇష్టం. పాఠశాల రోజుల్లో హాకీ బాగా ఆడేదాన్ని. పలు పోటీల్లో కూడా పాల్గొన్నాను. ఆ తరువాత పెళ్లి, పిల్లలతో ఆవైపు చూడలేదు. పిల్లలు పుట్టిన తరువాత శారీరక ధృఢత్వం కోసం, రోజుకు 150 కిలోమీటర్లు సైక్లింగ్ చేసేదాన్ని. అయితే 2015లో ఓ ప్రమాదం నా జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. కఠినతర వ్యాయామాల జోలికి పోకుండా, తేలికపాటి యోగా చేయడం అలవాటు చేసుకున్నాను. అప్పుడే బరువైన వస్తువులను అలవోకగా ఎత్తే సామర్థ్యం నాలో ఉందని గ్రహించాను. కానీ రెండేళ్ల వరకు దానిపై శ్రద్ధ పెట్టలేదు. పోటీల్లో పాల్గొనాలనీ అనుకోలేదు. నన్ను నేను నిరూపించుకోవాలంటే ఏదైనా సాధించాలి అని మాత్రం నిరంతరం తపన పడేదాన్ని. అందుకే ఈ ఏడాది ఫిబ్రవరిలో పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనాలని గట్టిగా నిర్ణయించుకున్నాను' అంటున్న పార్వతి మార్చి నుండి పవర్‌లిఫ్టింగ్‌లో నైపుణ్య శిక్షణ తీసుకోవడం ప్రారంభించారు.

నెల రోజులకే పోటీలకు వెళ్లాను

'నెలరోజుల వ్యవధిలోనే అంటే ఏప్రిల్ నాటికే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. 250 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించాను. జులైలో వైజాగ్, రాజాంలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని వెండి పతకం సొంతం చేసుకున్నాను.

ఆ రోజు నేను విజయం సాధిస్తానని కూడా అనుకోలేదు. సీనియర్లతో పోటీపడాల్సి వచ్చింది. ఆ భయం మనసులో పెట్టుకోకుండా నా ముందు ఉన్న లక్ష్యాన్ని ఛేదించాను. పతకం సాధించాను. ఇప్పుడు కూడా మలేసియా పోటీల్లో పాల్గొనేటప్పుడు నా కోచ్ మాతో లేరు. మొదట చాలా కంగారు పడ్డాను. కానీ నేను ఎంతవరకు సాధించగలనో అది చేసి చూపించాలి. అంతకు మించి ఏ ఆలోచన మనసులో రాకూడదని గట్టిగా అనుకున్నాను' అంటూ తన క్రీడా విశేషాలు పంచుకున్నారు.

రోజంతా తీరిక లేకపోయినా

'ఉద్యోగ నిర్వహణలో, పిల్లల బాధ్యతలో నిరంతరం పని ఒత్తిడి ఉండేది. ఎప్పుడు విరామం దొరికితే అప్పుడు విశ్రాంతి తీసుకోవాలనిపించేది. నాకు దొరికిన సమయం కేవలం మూడు గంటలే. సాయంత్రం 6:30 నుండి 9:30 వరకు జిమ్‌లో ప్రాక్టీస్ చేసేదాన్ని. ఆ సమయంలోనే నన్ను నేను నిరూపించుకోవాలని నిరంతరం కష్టపడ్డాను. చివరికి సాధించాను' అంటున్న పార్వతి 2025లో జరిగే కామన్‌వెల్త్ పోటీల్లో పాల్గొనాలని లక్ష్యం పెట్టుకున్నారు. యువతులు, మహిళల కోసం పవర్ లిఫ్టింగ్‌లో ప్రత్యేక శిక్షణా శిబిరాన్ని నిర్వహించాలన్న ఆశయంతో ఉన్నారు. 'చాలామంది మహిళలు పవర్ లిఫ్టింగ్ వైపు వెళ్లాలని అనుకోరు. శరీరంలో మితిమీరిన మార్పులు వస్తాయని భయపడతారు. కానీ 30 ఏళ్లు దాటిన ప్రతి మహిళా శరీర దారుఢ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి' అంటున్నారు.

చర్మ సంరక్షణ ఇలా ...

చలికాలంలో చల్లగాలికి చర్మం పొడిబారుతుంది. తెల్లగా పగుళ్లు ఏర్పడతాయి. చర్మాన్ని కాపడుకునేందుకు ఈ సమయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

వేడి నీటితో స్నానం వద్దు : చలికాలంలో దాదాపు అందరూ వేడినీటితో స్నానం చేయడానికి ప్రాధాన్యం ఇస్తారు. దీనివల్ల చర్మ ఆరోగ్యం దెబ్బ తింటుంది. చర్మం మరింత పొడిగా తయారవుతుంది. కాబట్టి స్నానానికి ముందు శరీరం అంతా ఆయిల్ రాసుకుని గోరు వెచ్చని నీటితో స్నానం చేయాలి.

ఆరోగ్యకరమైన ఆహారం : శరీరం పొడి బారకుండా మంచినీళ్లు తాగుతుండాలి. దాంతో పాటు నీరు శాతం ఎక్కువగా ఉన్న సొరకాయ, దోశకాయ, పొట్లకాయ, ఆకుకూరలు తినాలి. ఈ సీజన్‌లో దొరికే సి, ఎ విటమిన్స్ ఉన్న కమల, యాపిల్, ద్రాక్ష పండ్లను తీసుకోవాలి.

వ్యాయామం : వ్యాయామంతో చర్మానికి రక్త ప్రసరణ పెరుగుతుంది. శరీరంలో ఆక్సీకరణ స్థాయిలు వృద్ధి చెంది, శరీరానికి తగినంత ఆక్సిజన్ అందుతుంది. రక్తం చర్మ కణాలను కీలక పోషకాలతో నింపుతుంది. దీంతో చర్మ ఆరోగ్యం మెరుగవుతుంది. నడక, పరుగు లేదా ఏదైనా ఇతర ఆటలు ఆడటం ద్వారా ఆరోగ్యకర రక్తప్రసరణ జరిగి, చర్మాన్ని కాపాడుకోవచ్చు.

శనగపిండి మిశ్రమం : కప్పు శెనగపిండిలో చిటికెడు పసుపు, కొద్దిగా పెరుగు లేదా పాలు కలుపుతూ పేస్ట్‌లా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని స్నానానికి ముందు శరీరానికి పట్టించాలి. కాసేపటి తర్వాత మృదువుగా రుద్దుకోవాలి. అరగంటయ్యాక స్నానం చేయాలి. దీని వల్ల చల్లగాలులకు చర్మం పొడిబారకుండా ఉంటుంది.

తక్కువ గాఢత ఉన్న సబ్బు : గాఢత గుణాలు అధికంగా ఉన్న సబ్బుల్ని వాడడం వల్ల చర్మం మరింత పొడిబారిపోయే ప్రమాదం ఉంది. ఈ కాలంలో గ్లిజరిన్ ఆధారిత సబ్బుల్ని ఉపయోగించడం మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. చర్మతత్వాన్ని బట్టి ఏ సబ్బు సరిపోతుందో, పరిశీలించి వాడాలి.

రంగవల్లి

బి. పుష్ప కుమారి,
మోపాడు,
కందుకూరు మండలం, నెల్లూరుజిల్లా.

11 చుక్కలు
1 వచ్చేవరకు (సరిచుక్క)

ముగ్గులు పంపవల్సిన మా చిరునామా :
మెయిల్ ఐడి : jeevanapageps@ gmail.com
వాట్సాప్ : 83329 25496

రాస్తారోకోలు, భారీ ర్యాలీలు

11వ రోజూ కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా విజయవాడలో ధర్నాలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు వడ్డే శోభనాద్రీశ్వరరావు, వి.కృష్ణయ్య, వై.కేశవరావు, ఎం.హరిబాబు, కె.ప్రభాకర్‌రెడ్డి, కెవివి.ప్రసాద్ తదితరులు

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ మాటలకు, ఫుడ్ కమిటీ చైర్మన్ చింతా ప్రతాపరెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు రాస్తారోకోలు నిర్వహించారు. సమ్మెలో భాగంగా 11వ రోజు వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగించారు. వీరి పోరాటానికి సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీ, టిడిపి, జనసేన పార్టీ, సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

వైఎస్‌ఆర్ జిల్లా మైదుకూరులో రాష్ట్ర ఫుడ్ కమిటీ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్‌రెడ్డిని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు అడ్డుకొని ఆయన కారు ముందు బైటాయించారు. నోటికొచ్చినట్లు మాట్లాడినందుకు తమకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ, తాను తీసిన వీడియోను మీకు ఎవరో కట్ చేసి పంపారని, త్వరలో పూర్తి వివరాలతో మరొక వీడియో తీసి యూట్యూబ్‌లో పెడతానని అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు అనుకూలంగా ఉంటానని హామీ ఇచ్చారు. ప్రభుత్వంతో వీలైనంత త్వరగా మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో, వారు శాంతించారు. బాపట్ల జిల్లా మార్టూరులో అంగన్‌వాడీల రాస్తారోకోతో నిలిచిపోయిన ట్రాఫిక్‌లో శ్రీకాకుళం నుండి తిరుపతి వెళ్తున్న మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు కాన్వాయ్ చిక్కుకుపోయింది.

ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ ధర్నా చౌక్ వద్ద అంగన్‌వాడీలు ర్యాలీగా వచ్చి బైటాయించి రాస్తారోకో చేశారు. రైతు సంఘాల సమన్వయ సమితి, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు), ఆశా వర్కర్స్ యూనియన్, ముఠా వర్కర్స్ యూనియన్ తదితర సంఘాల నేతలు, కార్యకర్తల పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలో మోడీని, రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గద్దెదించితేనే అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కారమవుతాయన్నారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో కె.ఉమామహేశ్వరరావు, కెవివి.ప్రసాద్, వి.కృష్ణయ్య, వై కేశవరావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు జిల్లా కౌతాళం మండలం ఎరిగేరిలో అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసేందుకు ఆహారం తీసుకొచ్చిన వాహనాన్ని అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. నంద్యాల జిల్లా శ్రీశైలం ప్రాజెక్టు రోడ్డుపై చేశారు. తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం ముందు అంగన్‌వాడీలు రాస్తారోకో నిర్వహించారు. వారి పోరాటానికి మాజీ ఎంఎల్‌సి కత్తి నరసింహారెడ్డి మద్దతు ప్రకటించారు. నెల్లూరులో ఆర్‌టిసి బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా వచ్చి అక్కడ బైటాయించారు. గుంటూరులో కలెక్టరేట్ ఎదుట రహదారిపై అంగన్‌వాడీలు బైటాయించి రాస్తారోకో నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులు ఎర్ర చీరలు ధరించి, కోలాటం ప్రదర్శించి వారిలో ఉత్సాహం నింపారు. దుగ్గిరాలలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుకు అంగన్‌వాడీలు వినతిపత్రం ఇచ్చారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో రాస్తారోకో చేశారు. పిడుగురాళ్లలో మోకాళ్లపై నిలిచి నిరసన తెలిపారు. చిలకలూరిపేటలో భారీ ప్రదర్శన, రాస్తారోకో నిర్వహించారు. ఏలూరులో ర్యాలీ, జిల్లా పరిషత్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు మాట్లాడుతూ మహిళా పక్షపాతినని చెప్పుకునే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల ముందు అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించి సమ్మెను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి, శ్రీకాకుళం జిల్లాల్లో, కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురంలో మానవహారాలు, రాస్తారోకోలు నిర్వహించారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహానికి ఎదుట అంగన్‌వాడీల రాస్తారోకోలో నిర్వహించారు. వారి పోరాటానికి ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, టిడిపి ఎమ్మెల్యే గణబాబు, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర మహిళా కన్వీనర్ డాక్టర్ శీతల్, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ తదితరులు మసంఘీభావం తెలిపారు. అనకాపల్లి జిల్లా కశింకోటలో దీక్షా శిబిరం వద్ద సుత్తి కొడవలి ఆకారంలో అంగన్‌వాడీలు కూర్చొని నిరసన తెలిపారు. ఈ దీక్షా శిబిరాన్ని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు సందర్శించి సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కారం చేస్తామన్న తొలుత చెప్పిన రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి, ఇప్పుడు సాధ్యం కాదని చెప్పడం దారుణమన్నారు. అనకాపల్లి జిల్లా చీడికాడలో జాయింట్ కలెక్టర్, ఆర్‌డిఒ కార్లను అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. నర్సీపట్నంలో అంగన్‌వాడీలు మానవహారం చేపట్టారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మద్దతు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగించారు. విజయనగరంలో జాతీయ రహదారిపై బైటాయించారు.

విశాఖ జిల్లాలో స్పృహ కోల్పోయిన యూనియన్ నాయకురాలు

విశాఖ జిల్లా తగరపువలసలో రాస్తారోకోను అడ్డుకోవడానికి పోలీసులు ప్రయత్నించడంతో జరిగిన తోపులాటలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు కె.వెంకటలక్ష్మి స్పృహ కోల్పోయారు. ఒక అంగన్‌వాడీ కార్యకర్తను మహిళా కానిస్టేబుల్ బూటు కాలితో తన్నారు. మొత్తం 60 మందిని పోలీసులు అరెస్టు చేసి, అనంతరం విడిచిపెట్టారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం, పెనుకొండలో రాస్తాకోకో చేస్తున్న అంగన్‌వాడీలను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసేందుకు ప్రయత్నించారు. దీనిని అంగన్‌వాడీలు ప్రతిఘటించడంతో పోలీసులు వెనక్కి తగ్గారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారిపై, బంటుమిల్లి లక్ష్మీపురం సెంటర్లో, కంకిపాడు మెయిన్ సెంటర్లో అంగన్‌వాడీలు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి మద్దతుగా నిలిచిన సిఐటియు నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఆ తర్వాత వారిని విడుదల చేశారు. తిరుపతి జిల్లా పుత్తూరులో అంగన్‌వాడీల రాస్తారోకోను చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నంతో కొంతసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రకాశం జిల్లా బాపట్ల కంభంలో కందులాపురం సెంటర్‌లో అంగన్‌వాడీల మానవహారాన్ని పోలీసులు అడ్డుకోవడానికి పోలీసులు ప్రయత్నించడంతో తోపులాట జరిగింది

పోలీసుల దాడిలో సొమ్మసిల్లిన అంగన్‌వాడీలు

ఆట, పాటల ద్వారా నిరసన

సమ్మె శిబిరాల్లో అంగన్‌వాడీలు ఆట, పాటల ద్వారా వినూత్న రీతిలో నిరసన తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో 'జగన్ గోవిందా... గోవిందా'.. అంటూ పాటలు పాడారు. 'జీతం పెంచుతా అన్నారు... గోవిందా..!, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇస్తామన్నారు.. గోవిందా..!, ఇఎస్ఐ, పిఎఫ్ ఇస్తామన్నాడు... గోవిందా..!, మా సమస్యలు తీర్చలేని జగన్ గోవిందా... గోవిందా...!, జగన్‌మోహన్‌రెడ్డి గోవిందా'... అంటూ పాటలు పాడుతూ సమ్మె కొనసాగించారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండల కేంద్రంలోకోలాటం ఆడుతూ, పాటలు పాడుతూ నిరసన తెలిపారు. ఏలూరులో కబడ్డీ, గొబ్బెమ్మ ఆటలాడి, సినిమా పాటలు పాడి నిరసన వ్యక్తం చేశారు.

పట్టు బిగిస్తున్న భారత్

- మంధాన, రీచా, రోడ్రిగ్స్, దీప్తి అర్ధసెంచరీలు
- ఆస్ట్రేలియాతో ఏకైక టెస్ట్‌లో 157పరుగుల ఆధిక్యత

దీప్తి, పూజ సెంచరీ భాగస్వామ్యం

ముంబయి: ఆస్ట్రేలియా మహిళలతో జరుగుతున్న ఏకైక టెస్ట్‌లో భారత మహిళలజట్టు పట్టు బిగిస్తోంది. రెండోరోజైన శుక్రవారం ఆట నిలిచే సమయానికి భారతజట్టు ఏడు వికెట్ల నష్టానికి 376పరుగులు చేసింది. దీంతో ఆసీస్‌పై ఇప్పటికే 157పరుగుల ఆధిక్యత లభించింది. క్రీజ్‌లో దీప్తి శర్మ(70), పూజా వస్త్రాకర్(33) ఉన్నారు. వీరిద్దరూ ఎనిమిదో వికెట్‌కు ఇప్పటికే 102 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆసీస్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 219 పరుగులకే ఆలౌటైన సంగతి తెలిసిందే. ఓవర్‌నైట్ స్కోర్ వికెట్ నష్టానికి 98పరుగులతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ స్నేహ్ రాణా(9) రూపంలో రెండో వికెట్‌ను కోల్పోయింది. స్మృతి మంధాన(74), స్నేహ్ రాణా కలిసి రెండో వికెట్‌కు 50 పరుగులు జోడించారు. ఆ తర్వాత స్వల్ప వ్యవధిలో వీరిద్దరూ ఔటయ్యారు. అనవసర పరుగుకు మంధాన ప్రయత్నించి రనౌటైంది. ఆ తర్వాత రిచా ఘోష్(52), జెమీమా రోడ్రిగ్స్(73) అర్ధసెంచరీలతో రాణించి 4వ వికెట్‌కు 113పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ క్రమంలో వీరిద్దరూ అర్ధ సెంచరీలను పూర్తి చేసుకున్నారు. మరోసారి ఆసీస్ బౌలర్లు చెలరేగి వారిద్దరితోపాటు యాస్టికా భాటియా(1)తోపాటు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్(0)ను ఔట్ చేశారు. దీంతో ఆసీస్ పట్టు బిగించేలా కనిపించింది. ఈ క్రమంలో దీప్తి శర్మ-పూజా వస్త్రాకర్ మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడి భారత్‌కు భారీ ఆధిక్యతను సంపాదించిపెట్టారు. ఇంగ్లండ్‌పై ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చిన దీప్తి శర్మ అర్ధసెంచరీకి తోడు, పూజ వస్త్రాకర్ క్రీజ్‌లో ఉన్నారు. ఆసీస్ బౌలర్లు గార్డినర్‌కు నాలుగు, కిమ్ గ్రాత్, జొనాసెన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

స్కోర్‌బోర్డు...

ఆస్ట్రేలియా మహిళల తొలి ఇన్నింగ్స్: 219ఆలౌట్

భారత మహిళల తొలి ఇన్నింగ్స్: షెఫాలీ వర్మ (ఎల్‌బి)జొన్నాసెన్ 40, స్మృతి మంధాన (రనౌట్) గ్రాత్/గార్డినర్ 74, స్నేహ్ రాణా (బి)గార్డినర్ 9, రీచా ఘోష్ (సి)గార్డినర్ (బి)కిమ్ గ్రాత్ 52, జెమిమా రోడ్రిగ్స్ (సి)సదర్లాండ్ (బి)గార్డినర్ 73, హర్మన్‌ప్రీత్ కౌర్ (ఎల్‌బి)గార్డినర్ 0, యాస్టికా భాటియా (ఎల్‌బి)గార్డినర్ 1, దీప్తి శర్మ (బ్యాటింగ్) 70, పూజ వస్త్రాకర్ (బ్యాటింగ్) 33, అదనం 24. (119ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 375పరుగులు. **వికెట్ల పతనం:** 1/90, 2/140, 3/147, 4/260, 5/261, 6/265, 7/274 **బౌలింగ్:** లారెన్ ఛట్లీ 9-3-23-0, కిమ్ గ్రాత్ 10-1-49-1, ఎలీసా ఫెర్రీ 4-0-31-0, ఎలీసా గార్డినర్ 41-7-100-4, జొన్నాసెన్ 18-4-42-1, సథర్లాండ్ 8-2-20-0, ఎలేనా కింగ్ 19-1-69-0, తహిలా మెక్‌గ్రాత్ 10-2-22-0

అంతర్జాతీయ క్రికెట్‌కు ఎల్గర్ గుడ్‌బై

భారత్‌తో టెస్టులే చివరివంటూ ప్రకటన

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ డీన్ ఎల్గర్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. భారత్‌తో జరిగే రెండు టెస్టుల సిరీస్ అనంతరం క్రికెట్‌నుంచి పూర్తిగా వైదొలుగుతున్నట్లు తెలిపాడు. 2012లో పెర్త్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టులో అరంగేట్రం చేసిన ఎల్గర్.. 84టెస్టులు, 8 వన్డేలు ఆడాడు. టెస్టుల్లో 149 ఇన్నింగ్స్‌లలో 5,146 పరుగులతో సహా 13 సెంచరీలు, 23 అర్ధ సెంచరీలూ కొట్టాడు. 8 వన్డేల్లో 104 పరుగులే చేశాడు. 2018 తర్వాత వన్డేల్లో చోటు దక్కలేదు. ఈ ఏడాది ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లలో టెస్టు సిరీస్‌లు కోల్పోయింది. దీంతో దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు టెంబు బవుమా సారథ్య బాధ్యతలు అప్పగించింది.

కోహ్లి తిరుగు పయనం..

గాయంతో గైక్వాడ్ కూడా.. టెస్ట్ సిరీస్‌కు దూరం

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో టెస్ట్ సిరీస్‌కు ముందు టీమిండియాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి వ్యక్తిగత కారణా రీత్యా భారత్‌కు తిరుగు పయనమైనట్లు బిసిసిఐ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొంది. కోహ్లి తిరుగు ప్రయాణానికి గల కారణాలను ఆ ప్రకటనలో వెల్లడించలేదు. దక్షిణాఫ్రికా పర్యనటకు బిసిసిఐ మూడు ఫార్మాట్‌లకు మూడు వేర్వేరు జట్లను ప్రకటించగా.. కోహ్లికి టెస్టుల్లో మాత్రమే ఆడేందుకు చోటు దక్కింది. మంగళవారం నుంచి తొలిటెస్ట్ ప్రారంభం కానునండగా.. ఇటీవల దక్షిణాఫ్రికాకు పయనమై వెళ్లాడు. అలాగే రుతురాజ్ గైక్వాడ్ వేలికి గాయం కావడంతో అతడూ టెస్ట్ సిరీస్‌కు దూరమయ్యాడు. ఈ టెస్ట్ సిరీస్‌లో నెగ్గితే భారత్‌కు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి)కు పాయింట్లు జమ కానున్నాయి. దీంతో భారత్‌కు ఈ సిరీస్ గెలుపు తప్పనిసరి. దక్షిణాఫ్రికాతో రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ డిసెంబర్ 26న సూపర్‌స్పోర్ట్ పార్క్ వేదికగా ప్రారంభం కానుంది.

ఐదో టి20లో విండీస్ గెలుపు

సిరీస్ 3-2తో కైవసం

హోప్(43నాటౌట్)

బార్బొడాస్: సిరీస్ నిర్ణాయక మ్యాచ్‌లో విండీస్ జట్టు సత్తా చాటింది. గురువారం అర్ధరాత్రి జరిగిన ఐదో, చివరి టి20లో వెస్టిండీస్ జట్టు 4వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ నిర్ణీత 19.3 ఓవర్లలో 132పరుగులకు ఆలౌట్ అయ్యింది. మోటీకి మూడు, హోల్డర్, హొసైన్, రస్సెల్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ లక్ష్యాన్ని విండీస్ జట్టు 19.2 ఓవర్లలో 6వికెట్లు నష్టపోయి 133పరుగులు చేసి గెలిచింది. హోప్(43నాటౌట్), రూథర్ట్‌ఫోర్డ్(30) బ్యాటింగ్‌లో రాణించారు. టోప్లే, ఆదిల్ రషీద్‌కు రెండేసి వికట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మోటీకి, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ ఫిల్ సాల్ట్‌కు దక్కాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68